RNI Reg-No. 69176/96

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Medchal Malkajgiri
CIRCULATED THROUGHOUT TELANGANA STATE

సంపుటి :31 సంచిక : 246 హైదరాబాద్ సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: శుక్రవారం 10-04-2026 పేజీలు : 12 వెల: 1-00

## ఎండల తీవ్రత..

ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్



**హైదరాబాద్, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలంగాణలో ఎండలు మండుతున్నాయి. ఉదయం 10 గంటల నుంచే భానుడి భగభగలు పెరుగుతున్నాయి. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మరో 3 డిగ్రీలు పెరుగుతాయని వాతావరణశాఖ హెచ్చరించింది. గురువారం ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, మిగతా అన్ని జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.



# జూన్ 2 నుంచి స్కూల్ విద్యార్థులకు అల్పాహారం

### ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం: డిప్యూటీ సిఎం భట్టి విక్రామర్క వెల్లడి

**ఖమ్మం, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కేసీఆర్ హయాంలోని పదేళ్ల వనరులు దోపిడీకి గురికావటం వల్ల తెలంగాణలో అభివృద్ధి జరగలేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. విద్య ద్వారానే తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. గురువారం ఎర్రుపాలెంలో మిగతా 2లో..

## ఈసారి బెంగాల్ అంతటా 'నందిగ్రామ్' ఫలితమే

### హల్దియాలో ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ



**హల్దియా, ఏప్రిల్ 9 (ఆర్ఎన్ఎ):** పశ్చిమబెంగాల్‌లోని హల్దియాలో ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ తృణమూల్ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. 5ఏళ్ల క్రితం నందిగ్రామ్‌లో మమతా బెనర్జీ ఓటమిని గుర్తు చేస్తూ.. ఈసారి బెంగాల్ అంతటా అదే ఫలితం వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. "బెంగాల్ మార్పును కోరుకుంటోంది. ఈ క్రమంలో భాజపా భారీ విజయాన్ని మనం తప్పకుండా చూస్తాం. నందిగ్రామ్‌లో 5ఏళ్ల క్రితం ఏం జరిగిందో ఇప్పుడు.. భవానీపుర్‌తో పాటు మొత్తం బెంగాల్‌లోనూ అదే ఫలితం వస్తుంది. ఇవి సాధారణ ఎన్నికలు కావు. అభివృద్ధికి, బెంగాల్ చరిత్రను తిరగరాయడానికి ఎంతగానో తోడ్పడతాయి. భారత్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ టీఎంసీ ప్రభుత్వం బెంగాల్ అభివృద్ధి విషయంలో అడ్డుపడుతోంది. ప్రైవేటు సెక్టార్లలో సామాన్యులను ఉద్యోగాల నుంచి తొలగించి చొరబాటుదారులకు అవకాశం కల్పిస్తోంది. భాజపా అధికారంలోకి రాగానే రాజ్యాంగం ప్రకారం టీఎంసీ చేసిన మోసాలను బయటకు తీస్తాం. బెంగాల్ యువతకు వ్యతిరేకంగా తృణమూల్ చేసిన పాపాలు వందేళ్లు గడిచినా తొలగిపోవు" అని మోదీ మిగతా 2లో..

## జీవన్‌రెడ్డిని కాంగ్రెస్ అన్నివిధాల ఆదరించింది

- గతంలో కెసిఆర్ పాలనను విమర్శించింది మరిస్తే ఎలా
- పొంగులేటిపై ఆరోపణలు కాదు..దమ్ముంటే చర్చకు రావాలి
- మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మాజీ మంత్రి జీవన్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్న సందర్భంగా ఈ విషయంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ చాలా చేసిందని ప్రస్తావించారు. ఆయనకు ఉన్నతమైన గౌరవం ఇచ్చిందన్నారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ 14 సార్లు బీ ఫాం ఇచ్చిందని గుర్తుచేశారు. గురువారం గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. ప్రజలు ఎన్నుకున్న నేత సీఎం రేవంత్‌రెడ్డి అని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి మిగతా 2లో..

## ఎమ్మెల్యే పల్లాను బురిడీ కొట్టించిన సైబర్ నేరగాడు

### కేంద్ర పథకం చెప్పి లక్ష రూపాయాలు లూటీ,,, పోలీసులను ఆశ్రయించిన జనగామ ఎమ్మెల్యే



**జనగామ, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఇప్పటి వరకు అనేకమందిని బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు తాజాగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సైబర్ నేరస్థుడి చేతిలో మోసపోయారు. ఆయన నుంచి ఓ సైబర్ నేరస్థుడు రూ.లక్ష కొట్టేశాడు. ఈనెల 5న హైదరాబాద్‌లో ఉన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరెడ్డికి ఓ అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి.. తాను ఫైనాన్స్ అడిషనల్ సెక్రటరీ అంటూ పరిచయం చేసుకున్నాడు. ఓ కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా నిరుద్యోగ యువతకు రూ.10 లక్షల వరకు రుణాలు ఇచ్చే అవకాశం ఉందని ఎమ్మెల్యేకు చెప్పాడు. దీనికిగాను ఒక్కొక్కరికి రూ.2500 చెల్లించాలని నమ్మబలికాడు. దీంతో తన నియోజకవర్గంలోని యువతకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో సదరు మిగతా 2లో..

## ఏపీ, తెలంగాణ ఆదాయ పన్ను ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా సురేశ్ బత్తిని



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 (ఆర్ఎన్ఎ):** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఆదాయపన్ను ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా మరోసారి తెలుగు అధికారికే అవకాశం వచ్చింది. ఆదాయ పన్ను ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా సురేశ్ బత్తిని నియమితులయ్యారు. ప్రస్తుతం ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా మోరంపూడి అనిల్ కుమార్ ఉన్నారు. ఆయన స్థానంలో సురేశ్ బత్తిని బాధ్యతలు తీసుకుంటారు.

## పురుషులనూ అనుమతించని ఆలయాలున్నాయ్

### 'శబరిమల' అంశంపై కేంద్రం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 (ఆర్ఎన్ఎ):** కేరళలోని ప్రసిద్ధ శబరిమల ఆలయంలో 10-50 ఏళ్ల వయసు మహిళల ప్రవేశంపై ఉన్న ఆంక్షలను కేంద్ర ప్రభుత్వం మరోసారి సమర్థించింది. ఇది మహిళలపై వివక్ష కాదని, ఏళ్లుగా కొనసాగుతోన్న ఆచారాన్ని గౌరవించడమేనని పేర్కొంది. మన దేశంలో పురుషులనూ అనుమతించని ఆలయాలు కూడా ఉన్నాయని సుప్రీంకోర్టుకు తెలిపింది. 'శబరిమల ఆలయం సహా మిగతా 2లో..

## తల్లిదండ్రులను చూసుకునే బాధ్యత పిల్లలదే

### మంత్రి సీతక్క వ్యాఖ్యలు



**మహబూబాబాద్, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తల్లిదండ్రులను వృద్ధాప్యంలో ప్రేమగా చూసుకోవడం పిల్లల బాధ్యత అని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. సమాజంలో వృద్ధుల పట్ల గౌరవం, ఆదరణ పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గురువారం మహబూబాబాద్‌లో మంత్రి సీతక్క పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మీడియాతో మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, పాలిచ్చే తల్లులకు అందించే పౌష్టికాహార పంపిణీని కచ్చితంగా పర్యవేక్షించేందుకు స్మార్ట్ ఫోన్లు రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా లబ్దిదారుల వివరాలు, ఆహార పంపిణీ వివరాలు నమోదు చేసి పారదర్శకత పెంచుతామని చెప్పుకొచ్చారు. ఆరేళ్లలోపు పిల్లలు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడం తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## ఇంధన కొరత ఆందోళనలు..

### గల్ఫ్ దేశాలకు కేంద్ర మంత్రులు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 (ఆర్ఎన్ఎ):** అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ.. దేశీయంగా ఇంధన కొరతపై ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురీ ఖతార్ పర్యటనకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. హర్దీప్ సింగ్ పురీ ఈరోజు, రేపు ఖతార్‌లో పర్యటించనున్నట్లు సంబంధిత శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. ఆయన పర్యటనకు సంబంధించి స్పష్టమైన కారణాన్ని మాత్రం వెల్లడించలేదు. కాగా.. ఇరాన్ ప్రతీకార దాడులకు గురైన గల్ఫ్ దేశాల్లో ఖతార్ కూడా ఒకటి. ఈ దాడుల నేపథ్యంలో ఎల్ఎన్‌జీ ఉత్పత్తి, ఎగుమతులను ఖతార్ అధికారులు నిలిపివేశారు. తాజాగా కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో ఉత్పత్తులను పునఃప్రారంభించాలని అక్కడి అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా పరిమిత కార్యకలాపాలే నిర్వహించాలని నిర్ణయించుకున్నట్లు అధికార వర్గాలను ఉటంకిస్తూ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హర్దీప్ సింగ్ పురీ ఖతార్‌కు వెళ్తుండటం ప్రాధాన్యం సంతరించుకొంది.

**యూఏఈకి జైశంకర్..**

భారత విదేశాంగ మంత్రి జై శంకర్ కూడా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పర్యటించేందుకు సిద్ధమయ్యారు. ఈనెల 11-12 తేదీల్లో జై శంకర్ పర్యటన ఉండనున్నట్లు సంబంధిత శాఖ మిగతా 2లో..

## బహదూర్‌పల్లి స్క్రాప్ గోదాంలో అగ్నిప్రమాదం

### సకాలంలో మంటలు ఆర్పడంతో తప్పిన ముప్పు



**మేడ్చెల్, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మేడ్చల్ జిల్లాలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. దుండిగల్ పరిధి బహదూర్‌పల్లి గ్రీన్‌హిల్స్ కాలనీలోని డెకరేషన్ స్క్రాప్ గోదాంలో మంటలు చెలరేగాయి. అగ్నికీలలు వేగంగా వ్యాపించడంతో పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌లో పార్క్ చేసిన వాహనాలకు కూడా మంటలు అంటుకున్నాయి. ఈ అగ్ని ప్రమాదం కారణంగా కాలనీలో దట్టమైన పొగ వ్యాపించింది. ఎగిసిపడుతున్న మంటలు, కమ్మేసిన పొగతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. అగ్ని ప్రమాదంపై సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేసేందుకు యత్నిస్తున్నారు. మరోవైపు జీడిమెట్ల పారిశ్రామిక వాడలోనూ భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

మొదటి పేజీ తరువాయిలు

# ఈసారి బెంగాల్ అంతటా 'నందిగ్రామ్' ఫలితమే

వెల్లడించారు. "ఒక్కసారి డబుల్- ఇంజిన్ సర్కార్ అధికారంలోకి రాగానే కేంద్ర ప్రభుత్వ పథకాలన్నీ ఇక్కడ అమల్లోకి వస్తాయి. అవి ప్రతిఒక్కరికీ ఉపయోగపడేవే. బెంగాల్ ప్రజలకు ఆరు హామీలు ఇస్తున్నాను.

భాజపా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజల భయాలను పూర్తిగా తొలగించి నమ్మకాన్ని కలిగించడంతో పాటు చట్టబద్ధమైన పాలనను కొనసాగిస్తాం.

- భాజపా ప్రభుత్వంలో పని చేసే యంత్రాంగం ప్రజలకు కచ్చితంగా జవాబుదారీగా వ్యవహరిస్తుంది.
- అన్యాయం జరిగిన ఆడబిడ్డల కేసులను రీఓపెన్ చేస్తాం. అవినీతికి సాయం చేస్తున్న చట్టాలను రూపుమాపుతాం.
- తృణమూల్ ప్రభుత్వంలో కుంభకోణాలు, అవినీతి చేసిన వారందరినీ జైలుకు పంపిస్తాం. అది మంత్రులైనా, వారి వాచ్‌మెన్‌లైనా సరే..
- శరణార్థులకు రాజ్యాంగం ప్రకారం ప్రత్యేక హక్కులను కలిగిస్తాం. కానీ చొరబాటుదారులను మాత్రం దేశం నుంచి తరిమికొడతాం.
- ఒక్కసారి భాజపా అధికారంలోకి రాగానే 7వ వేతన కమిషన్‌ను అమల్లోకి తీసుకొస్తాం" అని హామీ ఇచ్చారు.

# జీవన్‌రెడ్డిని కాంగ్రెస్ అన్నివిధాల ఆదరించింది

పోవాలి.. మార్పు రావాలి అనడానికి జీవన్ రెడ్డి ఎవరు..? అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో జరిగిన అవినీతి గురించి అనేక సార్లు జీవన్ రెడ్డి విమర్శించారని మహేశ్ కుమార్ గౌడ్ ప్రస్తావించారు. వాటిని మరచి ఇవాళ జీవన్ రెడ్డి మాట్లాడడం సరికాదన్నారు. ఆయనకు ఇష్టం లేకపోతే చేసేదేమీ లేదని, కానీ విమర్శలకు కూడా ఓ హద్దు ఉండాలని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై వస్తున్న ఆరోపణలపై మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. పొంగులేటి అవినీతిపై ఆధారాలు ఉంటే చర్చకు రావాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. ఆధారాలు చూపిస్తే చర్యలు తప్పకుండా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆధారాలు ఉంటే పట్టుకొని గాంధీ భవన్‌లో చర్చకు రావాలని సవాల్ విసిరారు. బట్ట కాల్చి మీద వేస్తామంటే కుదరదని హెచ్చరించారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో అప్పటి మంత్రులు చాలా దోచుకున్నారని ఆరోపించారు. జేబులు నింపుకొని ఈరోజు తమ మంత్రులపై విమర్శలు చేస్తారా? అని ఆగ్రహించారు. ఆనాటి దోపిడీ గురించి కేసీఆర్ కూతురు కవిత చెబుతోందన్నారు. కేసీఆర్ హయాంలో నాసిరకం ప్రాజెక్టులు కట్టి డబ్బులు దోచుకున్నారని మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు.

# పురుషులనూ అనుమతించని ఆలయాలున్నాయ్

ప్రార్థనా స్థలాల్లో మహిళలపై వివక్ష' కేసుపై సుప్రీంకోర్టు మూడోరోజు గురువారం కూడా విచారణ కొనసాగించింది. ఈసందర్భంగా కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది సభ్యుల విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి సమర్పించారు. ఇందులో పలు ఆలయాల గురించి ప్రస్తావించారు. "మన దేశంలో పురుషులకు ప్రవేశం లేని ఆలయాలు కూడా ఉన్నాయి. దేవి భగవతి ఆలయంలో కొన్నేళ్లుగా ఇలాంటి ఆచారం కొనసాగుతోంది. ఇక కేరళలోని ఓ ఆలయంలోకి అబ్బాయిలు మహిళల వేషధారణలో వెళ్తారు. అందుకోసం వారు బ్యూటీపార్లర్‌కు వెళ్లి మరీ అమ్మాయిల్లా తయారవుతారు. కాబట్టి ఇది పురుషాధిక్య లేదా స్త్రీ ఆధిక్య మత విశ్వాసాలకు సంబంధించిన ప్రశ్న కాదు" అని తుషార్ మెహతా తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. శబరిమలలో 10-50 ఏళ్ల మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ 2018లో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ వయసు మహిళలకు ఆలయంలోకి ప్రవేశం నిరాకరణ.. అంటరానితనంగా, రాజ్యాంగ అధికరణం 17కు ఉల్లంఘనగా ఉందని నాడు అత్యున్నత న్యాయస్థానం అభివర్ణించింది. అయితే, ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో పలు రివ్యూ పిటిషన్లు దాఖలయ్యాయి. దీంతో ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి బదిలీ చేస్తూ 2019 నవంబరులో నాటి సీజేఐ రంజన్ గొగొయ్ నిర్ణయం తీసుకున్నారు. తాజాగా దీనిపై సుప్రీంకోర్టులో విస్తృత రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతోంది.

# ఇంధన కొరత ఆందోళనలు..

పేర్కొంది. యుద్ధం నేపథ్యంలో ఇరాన్ హార్మూజ్ జలసంధిని మూసివేయడంతో.. భారత్‌లో ఇటీవల ఎల్‌ఎన్‌జీ కొరతపై ఆందోళనలు వెల్లువెత్తాయి. అయితే, కేంద్రం ఈ ఆందోళనలను కొట్టిపారేసింది. దేశంలో తగినన్ని నిల్వలు ఉన్నాయని, కొరత ఏర్పడుతుందంటూ జరుగుతున్న ప్రచారాలు నిరాధారమైనవని స్పష్టం చేసింది.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలి

### పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించిన పల్లా

**జనగామ, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం జనగామ మండలంలోని పెంబర్తి, వడ్లకొండ, ఎర్ర గొల్ల పహాడ్, అడవి కేశవాపురం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం అమ్మకాలలో సమస్యలు ఉంటే వెంటనే తెలియజేయాలన్నారు. రైతుల సమస్యలను నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నామని గ్రామాభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. మహిళా సంఘాలు మరింత బలోపేతం కావాలని మిల్లర్లు ఇబ్బందులు పెడితే చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల ధాన్యం అమ్మిన తర్వాత చెల్లింపులు ఆలస్యమైతే త్వరగా జమ చేయిస్తానని , ప్రతి కొనుగోలు కేంద్రంపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. ధాన్యం అమ్మకాలలో ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పాత బకాయిలు ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రెండున్నరేళుగా రైతుల సమస్యలను నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నామని వెల్లడించారు.

# జూన్ 2నుంచి స్కూల్ విద్యార్థులకు అల్పాహారం

(మొదటి పేజీ తరువాయి)



అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. అక్షరమే ఆయుధంగా ప్రతి విద్యార్థి ఎదగాలని ఆకాంక్షించారు. జూన్ 2వ తేదీ నుంచి విద్యార్థులకు అల్పాహార పథకం అమల్లోకి తీసుకువస్తామని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామని వివరించారు. ప్రతి బిడ్డకు ఉచితంగా మెరుగైన విద్య అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో 100 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు శ్రీకారం చుడతామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మధిర నియోజకవర్గ రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలో చివరి భూములకు సాగునీరు అందించాలన్నదే తన సంకల్పమని తెలిపారు. రూ.36 కోట్లతో కట్టలేరు కాలువల మరమ్మతులను చేపట్టామని అన్నారు. ఎన్నెస్పీ కెనాల్ మూడవ జోన్ పరిధిలో ఉన్న భూములను రెండవ జోన్ కిందకు తీసుకువచ్చి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందజేస్తున్నామని వివరించారు. బీఆర్‌ఎస్ హయాంలో సీతారామ ప్రాజెక్ట్‌ను గాలికొదిలేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీతారామకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయిస్తున్నామని స్పష్టం చేశారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ తీసుకువస్తున్నామని.. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం జరుగుతోందన్నారు. మధిర నియోజకవర్గంలో రహదారుల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. కట్టలేరు ప్రాజెక్టు పనులను శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు.

# ఎమ్మెల్యే పల్లాను బురిడీ కొట్టించిన సైబర్

(మొదటి పేజీ తరువాయి)

అపరిచిత వ్యక్తికి ఎమ్మెల్యే పల్లా.. రూ.లక్ష ఫోన్ పే చేశారు. ఆ తర్వాత ఫైనాన్స్ అడిషనల్ సెక్రటరీకి ఫోన్ చేసి డబ్బులు వచ్చాయా? అని అడిగారు. డబ్బులు రాలేదని ఆయన సమాధానం చెప్పడంతోపాటు అసలు తాను ఫోన్ చేయలేదని తెలిపారు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన ఎమ్మెల్యే పల్లా.. జూబ్లీహిల్స్ పీఎస్ సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేశారు. ఈ రకంగా బీఆర్‌ఎస్ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సైబర్ నేరగాళ్ల బారిన పడటం ఇప్పుడు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. స్వయంగా ఒక ప్రజాప్రతినిధిని, అది కూడా ప్రభుత్వ ఉన్నతాధికారి పేరుతో సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. సైబర్ కేటుగాళ్లు ఇప్పుడు కేవలం సామాన్యులనే కాకుండా, అత్యున్నత పదవుల్లో ఉన్న వారిని కూడా లక్ష్యంగా చేసుకుంటున్నారని ఈ ఘటన స్పష్టం చేస్తోంది. ఎమ్మెల్యే వంటి బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వారే మోసపోయారంటే, సామాన్యులు ఎంత అప్రమత్తంగా ఉండాలో ఈ ఘటన ద్వారా అర్థం చేసుకోవచ్చు. సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకోవడమే దీనికి ఏకైక పరిష్కారమని పలువురు చెబుతున్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి, తనను తాను తెలంగాణ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ సెక్రటరీ అనంతరామిరెడ్డిగా పరిచయం చేసుకున్నాడు. ప్రభుత్వ యంత్రాంగంలో కీలక పదవిలో ఉన్న వ్యక్తిగా నమ్మించడంతో ఎమ్మెల్యే సదరు వ్యక్తి మాటలను విశ్వసించారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'వికసిత్ భారత్' పథకం కింద ఒక్కొక్కరికి రూ.10 లక్షల వరకు రుణాలు ఇస్తామని నిందితుడు నమ్మించాడు. నియోజకవర్గంలో 40 మంది అర్హులైన లబ్దిదారుల జాబితాను పంపాలని, దరఖాస్తుకు ఈరోజే చివరి రోజని ఎమ్మెల్యేపై ఒత్తిడి పెంచాడు. ఒక్కో దరఖాస్తు ప్రాసెసింగ్ ఫీజు కింద రూ.2,500ల చొప్పున, మొత్తం 40 మందికి కలిపి రూ. లక్ష తక్షణమే ఫోన్ పే చేయాలని కోరాడు. ప్రజలకు మేలు జరుగుతుందనే ఉద్దేశంతో ఎమ్మెల్యే గంట వ్యవధిలోనే ఆ లక్ష రూపాయలను నిందితుడు చెప్పిన నంబర్‌కు బదిలీ చేశారు. డబ్బులు పంపిన తర్వాత సదరు వ్యక్తి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో అనుమానం వచ్చి ఆరా తీయగా అది నకిలీ కాల్ అని తెలియడంతో ఎమ్మెల్యే జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. సైబర్ నిందితులపై ఈ క్రింది సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసులు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఉన్నతాధికారుల పేర్లతో ఫోన్ కాల్స్ వచ్చినప్పుడు, వెంటనే నగదు బదిలీ చేయకుండా సంబంధిత శాఖల ద్వారా క్రాస్ చెక్ చేసుకోవాలని పోలీసులు సూచించారు. ఏ ప్రభుత్వ పథకానికి కూడా వ్యక్తిగత ఫోన్ పే నంబర్లకు డబ్బులు పంపాలని అధికారులు కోరారని అన్నారు. చెల్లింపులు ఎప్పుడూ అధికారిక పోర్టల్స్ లేదా చలాన్ల ద్వారానే జరుగుతాయని తెలిపారు. ఇలాంటి అనుమానాస్పద కాల్స్ వస్తే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# మూడు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్

### భారీగా పోలింగ్ శాతం నమోదు... అవాంఛనీయ ఘటనలు లేకుండా పోలింగ్ ప్రశాంతం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 (ఆర్‌ఎన్‌ఎ):** అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా పోలింగ్ జరిగింది. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు ఇసి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. గురువారం సాయంత్రం 5 గంటలకు ఆయా రాష్ట్రాల్లో పోలింగ్ ముగిసింది. ఇప్పటి వరకు పుదుచ్చేరిలో 86.92 శాతం, అసోంలో 84.42 శాతం, కేరళంలో 75.01 శాతం పోలింగ్ నమోదు అయిందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. గురువారం ఉదయం అసోం (126), కేరళం (140), పుదుచ్చేరి (30) లలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. ఈ ఎన్నికల పోలింగ్ వేళ.. ఏర్పాట్లను ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. ఆయా రాష్ట్రాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద భారీగా భద్రతా సిబ్బందిని మోహరించారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. మొత్తం 296 నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కేరళ, పుదుచ్చేరిలలో సాయంత్రం 6గంటలకు పోలింగ్ ముగియగా.. అస్సాంలో ఐదు గంటలకే పూర్తయ్యింది. మూడు ప్రాంతాల్లోనూ ఈసారి భారీ సంఖ్యలో ఓటర్లు తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేరళలోని 140 నియోజకవర్గాల్లో 2.71 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. పోలింగ్ బూత్‌లకు భారీగా తరలివచ్చారు. సాయంత్రం 5గంటల వరకు 75శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి కోయ్‌కోడ్‌లో అత్యధికంగా 77శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. గత ఎన్నికల్లో రాష్ట్రంలో 74.06శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈసారి స్వల్పంగా పెరిగింది. అస్సాంలో 126 నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలో 2.5 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. సాయంత్రం 5గంటల వరకు 84శాతానికిపైగా పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. గత ఎన్నికల్లో 82శాతం పోలింగ్ నమోదు కాగా, ఈసారి మరింత పెరిగింది. దల్‌గావ్‌లో అత్యధికంగా 94.57శాతం పోలింగ్ నమోదైంది. పుదుచ్చేరిలోనూ భారీ సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ మొత్తం 30 అసెంబ్లీ స్థానాలుండగా.. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ ముగిసింది. ఐదు గంటల వరకే 86శాతం పోలింగ్ నమోదు కాగా.. ఇది మరింత పెరగనుంది. పోలింగ్ సమయం ముగిసినప్పటికీ.. అప్పటికే పోలింగ్ కేంద్రాల్లో క్యూ లైన్‌లలో ఉన్నవారికి టోకెన్లు ఇచ్చి పోలింగ్‌కు అనుమతించినట్లు సమాచారం. ఈ ఏడాది మార్చి రెండో వారంలో దేశంలోని నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని అసెంబ్లీలకు కేంద్రం ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ప్రకటించింది. అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీలకు ఏప్రిల్ 9వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపింది.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

### కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్న సీతక్క

**మహబూబాబాద్, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలపై తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు గార్ల మండలం సీతంపేటలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు దోపిడీకి గురవుతున్నారని విమర్శలు వచ్చాయి. ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో కొనుగోలు కేంద్రాలపై ఫోకస్ పెట్టారు. ఈ మేరకు మంత్రి సీతక్క రంగంలోకి దిగారు. గురువారం మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం సీతంపేటలో సీతక్క పర్యటించారు. అనంతరం స్థానిక రైతులతో మాట్లాడారు. వారి కోరిక మేరకు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మొక్కజొన్నలు ప్రైవేట్ దళారీలకు విక్రయించి మోసపోవద్దని ఈ సందర్భంగా రైతులకు మంత్రి సీతక్క వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.2,400 గిట్టుబాటు ధర కల్పించిందని తెలిపారు. మొక్కజొన్న రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని విజ్ఞప్తి చేశారు. కొనుగోలు కేంద్రాలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క కోరారు. ఒక్క ఎకరాకు 25 క్వింటాలు మాత్రమే కొనుగోలు కాకుండా 50 క్వింటాలు పండించినా ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హామీ ఇచ్చారు. రైతులు ఇబ్బంది పడకుండా పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని మంత్రి సీతక్క భరోసా ఇచ్చారు.

# రెచ్చిపోతున్న భూ కబ్జాదారులు

### పాఠశాల కాంపౌండ్ వాల్ కూల్చివేత దుర్మార్గం...
### చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఎంపి రఘునందన్ వినతి

**సంగారెడ్డి, హైదరాబాద్, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా కబ్జాలు చేస్తున్నారని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో కూడా ప్రభుత్వ భూములను కబ్జా చేశారని విమర్శించారు. వారి కబ్జాలపై విమర్శలు చేసిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు వారే కబ్జాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. గురువారం పటాన్‌చెరు పట్టణ కేంద్రంలో జాతీయ రహదారి విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మీడియాతో మాట్లాడారు. సర్వే నంబర్ 428లో 2 ఎకరాల 18 గుంటల స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. జాతీయ రహదారుల విస్తరణ ప్రజాసంక్షేమం కోసం మాత్రమే కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని చెప్పుకొచ్చారు. కబ్జాదారులకు, జాతీయ రహదారి విస్తరణ పనులకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాల తరగతి గదులను రాత్రికి రాత్రి కూలగొట్టడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వ పాఠశాల కాంపౌండ్ వాల్ బయటనే జాతీయ రహదారి విస్తరణ చేయాల్సి ఉండగా .. పాఠశాల తరగతి గదులను కూల్చివేయటంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు ఈ విషయమై స్పందించి పాఠశాల గదులను కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


**DALMIA BHARAT LIMITED**

**Registered address:** Dalmia Puram Lalgudi, Tiruchirappalli, Tamil Nadu, 621651

Notice is hereby given that the **1300** shares bearing Folio No(s) **DBL0225108**, certificate No(s) **225108** distinctive No(s) **188362520-188363819** standing in the name(s) of **LATE AMARNATH TALWAR** in the books of **M/s DALMIA BHARAT LIMITED**, has been lost and the advertiser have applied to the to the Company for issue of duplicate share certificate(s) in lieu thereof. Any person(s) who has claim(s) on the said shares should lodge such claim(s) with the Company's **Registrars and Transfer Agents KFin Technologies Ltd, Selenium, Tower B, Plot 31-32, Gachibowli, Financial District, Nanakramguda, Serilingampally Mandal,Hyderabad,Telangana,500032** within **15 days** from the date of this notice failing which the Company will proceed to issue duplicate share certificate(s) in respect of the said shares.

**RAVINDER TALWAR**
Name of the Legal Claimant

**Date :** 10.04.2026 **Place:** TAMIL NADU


# ఇంటర్ ఫలితాల ప్రకటనపై దుష్ప్రచారాలు

### వదంతులు నమ్మవద్దన్న తెలంగాణ ఇంటర్ బోర్డు

**హైదరాబాద్, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలంగాణ ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలు ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని సోషల్ మీడియాలో తెగ వార్తలు వస్తున్నాయి. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు అయోమయంలో పడ్డారు. తాజాగా, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రచారాన్ని తెలంగాణ విద్యాశాఖ ఖండించింది. ఈ ప్రచారం అసత్యం, అందులో ఎలాంటి వాస్తవం లేదని తెలిపింది. ఇంటర్ ఫలితాలు ప్రకటన నిర్ణీత షెడ్యూల్ ప్రకారమే విడుదలవుతాయని విద్యాశాఖ స్పష్టం చేసింది. గతంలో ఇంటర్ ఫలితాలు ఏప్రిల్ మొదటి వారంలో రిలీజ్ కాలేదన్న విషయం గుర్తు చేసింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ 'ఫ్యాక్ట్‌చెక్' విభాగం 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ పెట్టింది.గతంలో ఇంటర్ ఫలితాలు విడుదలైన తేదీలు.. 2014 మే 3, 2015 - ఏప్రిల్ 22, 2016 - ఏప్రిల్ 22, 2017 - ఏప్రిల్ 16, 2018 - ఏప్రిల్ 13, 2019 -ఏప్రిల్ 18, 2020 - జూన్ 18 (కోవిడ్ కారణంగా అందరినీ పాస్ చేయటం జరిగింది), 2021-జూన్ 28 (కోవిడ్ కారణంగా అందరినీ పాస్ చేయటం జరిగింది), 2022 - జూన్ 28, 2023 - మే 9, 2024 - ఏప్రిల్ 24, 2025 -ఏప్రిల్ 22 ప్రకటించారు' అని పోస్ట్ చేశారు. ఇక జవాబు పత్రాల మూల్యాంకనం, ఇతర అంశాలను బట్టి ఫలితాల విడుదల అయ్యే తేదీలు ప్రతి ఏటా మారుతుంటాయి. అదే విధంగా, ఈ సంవత్సరం కూడా కొనసాగుతుంది. మూల్యాంకన సమయాన్ని బట్టి, ఫలితాల విడుదల ప్రకటన చేస్తారు. ఇంటర్మీడియట్ ఫలితాల విషయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా విద్యాశాఖ ఇచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని కోరుతున్నాము. సామాజిక మాధ్యమాలలో ప్రచారమయ్యే తప్పుడు వార్తలను నమ్మ వద్దని తెలంగాణ ప్రభుత్వం విద్యాశాఖ పేర్కొంది.

# నగరంలో ట్రాఫిక్ చిక్కుల ముడివిప్పే ప్రయత్నం

### షేక్‌పేట నుంచి మాసాబ్ ట్యాంక్ వరకు మోడల్ కారిడార్
### బస్సులో ప్రయాణించి పరిస్థితులు అధ్యయనం చేసిన అధికారులు



**హైదరాబాద్, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భాగ్యనగరం లోని కీలకమైన షేక్‌పేట్ ఫ్లై ఓవర్ నుంచి మాసాబ్ ట్యాంక్ వరకు ట్రాఫిక్ కష్టాలను తీర్చి, ఈ మార్గాన్ని 'మోడల్ కారిడార్'గా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా గురువారం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. అధికారులందరూ కలిసి ఒకే బస్సులో ప్రయాణిస్తూ.. మార్గమధ్యలో ఉన్న బాటిల్ నెక్‌లు , నీరు నిలిచే ప్రాంతాలు, ఆక్రమణలను స్వయంగా పరిశీలించి తక్షణ పరిష్కార మార్గాలను సూచించారు.ఎస్‌డిఐ హాస్పిటల్ వద్ద, బృందావన్ కాలనీ రోడ్ నంబర్-1 వద్ద కొత్తగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని నిర్ణయించారు. షేక్‌పేట్ నాలా వద్ద పెలికాన్ సిగ్నల్, జీబ్రా క్రాసింగ్‌లను ఏర్పాటు చేయనున్నారు. నానల్ నగర్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు వీలుగా అక్కడ ఉన్న రోటరీ వెడల్పును తగ్గించి, రహదారిని విస్తరించాలని అధికారులను ఆదేశించారు. రేతిబౌలి నుంచి నానల్ నగర్ వరకు ఉన్న సెంట్రల్ మీడియన్‌ను, అడ్డంగా ఉన్న చెట్లను తొలగించి రోడ్డును వెడల్పు చేయనున్నారు. ఎన్ఎండీసీ, డెల్ స్టోర్ ప్రాంతాల్లో మాస్టర్ ప్లాన్ ప్రకారం భూసేకరణ చేపట్టి రహదారి విస్తరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు.రహదారి మధ్యలో ఉన్న రామాలయం ఆర్చ్, బొడ్రాయి, అలాగే షేక్‌పేట్ నాలా సమీపంలోని సమాధులను తొలగించి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేయాలని కమిషనర్లు ఆదేశించారు. మాసాబ్ ట్యాంక్ ఫ్లై ఓవర్ వద్ద ఎత్తు పరిమితి బారియర్లు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయనున్నారు. మెహదీపట్నం వైపు ఉన్న ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించి, పోచమ్మ బస్తీ నుంచి రోడ్ నంబర్ 12కు నేరుగా వెళ్లేలా స్లిప్ రోడ్డును అభివృద్ధి చేయనున్నారు. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా తక్షణమే చేయదగ్గ పనులు, దీర్ఘకాలిక పనులను గుర్తించామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. నగరంలోని ట్రాఫిక్ పనుల నిమిత్తం ప్రతి జోన్‌కు రూ. 20 కోట్ల చొప్పున మొత్తం రూ. 120 కోట్లు కేటాయిస్తున్నామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ వెల్లడించారు. కేబీఆర్ పార్క్ వద్ద పెండింగ్‌లో ఉన్న పనులను రెండేళ్లలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డి.జోయల్ డెవిస్ , జి ముకుంద రెడ్డి , ప్రియాంక ఆలా, కాజల్ , కె. శ్రీనివాస్, ఎస్.రత్నాకర్, వేణుగోపాల్ రెడ్డి, డి. ధనలక్ష్మి ఇతర అధికారులు పాల్గొన్నారు.


**NOTICE**

**IN THE COURT OF HON'BLE VII ADDL. SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT HYDERABAD**

**O.S. NO. 251 OF 2026**

Between:

Mrs. Savithri Potharaju, & others ..... Plaintiffs

And

MRO & another .... Defendants

To,
All Concerned

Please take notice that the above-said O.S. has been filed by the Plaintiffs praying the Hon'ble Court for declaration of legal heirs of Late Potharaju Venkata Venu Gopala Krishna Murthy in respect to the Schedule Property. The Hon'ble Court has posted the above-said matter on 06.05.2026 for your appearance and objection if any. Please appear at 10:30 A.M. before the above-mentioned court on 06.05.2026 with any objections failing which the above said matter will be decided in your absence and on merits.

**SCHEDULE PROPERTY**

All that the proportionate undivided of land in the premises bearing Municipal No. 2-2-198/56/6/1/ 18 in Plot No. A/7, admeasuring 58 Sq. yds. Out of 462.22 Sq. Yds. Situated at Somasunder Nagar, Bagh Amberpet, Hyderabad, which is more fully described in the plan annexed hereto and total portion is bounded as follows: -

North: Nikhila Apartments
South: Aparna Apartments
East: Neighbor's Property
West: 40' Wide Road

(By Order of Hon'ble Court)

**I. Ramana Reddy, Advocate**
**8-2-293/82/A, Plot No. 89, Road No. 9, Jubilee Hills, Hyderabad 500 034**
**8099211222**

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# ఒక యుద్ధం.. అనేక చేదు అనుభవాలు!

ట్రంప్, నెతన్యాహులు కలసి ప్రపంచాన్ని గందరగోళంలోకి నెట్టడమే కాకుండా ఓ రకంగా చెప్పాలంటే ఫూల్స్‌ను చేశారు. ఇరాన్ వద్ద శుద్ధి చేసిన యురేనియం నిల్వలు ఉన్నాయని ప్రపంచాన్ని నమ్మించారు. అక్కడి నాయకత్వాన్ని మార్చాలని, తద్వారా యురేనియం స్వాధీనం చేసుకుంటామని అనుకున్నారు. కానీ ఈ రెండూ పక్కకు పోయి, ఇప్పుడు హర్మూజ్ జలసంధ తెరిస్తే చాలన్నట్లుగా వ్యవహారానికి దిగారు. ఇరాన్ బిగుసుకుని కూర్చోవడంతో హర్మూజ్ జలసంధి వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. ఇరాన్‌ను దారిలోకి తెచ్చుకునేందుకు అనూహ్యంగా పాక్‌ను ట్రంప్ రంగంలోకి దింపారు. ఇరాన్ వద్ద ఉన్న యురేనియం స్వాధీనం చేసుకోవడం.. ఆ దేశంలో ప్రస్తుతం ఉన్న పాలకులను మార్చి తమకు అనుకూలంగా ఉండేవారిని నియమించడం.. అనే రెండు లక్ష్యాలతో అమెరికా, ఇజ్రాయెల్ ఆ దేశంపై యుద్ధాన్ని మొదలుపెట్టాయి. కానీ దాదాపు 40 రోజుల యుద్ధంలో అది నెరవేరలేదు. ఇరా÷– నేత కమేనీ మరణించినా, ఆయన కుమారుడు మరో నేతగా ముందుకు వచ్చారు. అక్కడి ప్రజలు కూడా అమెరికాకు లొంగలేదు. నలభై రోజులు గడిచాక పరిస్థితి చూస్తే.. ఆ రెండు లక్ష్యాలనూ సాధించడంలో ట్రంప్, నెతన్యాహులు పూర్తిగా విఫలమయ్యారనే చెప్పాలి. ప్రపంచం కూడా ఇది గుర్తించింది. వాస్తవంగా చెప్పాలంటే.. రూ.లక్షల కోట్లు ఖర్చు చేసి, వందలాది మంది ప్రాణాలను బలిగొని, ప్రత్యక్షంగా గల్ఫ్ ప్రాంతాన్ని దెబ్బతీయడానికి కారణమయ్యారు. ఇంధన కొరతకు కారణమయ్యారు. పరోక్షంగా,ప్రత్యక్షంగా ప్రపంచదేశాల ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీసారు. ట్రంప్ కాల్పుల విరమణను ప్రకటించిన తర్వాత కూడా ఇరాన్ క్షిపణులను ప్రయోగించడం.. చెక్కుచెదరని ఆ దేశ రాజకీయ నాయకత్వ సంకల్ప బలానికి, ఆ దేశ సైనిక సామర్థ్యానికి నిదర్శనమని రక్షణ రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఒక శక్తిమంతమైన దేశం చిన్నదేశంపై విరుచుకుపడి.. పూర్తిగా ఓడించలేకపోతే, అది ఆ చిన్నదేశం విజయం కిందే పరిగణించాలి. ఆ కోణంలో చూస్తే ఇరాన్‌ను ఈ యుద్ధంలో విజేతగానే చూడాలి. ఎందుకంటే సర్వనాశనం చేస్తామన్న ట్రంప్ తోక ముడిచారనే చెప్పాలి. స్వదేశంలో ట్రంప్ విపరీతమైన వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. అలాగని ఈ యుద్ధంలో ఇరాన్ సంపూర్ణంగా గెలిచిందని కూడా చెప్పలేం. ఎందుకంటే ఇరాన్ భారీగానే నష్టపోయింది. అది కుదురుకోవడానికి మరో దశాబ్దం పట్టవచ్చు. ఎందుకంటే.. ఎంతో మంది ఇరాన్ పౌరులు ఈ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. ఆ దేశంలోని మౌలికసదుపాయాలు, చమురు క్షేత్రాలు, పారిశ్రామిక కేంద్రాలు దారుణంగా దెబ్బతిన్నాయి. దేశ అగ్ర నాయకత్వాన్ని ఇరాన్ కోల్పోయింది. ఆ దేశ అణు కేంద్రాలు ధ్వంసమయ్యాయి. ఇరాన్‌కన్నా ఎక్కువగా ఈ యుద్ధంలో నష్టపోయింది గల్ఫ్ దేశాలు. యూఏఈ, సౌదీ, కువైత్, ఇరాక్, బహరైన్‌లోని పలు ప్రాంతాలు ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒక్క యూఏఈపైనే ఇరాన్ దాదాపు 520 క్షిపణులు, 2000 కామికాజీ డ్రోన్లను ప్రయోగించింది. దీంతో, యూఏఈకి ఆర్థిక ఇంజన్లు అయిన దుబాయ్, షార్జా వంటివి తీవ్రంగా ప్రభావితమయ్యాయి. దుబాయ్ పర్యాటక, రియల్ ఎస్టేట్ రంగాలు కుప్పకూలాయి. అటు.. సౌదీ వద్దనున్న అత్యాధునిక అమెరికన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్.. ఇరాన్ దాడులను పూర్తిగా అడ్డుకోలేకపోయాయి. ఫలితంగా సౌదీలోని రాస్‌తనూరా వంటి చమురుశుద్ధి కర్మాగారాలు, పలు పారిశ్రామిక ప్రాంతాలు దెబ్బతిన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ కాస్త తగ్గి, చర్చలకు రావడానికి.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేసిన ఈ దాడులు కూడా ఒక కారణం. ఈ యుద్ధం వల్ల అమెరికా ఆర్థికంగా నష్టపోవడమే కాదు. ఆ దేశ పరపతి కూడా పోయింది. ఇకపై అమెరికా సైనికశక్తిని చూసి గతంలో భయపడినట్టుగా ఎవరూ భయపడే పరిస్థితి ఉండదు. ఇకపోతే యుద్ధం జరుగుతుండగా.. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టుబిగించి, రాకపోకలను కట్టడి చేయడంతో ఓ రకంగా చెప్పాంటే ట్రంప్‌కు ముచ్చెమటలు పట్టాయనే చెప్పాలి. అంతేగాకుండా ఇరాన్ ఎదురుదాడిని కూడా అమెరికా ఊహించి ఉండలేదు. నోటికొచ్చినట్టు మాట్లాడిన ట్రంప్.. ఇప్పుడు ర్మూజ్ జలసంధిని తెరవాలంటూ పదేపదే బెదిరింపులు జారీ చేశారు. అదీ జరగలేదు. యుద్ధం మొదలైనరోజే సుప్రీం లీడర్ ఆయతొల్లా ఖమేనీ చనిపోయినా.. ఆయన కుమారుడు మొజ్తబాకు పట్టంగట్టి ఇరాన్ ఈ యుద్ధాన్ని కొనసాగించింది. కాలక్రమంలో అగ్రనాయకులు ఎందరు మరణించినా.. యుద్ధాన్ని మాత్రం ఆపలేదు! ఓ రకంగా చెప్పాలంటే అమెరికాను సవాల్ చేసింది. ఒక దశలో తన దూకుడుతో అమెరికావిమానవాహక యుద్ధనౌకను సైతం వెనక్కి తగ్గేలా చేసింది. మా మీదకి దాడికి వస్తే.. ఈ ప్రాంతంలో నీ మిత్రదేశాలను నేను దెబ్బతీస్తా అని గల్ఫ్ దేశాలకు ముడిపెట్టి హెచ్చరించింది. దాడులు చేసి అమెరికాను నిలువరించ గలిగేలా ఎదురుదాడులతో బెంబేలు పెట్టింది. అత్యంత శక్తిమంతమైన అమెరికా సైన్యాన్ని, అత్యాధునిక సాంకేతికత కలిగిన ఇజ్రాయెల్‌ను ఎదుర్కొని ఇరాన్ తన ఉనికిని కాపాడుకుంది. బెరుకు లేకుండా యుద్ధం లోకి దిగింది. ఇప్పుడు లెబనాన్‌పై దాడులను ఆపకుంటే ర్మూజ్ తెరిచేది లేదని ఉడుంపట్టు పట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కలసి ఇరాన్‌లోని అణు కేంద్రాలను ధ్వంసం చేసి ఉండవచ్చు. కానీ ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను మాత్రం స్వాధీనం చేసుకోలేకపోయాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్‌కు గతంలో లేని పట్టు ఇప్పుడు రావడానికి ఈ యుద్ధమే కారణ మైంది. ఇప్పుడా మార్గంలో టోల్ వసూలు ప్రతిపాదన ద్వారా దానిపై శాశ్వత నియంత్రణకు ఇరాన్ ప్రయత్నాలు చేస్తోంది. హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టును కొనసాగించి, పూర్తిగా నియంత్రించ గలిగితే.. ఆ దారి గుండా ఎగుమతి, దిగుమతులకు యూఏఈ పూర్తిగా ఇరాన్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

# ఆరు గ్యారెంటీలకు దిక్కేది

**రైతుల...అంగన్‌వాడీల సమస్యలు పట్టవా**
**మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్**

**హన్మకొండ,ఏప్రిల్9(ఆర్ఎన్ఎ):** రైతుల ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చారని కాంగ్రెస్ ప్రభుత్వం వారి సమస్యలను విస్మరించిందని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ విమర్శలు గుప్పించారు. ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు అని నమ్మించి.. ఇప్పటివరకు ఏ ఒక్క హామీని కూడా ప్రభుత్వం నెరవేర్చలేదని తెలిపారు. కేసీఆర్ పాలనలో వ్యయసాయం పండగలా ఉండేదని గుర్తుచేశారు. కేసీఆర్ ప్రభుత్వం అన్ని వేళల్లో రైతులకు అండగా ఉండేదని తెలిపారు. కేసీఆర్ పాలనలో విద్యుత్ రంగాన్ని అభివృద్ధి చేసి వ్యవయానికి 24 గంటల కరెంట్ ఇచ్చామని దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. కానీ ఈ ప్రభుత్వం ఏ ఒక్క హామీని కూడా పూర్తిగా అమలుచేయలేదని విమర్శించారు. అంగన్‌వాడీలు రోజూ రో÷–డడెక్కి పోరాడుతున్నారని తెలిపారు. ఆశావర్కర్లది కూడా అదే పరిస్థితి అని అన్నారు. అంగన్‌వాడీల సమస్యలను తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ నెరవేర్చారని తెలిపారు.

# సమష్టిగా నారీశక్తిని బలోపేతం చేద్దాం!




మరికొన్ని రోజుల్లో దేశంలోని అన్ని ప్రాంతాల్లో పండగ వాతావరణంతో సందడి మొదలు కాబోతున్నది. అస్సాం ప్రజలు రొంగాలి బిహు జరుపుకొంటే, ఒడిశా ప్రజలు మహా బిషుబ పాన సంక్రాంతి నిర్వహిస్తారు. పశ్చిమ బెంగాల్లో పొయిలా బైశాఖ్ బెంగాలీల నూతన సంవత్సరానికి నాంది పలికితే.. కేరళలో సంబరంగా విషు పండగ నిర్వహిస్తారు. తమిళనాడులో పుత్తాండు పర్వదినాన్ని, పంజాబ్ సహా ఉత్తర భారతంలోని ఇతర ప్రాంతాల్లో బైశాఖీ వేడుకను చేసుకుంటారు. ఇవన్నీ ఆశాభావాన్ని, సానుకూల దృక్పథాన్ని పెంపొందిస్తాయి. దేశవిదేశాల్లో ఈ వేడుకలను నిర్వహించుకొనే వారందరికీ నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఈ పవిత్ర ఉత్సవాలు అందరి జీవితాల్లోనూ ఆనందాన్నీ, సౌభాగ్యాన్నీ తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాను. ఏప్రిల్ 11 నుంచి మహాత్మా ఫూలే 200 జయంత్యుత్సవాలను మనం ప్రారంభించుకుంటున్నాం. ఈ నెల 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌కు యావత్ భారతదేశం నివాళి అర్పిస్తుంది. ఈ ప్రత్యేక సందర్భాలే కాకుండా, మన హృదయాలూ, ఆలోచనలూ పునర్నవీకరణ స్ఫూర్తితో నిండిన వేళ.. మన దేశం మరో చారిత్రక విజయం ముంగిట నిలబడింది. ప్రజాస్వామ్య పునాదులను మరింత పటిష్టం చేసుకోవడానికి, సమానత్వం, సమ్మిళిత్వం దిశగా మన సమష్టి నిబద్ధతను పునరుద్ఘాటించడానికి లభించిన గొప్ప అవకాశమిది. మహిళల రిజర్వేషన్లను ముందుకు తీసుకెళ్లే ముఖ్యమైన బిల్లుపై చర్చించేందుకు, ఆమోదించేందుకు ఏప్రిల్ 16న పార్లమెంటు సమావేశం కానుంది. దీనిని ఓ శాసనపరమైన కార్యక్రమంగా పేర్కొంటే ఈ బిల్లు ప్రాధాన్యాన్ని తగ్గించినట్టే అవుతుంది. భారత్‌లోని కోట్లాది మహిళల ఆకాంక్షలకు ఇది ప్రతిబింబం. మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే సమాజం పురోగమిస్తుందనే మన సుదీర్ఘ నాగరికతా స్ఫూర్తికి ఇది నిదర్శనం. దేశ జనాభాలో దాదాపు సగం మంది మహిళలే. ఈ దేశానికి వారు అందిస్తున్న సేవలు అపారమైనవి. అమూల్యమైనవి. ప్రతి రంగంలోనూ మహిళలు సాధిస్తున్న అద్భుతమైన విజయాలకు నేడు భారత్ కేంద్రంగా మారింది. శాస్త్ర, సాంకేతిక రంగాల నుంచి ఔత్సాహిక పారిశ్రామిక రంగం వరకు, క్రీడల నుంచి రక్షణ బలగాల వరకు, సంగీతం నుంచి కళల వరకు దేశాభివృద్ధిలో మహిళలే అగ్రగామిగా ఉన్నారు. కొన్నేళ్లుగా చేసిన ప్రయత్నాలు స్త్రీ సాధికారత దిశగా అనుకూల వాతావరణాన్ని సృష్టించాయి. చదువుకునేందుకు విస్తృతంగా పెరిగిన అవకాశాలు, మెరుగైన ఆరోగ్యసేవలు, విస్తరించిన ఆర్థిక సమ్మిళిత్వం, అందుబాటులోకి వచ్చిన ప్రాథమిక అవసరాలు... ఆర్థిక, సామాజిక కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యాన్ని విస్తృతం చేశాయి. అయినప్పటికీ.. సమాజంలో మహిళలు పోషిస్తున్న పాత్రకు అనుగుణంగా రాజకీయ రంగంలో, శాసనసభల్లో వారికి ప్రాతినిధ్యం లభించ లేదు. ఇది దురదృష్టకరం. పరిపాలనలో, నిర్ణయాధికారంలో మహిళలు భాగస్వాములైతే.. వారిదైన ఆలోచనలనూ, అనుభవాలనూ జోడించడం ద్వారా ప్రజోపయోగ చర్చలు, పాలనా సామర్థ్యం మరింత మెరుగవుతాయి. రానున్న అంటే... 2029లో లోక్‌సభ, వివిధ రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరిగే నాటికి మహిళా రిజర్వేషన్లను అమలు చేయడం అనివార్యం. ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళలకు దక్కాల్సిన ప్రాధాన్యాన్ని అందించేందుకు గత ప్రభుత్వాలు దశాబ్దాలుగా ప్రయత్నం చేస్తూ వచ్చాయి. కమిటీలు ఏర్పాటయ్యాయి. ముసాయిదా బిల్లులను ప్రవేశపెట్టారు. కానీ అవేవీ కార్యరూపం దాల్చలేదు. అయినప్పటికీ... చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్న అంశంలో విస్తృత ఏకాభిప్రాయం వ్యక్తం అయింది. ఈ ఏకాభిప్రాయ స్ఫూర్తితోనే 2023 సెప్టెంబరులో నారీ శక్తి వందన్ అధీనియంను పార్లమెంటు ఆమోదించింది. నా జీవితంలోని అత్యంత ప్రత్యేకమైన సందర్భాల్లో ఒకటిగా నేను దీనిని భావిస్తాను. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే ఈ అవకాశం మన రాజ్యాంగ స్ఫూర్తిలో ప్రతిధ్వనిస్తోంది. ఆచరణాత్మక రూపంలో సమానత్వానికి ప్రాతినిధ్యం ఉన్న సమాజాన్ని నిర్మించాలని మన రాజ్యాంగ నిర్మాతలు ఆకాంక్షించారు. ఈ ఆకాంక్షలను నెరవేర్చడంలో భాగంగా చేపడుతున్న ప్రయత్నాల్లో ప్రధానం... శాసన వ్యవస్థల్లో మహిళల పాత్రను బలోపేతం చేయడం. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ప్రతి పౌరునికీ సమాన భాగస్వామ్యాన్ని అందించే సమాజాన్ని నిర్మించడంలో మా చిత్తశుద్ధిని ఇది ప్రతిబింబిస్తుంది. ఉపేక్షకు అవకాశం లేని సమయం వచ్చింది. మహిళల ప్రాతినిధ్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఎలాంటి జాప్యం జరిగినా.. ప్రజాస్వామ్య సమ్మిళిత్వాన్నీ, ప్రజాస్వామ్య స్ఫూర్తినీ మనం వాయిదా వేసినట్లే. శాసన వ్యవస్థల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని దశాబ్దాల కిందటే గుర్తించారు. ఈ అంశంపై చర్చించారు. ఇలా చేయడం తప్పనిసరి అని కూడా భావించారు. ఇప్పుడు గనుక దీనిని వాయిదా వేస్తే.. మనం గుర్తించిన, సరిదిద్దగలిగిన అసమతౌల్యాన్ని మరింత పెంచడమే అవుతుంది. నిర్దిష్ట లక్ష్యంతో, ఆత్మవిశ్వాసంతో భారత్ ముందుకు సాగుతున్న ఈ తరుణంలో ప్రజలు, ముఖ్యంగా జనాభాలో సగభాగంగా ఉన్నవారి ఆకాంక్షలను మన శాసన వ్యవస్థలు ప్రతిబింబించాల్సిన అవసరం ఉంది. సకాలంలో చేపట్టే చర్యలు దీర్ఘకాలంగా నెరవేరని వాగ్దానాలను నెరవేర్చడమే కాకుండా ప్రగతి వేగాన్ని సైతం కొనసాగిస్తాయి. మన ప్రజాస్వామ్యాన్ని మరింత ప్రాతినిధ్యం కల్పించేదిగా, స్పందించేదిగా, భవిష్యత్తుకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ఇది నిజంగా చరిత్రాత్మకమైన అవకాశం. అందరూ కలిసి రావాల్సిన సమయం..ఇది ఏ ఒక్క ప్రభుత్వానికో, పార్టీకో లేదా వ్యక్తికో సంబంధించిన అంశం కాదు. దీని ప్రాధాన్యాన్ని గుర్తించి, దీనిని సాకారం చేసుకునే దిశగా దేశమంతా ఏకతాటిపైకి రావాల్సిన సమయం. మన నారీశక్తికి మనం అందించాల్సింది ఇదే. అందుకే మహిళా రిజర్వేషన్ బిల్లుకు లభించే ఆమోదంలో విస్తృత ఏకాభిప్రాయం వ్యక్తం కావాలి. జాతీయ ప్రయోజనాలే పరమావధి కావాలి. మన కోసం కాకుండా భవిష్యత్తు తరాల కోసం పనిచేయాలనే స్ఫూర్తిని ఇలాంటి అవకాశాలు మనకు అందిస్తాయి. మార్పులను స్వీకరిస్తూ, మరింత సమ్మిళిత్వాన్ని సాధించడంలోనే అసలైన ప్రజాస్వామ్య స్ఫూర్తి దాగి ఉందన్న సంగతిని గుర్తు చేస్తున్నాయి. చరిత్రాత్మకమైన ఈ పార్లమెంటు సమావేశం సమీపిస్తున్న నేపథ్యంలో.. భారతీయ మహిళల కోసం చేపడుతున్న ఈ ముఖ్యమైన కార్యక్రమానికి మద్దతు అందించాలని పార్టీలకు అతీతంగా పార్లమెంటు సభ్యులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. బాధ్యతగా వ్యవహరించేందుకూ, ఈ అవకాశాన్ని ఉపయోగించుకునేందుకు ముందుకు వద్దాం. అత్యున్నత ప్రజాస్వామ్య విలువల కోసం కలిసి నడుద్దాం. జాతీయ ప్రయోజనాల విషయంలో విబేధాలను పక్కన పెట్టి, ఐక్యంగా వ్యవహరించగలదని భారత్ ఎల్లప్పుడూ రుజువు చేస్తూనే ఉంది. ఇది అలాంటి సందర్భమే. అందరం కలసికట్టుగా ముందుకు సాగుదాం. రాజ్యాంగ విలువలను బలోపేతం చేద్దాం. దేశ ప్రగతి కోసం నారీశక్తికి సాధికారత కల్పిద్దాం.

# పెద్ద ముప్పును తప్పించే హెచ్‌పీవీ టీకా

- విజయవంతంగా ముందుకెళ్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమం
- ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీలో కార్యక్రమాన్ని పరిశీలించిన
- కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి పుణ్య సలిలా శ్రీవాస్తవ



**విజయవాడ, ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఒక్క టీకా పెద్ద ముప్పును తప్పిస్తుందని.. హెచ్‌పీవీ టీకా కార్యక్రమం విజయవంతంగా ముందుకెళ్తోందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి పుణ్య సలిలా శ్రీవాస్తవ అన్నారు. గురువారం కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి పుణ్య సలిలా శ్రీవాస్తవ.. రాష్ట్ర వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తదితరులతో కలిసి ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీని సందర్శించారు. హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమం అమలు తీరుతెన్నులను పరిశీలించారు. అదేవిధంగా కార్యక్రమంపై స్థానికుల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకొన్నారు. సర్వైకల్ క్యాన్సర్ (గర్భాశయ ముఖద్వార క్యాన్సర్) దేశంలో ముఖ్యమైన ప్రజారోగ్య సమస్యగా ఉందని.. సమయానికి టీకా వేయడం ద్వారా ఇది పూర్తిగా నివారించగల వ్యాధి అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిర్దిష్ట మార్గదర్శకాల ఆధారంగా వ్యాక్సినేషన్ కార్యక్రమం చురుగ్గా జరుగుతోందని వివరించారు. దేశంలోని బాలికలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును బహుమతిగా అందించేందుకు ఈ బృహత్తర కార్యక్రమం అమలవుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ రోణంకి గోపాలకృష్ణ, అడిషనల్ డైరెక్టర్ డా. సుబ్రమణ్యేశ్వరి, జేడీ డా. రమేష్, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని తదితరులు పాల్గొన్నారు.


# రేవంత్ కన్నా...కెసిఆర్ పాలనే బెటర్

**నష్టపోయిన ప్రతి రైతును ఆదుకున్న కెసిఆర్... తెలంగాణ ఏర్పాటు కెసిఆర్ వల్లనే సాకారమయ్యింది**
**జాయతీయ స్థాయిలో బిజెపి..రాష్ట్రంలో కెసిఆర్ బెటర్**
**కాంగ్రెస్ పాలన చూశాక బిఆర్ఎస్ నయమన్న భావనలో ప్రజలు**
**మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు... బిఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటన**

**జగిత్యాల,ఏప్రిల్9(ఆర్ఎన్ఎ):** రేవంత్ రెడ్డి పాలన కంటే కేసీఆర్ పాలన బాగుందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను త్వరలోనే బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్నట్లు స్పష్టం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... నష్టపోయిన ప్రతి రైతును గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదుకుందని ప్రశంసించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతోందని విమర్శించారు. ఉద్యోగులు, నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ప్రజలు ఆశించిన పాలన రాలేదని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. రేవంత్ పాలన చూసిన తర్వాత కేసీఆర్ పాలనే బాగుందని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. జాతీయ స్థాయిలో బీజేపీ బెటర్ అని.. రాష్ట్ర స్థాయిలో కేసీఆర్ మెరుగైన నాయకుడని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కేసీఆర్ వల్లే సాధ్యమైందని గుర్తు చేశారు. జీవన్ రెడ్డి వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఇదిలావుంటే 13న జగిత్యాలలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరే అవకాశం ఉందని సమాచారం. కేటీఆర్ జగిత్యాలలో జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి పార్టీలోకి అధికారికంగా ఆహ్వానించనున్నారు. జీవన్ రెడ్డి గతంలో కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడిగా, మంత్రిగా పని చేశారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్ నుంచి జగిత్యాలకు బయల్దేరారు. ఇటీవలే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డిని ఆయన నివాసంలో కలవనున్నారు. ఈ సందర్భంగా జగిత్యాల శివారులో బీఆర్ఎస్ శ్రేణులు కేటీఆర్‌కు స్వాగతం పలకున్నాయి. అక్కడి నుంచి బైక్ ర్యాలీతో జీవన్ రెడ్డి నివాసానికి రానున్నారు. కేటీఆర్ రాకతో జీవన్ రెడ్డి నివాసంతో పాటు జగిత్యాల పట్టణం గులాబీమయంగా మారింది. కాగా, కేటీఆర్‌తో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కీలక నాయకులు సైతం జీవన్‌రెడ్డి ఇంటికి రానున్నారు. రాష్ట్ర రాజకీయాలపై చర్చించిన అనంతరం ఆయనను పార్టీలోకి లాంఛనంగా కేటీఆర్ ఆహ్వానించనున్నారు. 1984లో కాంగ్రెస్ పార్టీలో చేరిన జీవన్‌రెడ్డి నలభై మూడేండ్లుగా ఉత్తర తెలంగాణలోనే కీలకమైన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జీవన్‌రెడ్డి మూడుసార్లు రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. 2014లో తెలంగాణ అవతరించిన తర్వాత ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏకైక ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. 2018లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలైన జీవన్‌రెడ్డి 2019లో పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా గెలిచి శాసన మండలిలో ఏకైక కాంగ్రెస్ సభ్యుడిగా కొనసాగారు.

# పాక్‌ను ముందు పెట్టి అమెరికా నాటకం

**హోర్ముజ్ తెరుచుకునేలా కాల్పుల విరమణ ... లెబనాన్‌పై దాడులతో మళ్లీ పీటముడి**



**న్యూఢిల్లీ,ఏప్రిల్9(ఆర్ఎన్ఎ):** 40 రోజుల పాటు కొనసాగిన యుద్ధానికి తెర దించుతూ అమెరికా, ఇరాన్ దేశాలు రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో రెండు దేశాల మధ్య రాజీ కుదిరింది. రెండు దేశాల మధ్య రాజీ కుదర్చటాన్ని పాకిస్థాన్ గొప్పగా ప్రచారం చేసుకుంటోంది. తనను తాను శాంతిదూతగా చెప్పుకుంటోంది. ఇలాంటి సమయంలో బ్రిటన్‌కు చెందిన ది ఫైనాన్షియల్ టైమ్స్ న్యూస్ పేపర్ సంచలన కథనాన్ని ప్రచురించింది. ఆ కథనం ప్రకారం.. అమెరికా ఒత్తిడి కారణంగానే పాకిస్థాన్ మధ్యవర్తిత్వం చేయడానికి ముందుకు వచ్చింది. ఇరాన్, అమెరికాల మధ్య రాజీ కుదిరితే హోర్ముజ్ జలసంధి మళ్లీ తెరుచుకుంటుందని అమెరికా భావించింది. అందుకే ఇరాన్‌ను యుద్ధం ఆపేలా ఒప్పించమని పాకిస్థాన్‌ను కోరింది. గత కొన్ని వారాల నుంచి ట్రంప్ ప్రభుత్వం పాకిస్థాన్‌పై ఒత్తిడి పెంచింది. అమెరికా ఒత్తిడి కారణంగానే బలవంతంగా ఇరాన్‌తో చర్చలకు పాకిస్థాన్ ఒప్పుకుంది. ఎంతో కష్టం మీద ఇరాన్‌ను రాజీకి ఒప్పించింది. అమెరికాకు సంబంధించినంత వరకు పాకిస్థాన్ మధ్యవర్తి కాదు.. ఇరాన్‌తో సంధి చేసుకోవడానికి ఓ మార్గం మాత్రమేనని ది ఫైనాన్షియల్ టైమ్స్ తన కథనంలో పేర్కొంది. ఇజ్రాయెల్ కారణంగా అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం విఫలం అయ్యేలా ఉంది. ఇజ్రాయెల్ లెబెనాన్‌పై మిస్సైల్ దాడులు చేసింది. ఈ దాడుల్లో 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మళ్లీ మూసి వేసింది. దీంతో ట్రంప్ ఆగ్రహానికి గురయ్యారు. గురువారం ది ట్రూత్‌లో ఓ పోస్టు పెట్టారు. 'అమెరికా ఈజ్ బ్యాక్. ఇప్పటికే బలహీనపడిన శత్రువును పూర్తిగా నిర్మూలించేందుకు సిద్ధంగా ఉన్నాం. హోర్ముజ్‌ను తెరవకపోతే దాడులు తప్పవు. ఒప్పందం కుదరకపోతే ఈసారి తీవ్రమైన దాడులు చేస్తాం. ఎన్నడూ లేని విధంగా ఇరాన్‌పై విరుచుకుపడతాం. ఇప్పటికే ఇరాన్ చుట్టూ అమెరికా బలగాలున్నాయి. అణ్వాయుధాలను ఇరాన్ వదలాల్సిందేనని రాసుకొచ్చారు. అయితే ఇరాన్ కూడా పట్టుదలగానే ఉంది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ మరోసారి హోర్ముజ్ జలసంధిని మూసివేసింది. అమెరికా, ఇరాన్‌లు బుధవారం రెండు వారాల కాల్పుల విరమణను ప్రకటించాయి. దీనిలో భాగంగా, ప్రపంచ ఇంధన సరఫరాలను పునరుద్ధరించేందుకు వీలుగా హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి ఇరాన్ అంగీకరించింది. అమెరికా తీసుకున్న నిర్ణయానికి ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు మద్దతు తెలిపారు. అయితే లెబనాన్‌తో కాల్పుల విరమణ ఉండదని చెప్పారు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. పది నిమిషాల వ్యవధిలో లెబనాన్‌లోని ప్రలు ప్రాంతాలపై సుమారు 100 ఎయిర్ స్టైక్స్ర చేసింది. ఈ దాడుల్లో దాదాపు 180 మంది ప్రాణాలు కోల్పోయినట్టు తెలుస్తోంది. 837 మంది గాయాల పాలయ్యారు. 1982 తర్వాత లెబనాన్‌పై జరిగిన అతిపెద్ద దాడి ఇదే కావడం గమనార్హం. లెబనాన్‌పై దాడులకు నిరసనగా ఇరాన్.. హోర్ముజ్ జలసంధిని తిరిగి మూసేసింది. మెరికా– ఇరాన్ మధ్య తాజాగా కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంలో హిజ్బుల్లాను చేర్చలేదని పేర్కొంటూ, లెబనాన్‌లో ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న సైనిక చర్యకు ట్రంప్ మద్దతు తెలిపారు. 'లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనిక చర్యను ఒప్పందం నుంచి ఎందుకు మినహాయించార'ని ప్రశ్నించగా.. 'హిజ్బుల్లా కారణంగానే లెబనాన్‌ను ఒప్పందంలో చేర్చలేదు. అది కూడా త్వరలోనే పరిష్కారమవుతుంది. ఫర్వాలేదు' అని ట్రంప్ పేర్కొన్నారు.

# ఫిట్‌గా ఉండాలంటే...



ఉరుకుల పరుగుల జీవితంలో శరీరానికి కొంత విశ్రాంతి కావాలి. ఇందుకోసం యోగాను ఆశ్రయించడం తప్పనిసరి. క్రమం తప్పకుండా యోగాసనాలు వేస్తే.. శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా బలపడతారు.

**తాడాసనం**

రెండు పాదాలు ఎదురుగా చూస్తున్నట్లు, మోకాళ్లు సమాంతరంగా ఉంచి నిటారుగా నిలబడాలి. గాలి పీల్చుకుని తొడల పైభాగం వెనక్కి నెట్టాలి. ఇలా చేసినప్పుడు పిరుదులను వెనక్కి నెట్టినట్లు అనిపించాలి. ఛాతిని విస్తరించి పొట్టను, పొట్టను లోపలికి పీల్చుకోవాలి. ప్రయోజనం: పొత్తి కడుపు కండరాలు ధృడమవుతాయి. తొడలు, మోకాళ్లు, పిక్కలు, మడమలు బలపడతాయి.

**త్రికోణాసనం**

తాడాసనంలో నిలబడి రెండు కాళ్లను దూరంగా పెట్టాలి. రెండు చేతులు పక్కకు చాపి ఉంచాలి. ఎడమ పాదాన్ని కొద్దిగా లోపలికి తిప్పి, కుడి పాదాన్ని బయటకు తిప్పాలి. గాలి వదులుతూ కుడిపాదం వైపు వంగి చేతితో మోకాలి కింద పట్టుకోవాలి. ఇలా వంగినప్పుడు ఎడమచేయి గాల్లోకి లేపాలి.తలను ఆకాశం వైపు తిప్పి ఉంచి, చూపును పైకే నిలిపి ఉంచాలి. ఈ భంగిమలో పది సెకండ్లు ఉండి తిరిగి రెండో వైపు కూడా చేయాలి. ప్రయోజనం: జీర్ణశక్తి పెరుగుతుంది. రుతుక్రమం సమస్యలు తొలగిపోతాయి. సయాటికా నొప్పి తగ్గుతుంది. కండరాల బిగుతు సడలుతుంది.

**మారిచ్యాసనం**

కాళ్లను ఎడంగా ఉంచి కూర్చోవాలి. కూర్చున్నప్పుడు ఒక పాదం అడుగుభాగం రెండవ తొడను తాకాలి. రెండవ పాదం శరీరానికి దూరంగా ఉండాలి. అరచేతులను వెల్లకిలా తొడల మీద ఉంచాలి. చేతి బొటనవేళ్లు, చూపుడు వేళ్లను కలపాలి. ఈ భంగిమలో వీలైనంత ఎక్కువ సమయం కూర్చోవాలి. **ప్రయోజనం:** రక్తప్రసరణ పెరిగి, నాడీవ్యవస్థ పనితీరు మెరుగవుతుంది. ఊపిరి పీల్చి వదులుతూ ఉండటం వల్ల పొట్టలోని అంతర్గత అవయవాల పనితీరు మెరుగవుతుంది.

## ఇడ్లీ పిండితో అందమే అందం..



ఇక అందం కోసం చాలా మంది కూడా చాలా రకాల ప్రయత్నాలు అనేవి నిత్యం చేస్తుంటారు. మొఖం మెరవాలని రకరకాల క్రీమ్ లు కూడా ఎక్కువగా వాడుతుంటారు. అయితే మార్కెట్‌లో దొరికే ప్రోడక్ట్స్‌కి బదులుగా మన ఇంట్లో ఉండే కొన్ని పదార్ధాలు వాడినా కూడా అందాన్ని మరింత పెంచుకోవచ్చు అంటున్నారు నిపుణులు.ఇక నిత్యం మనకు దొరికే పదార్ధాలను వాడి మన అందం మరింత కూడా పెంచుకోవచ్చట..ఇక అవేంటో ఇప్పుడు చూద్దాం..ఇక అరటి పండు అనేది మీ చర్మాన్ని మాయిశ్చరైజ్ చేయడానికి చాలా ఉపయోగపడుతుందట.

అరటిపండ్లు ఇంకా అలాగే కొంచెం తేనె ఇంకా అలాగే ½ టీస్పూన్ బియ్యం పిండి లేదా శెనగ పిండిని తీసుకొని వాటిని బాగా మిక్స్ చేసి ముఖానికి బాగా పట్టించి అప్లై చేయాలి.. ఇక ఆ తర్వాత చల్లటి నీటితో శుభ్రంగా ఇంకా అలాగే చక్కగా కూడా ఫేస్ ని వాష్ చేయండి. ఇక దాంతో మీ మొఖం అనేది బాగా మెరిసిపోతుంది. అలాగే పెరుగు ఇంకా శెనగ పిండి ఫేస్‌ప్యాక్ ని తయారు చేసుకోండి.. ఇందుకోసం పెరుగు 1 టీస్పూన్ ఇంకా అలాగే శనగ పిండి 1/4 టీస్పూన్ ఇంకా అలాగే చిటికెడు పసుపు మిక్స్ చేసి ముఖానికి బాగా అప్లై చేయాలి.. ఇక ఆ తర్వాత ఒక 10 నిమిషాలు అలాగే ఉంచి గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రంగా కూడా వాష్ చేయాలి. ఇంకా ఓట్స్ పిండి అలాగే పాలు మిక్స్ చేసి ముఖానికి బాగా అప్లై చేయాలి. ఇక ఆ తర్వాత సెమీ డ్రై అయినప్పుడు ముఖాన్ని బాగా వాష్ చేయండి. ఇక అదే విధంగా హోల్‌వీట్ ఇంకా అలాగే పాల ఫేస్‌ప్యాక్ ని తయారు చేసుకోండి.గోధుమ పిండి 1 టీస్పూన్ ఇంకా అలాగే పాలు/బాదం పాలు పేస్ట్‌లా బాగా కలపాలి. ఇక ఆ తరువాత దాన్ని మీ ముఖానికి అప్లై చేసి ఒక 10 నిమిషాల పాటు అలాగే ఉంచండి. ఇక ఆ తర్వాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని బాగా వాష్ చేయండి. ఇక ఇవే కాదు ఇడ్లీ పిండి ఫేస్‌ప్యాక్ తో కూడా మీ అందాన్ని మరింత కూడా పెంచుకోవచ్చట. దోసె లేదా ఇడ్లీ పిండిని తీసుకోవాలి. తరువాత చిటికెడు పసుపు పొడి కలిపి బాగా మిక్స్ చేసి మీ ముఖానికి అప్లై చేయాలి. ఇక ఆ తర్వాత శుభ్రంగా వాష్ చేయండి. ఇలా ఇన్ని రకాలుగా ఇడ్లీ పిండితో మనం మన అందాన్ని కాపాడుకోవచ్చు ఇంకా పెంచుకోవచ్చు.

## నోటి దుర్వాసన.. ఈ టిప్స్‌తో మాయం?

ఇక లవంగాలు అనేవి అందరి వంటిళ్లలో ఉంటాయి. లవంగం అనేది నోటి దుర్వాసన ఇంకా అలాగే చిగుళ్లవాపు సమస్యలను దూరం చేయడంలో ఎంతో కీలక పాత్ర పోషిస్తుంది. లవంగంలోని యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు నోటిలోని బ్యాక్టీరియా సంఖ్యను కూడా ఈజీగా తగ్గిస్తాయి. అదేవిధంగా రక్తస్రావం ఇంకా దంతక్షయం వంటి ఇతర దంత సమస్యల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయి. అందుకే ప్రతి రోజూ కూడా కొన్ని లవంగాలను నోట్లో పెట్టుకుని నమిలితే కనుక మీరు క్రమంగా నోటి దుర్వాసన నుంచి ఈజీగా బయటపడవచ్చు.ఇక మోతాదుకు మించి తక్కువ నీరు తాగడం వల్ల కూడా నోటి దుర్వాసన అనేది వస్తుంది. నోటి నుంచి బ్యాక్టీరియాను బయటకు పంపడంలో నీరు ఎంతగానో సహాయపడుతుంది. ఇది నోటిలో క్రిములు పెరగకుండా కూడా వెంటనే నిరోధిస్తుంది. అదేవిధంగా నోటిని ఎప్పుడూ కూడా తాజాగా ఉంచుతుంది. నోటి దుర్వాసన సమస్య ఉన్నవారు రోజూ కూడా ఎక్కువగా నీరు తాగాలి. ఒకవేళ అదే పనిగా నీరు తాగడం ఇష్టం లేకపోతే అందులోకి కొద్దిగా నిమ్మరసంని జోడించుకోని తాగవచ్చు. తేనె ఇంకా దాల్చినచెక్క. ఈ రెండింటిలో కూడా యాంటీ ఇన్ఫ్లమేటరీ ఇంకా అలాగే యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు అనేవి చాలా పుష్కలంగా ఉంటాయి. ఇవి నోటిలో బ్యాక్టీరియా పెరుగుదలను తగ్గించి ఇంకా మీ చిగుళ్లను ఆరోగ్యంగా ఉంచడంలో ఎంతగానో సహాయపడతాయి. దంతాల చిగుళ్లపై తేనె ఇంకా దాల్చినచెక్క పేస్ట్‌ను క్రమం తప్పకుండా పూయడం వల్ల నోటి దుర్వాసన అనేది పూర్తిగా దూరమవుతుంది. దంత క్షయం ఇంకా చిగుళ్ల నుంచి రక్తం కారడం ఇంకా చిగుళ్ల వాపు తదితర సమస్యల నుంచి ఉపశమనం అనేది కలుగుతుంది.ఇక తరచూ ఉప్పు నీటితో పుక్కిలించడం వల్ల నోటిలో వుండే చెడు బ్యాక్టీరియా అనేది అసలు వృద్ధి చెందకుండా నిరోధించవచ్చు. అంతేకాదు నోరు తాజాగా ఉంచడంలో కూడా బాగా సహాయపడుతుంది. అదేవిధంగా చిగుళ్ల వాపు ఇంకా అలాగే రక్తం కారడం వంటి తదితర సమస్యలను కూడా ఇది నయం చేస్తుంది. ఇందుకోసం 1/4 నుంచి 1/2 టీస్పూన్ ఉప్పును ఒక గ్లాసు నీటిలో కలిపి ఎప్పుడూ కూడా పుక్కిలిస్తూ ఉండాలి.

## లెబనాన్‌పై విరుచుకు పడ్డ ఇజ్రాయిల్

### పది నిముషాల వ్యవధిలో వంద ఎయిర్ స్ట్రయిక్స్

**టెలి అవీవ్,ఏప్రిల్9(ఆర్ఎన్ఎ):** లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీతావహ దాడులకు పాల్పడింది. 10నిమిషాల వ్యవధిలో లెబనాన్ లోని పలు ప్రదేశాలపై 100 ఎయిర్ స్ట్రయిక్స్ చేసింది. ఈ దాడుల్లో వందల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. క్షతగాత్రుల హాహాకారాలతో అక్కడి పరిస్థితులు దారుణంగా మారాయి. దాడులు జరిగిన ప్రాంతాల్లో అంబులెన్సులు, వైద్య సిబ్బంది సహాయక చర్యలు కొనసాగి స్తున్నట్లు రెడ్‌క్రాస్ వెల్లడించింది. క్షతగాత్రులతో లెబనాన్‌లోని అన్ని ఆసుపత్రులు నిండిపోయాయని ఆరోగ్య మంత్రి తెలిపారు. 1982 తర్వాత లెబనాన్‌పై ఇదే అతిపెద్ద దాడి అని స్థానిక అధికారులు పేర్కొన్నారు. ఈ దాడుల్లో లెబనాన్‌లో ప్రముఖ మతపెద్ద సాధిక్ అలీ నబుల్సీ మృతి చెందారు. బీరుట్ సహా పలు ప్రాంతాల్లోని హెజ్‌బొల్లా స్థావరాలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. తమ దేశంపై దాడులు చేయడానికి హెజ్‌బొల్లా ఉపయోగించే కమాండ్-అండ్-కంట్రోల్ కేంద్రాలు, ఉగ్ర స్థావరాలు, ఇతర మౌలిక సదుపాయాలు ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ తెలిపింది. ఈ దాడులపై హెజ్‌బొల్లా నుంచి ఎటువంటి స్పందన రాలేదు. ఇరాన్‌తో అమెరికా-ఇజ్రాయెల్ చేసుకున్న కాల్పుల విరమణ ఒప్పందంలో లెబనాన్ కూడా భాగమని మధ్యవర్తిత్వం వహించిన పాకిస్థాన్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ ఇజ్రాయెల్ లెబనాన్‌పై దాడులు కొనసాగిస్తోంది. ఈ దాడులు ఇలాగే కొనసాగితే అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన తాత్కాలిక సీజ్‌÷ర్ ఒప్పందంపైనా ప్రభావం పడే అవకాశం ఉంది.

## అమెజాన్‌లో భారీగా ఉద్యోగుల తొలగింపు

### ప్రచారాన్ని ఖండించిన అమెజాన్ సంస్థ

**న్యూఢిల్లీ,ఏప్రిల్9(ఆర్ఎన్ఎ):** ముచ్చటగా మూడో సారి భారీగా ఉద్యోగాల కోతకు ప్రముఖ ఇ కామర్స్ సంస్థ అమెజాన్ ప్రణాళికలు సిద్ధం చేస్తుందంటూ ఆన్ ఫోరమ్స్, టెక్ పోర్టల్స్ వేదికగా జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే రెండు దశల్లో భారీగా ఉద్యోగులను కొలువుల నుంచి ఈ సంస్థ తొలగించింది. తాజాగా ఈ ఏడాది మే మాసంలో మళ్లీ భారీగా ఉద్యోగులను ఉద్యోగాల నుంచి తొలగిస్తుందంటూ ప్రచారం జరుగుతుంది. దీంతో ఆ సంస్థ ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. ఈ నేపథ్యంలో అమెజాన్ తాజాగా స్పందించింది. ఈ ప్రచారాన్ని అమెజాన్ ఖండించింది. ఈ ప్రచారంలో ఏ మాత్రం వాస్తవం లేదని ప్రకటించింది. చైనాకు చెందిన టెక్ పోర్టల్ లీ ఫెంగ్ నెట్‌వర్క్ సైతం ఈ వార్తను ప్రచురించింది. అమెజాన్ వెబ్ సర్వీసెస్, రిటైల్, మానవ వనరుల విభాగంలోని ఉద్యోగులపై ఈ ప్రభావం ఉండవచ్చని చైనా టెక్ పోర్టల్ వివరించింది. అలాగే ఎల్5 నుంచి ఎల్7 ఉద్యోగ స్థాయిల్లోని మేనేజర్లు, వైట్ కాలర్ ఉద్యోగులపై కూడా ఈ ప్రభావం ఉంటుందని అభిప్రాయం వ్యక్తమవుతుంది. కానీ గిడ్డంగి, లాజిస్టిక్స్ సిబ్బందిపై ఈ ప్రభావం ఉండదని నివేదికలు చెబుతున్నాయి. అయితే ఈ కార్పొరేట్ కంపెనీ ఇప్పటికే 2025 అక్టోబర్‌లో 14 వేల మంది, 2026 జనవరిలో 16 వేల మంది ఉద్యోగులను ఉద్యోగాల నుంచి తొలగించింది. ఈ సంస్థ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడం కోసం సీఈవో ఆండీ జస్సీ నేతృత్వంతో ఈ ఉద్యోగుల తొలగింపు ప్రక్రియను చేపట్టింది. మరోవైపు ఏఐ, మౌలిక సదుపాయాలలో అమెజాన్ సంస్థ భారీగా పెట్టుబడులు పెడుతుంది. ఈ పెట్టుబడులను పెంచుకొంటూ పోతుంది. ఏఐ వినియోగం పెరిగే కొద్దీ.. ఉద్యోగుల పాత్ర మునుపటి స్థాయిలో ఉండక పోవచ్చుననే అభిప్రాయాన్ని అమెజాన్ సంస్థ తాజాగా వ్యక్తం చేస్తోంది. 2022 నుంచి ఇప్పటి వరకు 57 వేల మందికిపైగా ఉద్యోగులను అమెజాన్ తొలగించిన విషయం విదితమే.

## బిజెపి చెప్పుచేతల్లో ఎన్నికల సంఘం

### ఢిల్లీ మాజీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ విమర్శలు

**న్యూఢిల్లీ,ఏప్రిల్9(ఆర్ఎన్ఎ):** భారత ఎన్నికల సంఘం బిజెపి కింద పనిచేస్తోందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదని ఆమ్‌ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఇసిపై తీవ్ర విమర్శలు చేశారు. బుధవారం ఉదయం తృణమూల్ కాంగ్రెస్ బృందం భారత ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ని కలిసి.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఎన్నికలు భయరహితంగా, హింసారహితంగా, బెదిరింపులు, ప్రలోభాలు, దాడులు లేకుండా జరపాలని కోరింది. అయితే ఇసికి, టిఎంసి బృందానికి మధ్య ఏడు నిమిషాల పాటు సమావేశం జరిగింది. ఈ చర్చల్లో తాము చెప్పినవి వినకుండా ఇసి చీఫ్ జ్ఞానేశ్ కుమార్ ఇక్కడి నుంచి వెళ్లిపోండి అని అవమానించినట్లుగా టిఎంసి బృందం వెల్లడించింది. టిఎంసి బృందానికి జరిగిన అవమానంపై ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ స్పందించారు. ఎన్నికల సంఘం బిజెపికి అనుకూలం. బిజెపి చెప్పినట్టే పనిచేస్తుంది. బిజెపి నుంచి నేరుగా అందే ఆదేశాలను ఇసి తీసుకుంటుంటోందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఈ విషయం ఇప్పుడు బహిరంగమైంది. ఇది అత్యంత దురదృష్టకరం అని కేజ్రీవాల్ ఎక్స్ పోస్టులో ఇసిని విమర్శించారు.

## గోవుల అక్రమరవాణాను అడ్డుకున్న వ్యక్తి

### కత్తులు, రాడ్లతో దాడి చేసిన దుండగులు

**హైదరాబాద్,ఏప్రిల్9(ఆర్ఎన్ఎ):** గోవుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై కొందరు గుర్తుతెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మంద మల్లమ్మ చౌరస్తా వద్ద ఈ సంఘటన జరిగింది. గోవులను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందుకున్న ప్రేమ్ కుమార్ అనే వ్యక్తి వాటిని అడ్డుకోవడానికి యత్నించాడు. ఈ క్రమంలో గోవుల వాహనం వెంట వచ్చిన కారులోని దుండగులు అతనిపై దాడికి దిగారు. కత్తులు, కర్రలు, రాళ్లతో ప్రేమ్ కుమార్‌పై ఏడుగురు వ్యక్తులు విచక్షణారహితంగా దాడి చేశారు. దీంతో ప్రేమ్ కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. వారి నుంచి తప్పించుకుని గాయాలతో బయటపడిన బాధితుడు వెంటనే పోలీసులను ఆశ్రయించాడు. గోవుల అక్రమ రవాణా, దాడి ఘటనపై మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గాయపడిన ప్రేమ్ కుమార్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు.

## చేనేతలో టెండర్ల విధానం రద్దు చేయండి

### సిఎం రేవంత్‌కు ఎమ్మెల్సీ రమణ లేఖ

**హైదరాబాద్,ఏప్రిల్9(ఆర్ఎన్ఎ):** చేనేత రంగంలో ఏకీకృత టెండర్ల విధానాన్ని రద్దు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్. రమణ లేఖ రాశారు. పాత విధానంలోనే టీఎస్‌సీవో ద్వారా దుస్తులు కొనుగోలు చేయాలని కోరారు. మార్చి 11 న ఇచ్చిన జీవోను యథాతథంగా అమలు చేయాలని , విద్యార్థుల యూనిఫామ్ తయారీ కి సంబంధించిన 105 కోట్ల రూపాయల ఆర్డర్‌ను టీఎస్‌సీవోకు ఇవ్వాలన్నారు. వివిధ సంక్షేమ శాఖలకు అవసరమయ్యే దుస్తులను టీఎస్‌సీవో ద్వారానే కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో చేనేత రంగం అనేది కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాకుండా, వేలాది కుటుంబాల జీవనాధారమని తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాల ప్రతీక అని వెల్లడించారు. ఈ రంగాన్ని కాపాడేందుకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు చేనేత కళాకారులకు, కార్మికులకు ఎంతో మేలు చేశాయని గుర్తు చేశారు.గత రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ సంస్థలకు చేనేత వృత్తికి సంబంధించిన ఏ వస్తువు అవసరమైనా, రాష్ట్ర చేనేత సహకార సంస్థ ద్వారా చేనేత సహకార సంఘాల నుంచి కొనుగోలు చేసే విధానం అమల్లో ఉండేదని పేర్కొన్నారు. ఈ విధానం వల్ల ఉమ్మడి కరీంనగర్, వరంగల్, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల నేతన్నలకు సంవత్సరం పొడవునా నిరంతర ఉపాధి లభించిందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుని లక్షలాది నేతన్నల జీవనోపాధిని కాపాడాలని కోరారు.

## పశ్చిమాసియాలో కాల్పుల విరమణ


### స్వాగతించిన భారత విదేశాంగ శాఖ

**న్యూఢిల్లీ,ఏప్రిల్9(ఆర్ఎన్ఎ):** ఇరాన్-అమెరికాల మధ్య రెండు వారాల కాల్పుల విరమణను భారత్ స్వాగతించింది. పశ్చిమాసియాలో శాశ్వత శాంతి కోసం ఉద్రిక్తతలను తగ్గించాలి, చర్చలు, దౌత్యం కోసం పిలుపునివ్వాలని సూచించింది. ఈ మేరకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. కాల్పుల విమరణను మేము స్వాగతిస్తున్నాము. ఇది పశ్చిమాసియాలో శాశ్వత శాంతికి దారితీస్తుందని ఆశిస్తున్నాము. మేము గతంలో, నిరంతరం స్పష్టం చేసినట్లుగా.. కొనసాగుతున్న సంఘర్షణలకు త్వరగా ముగింపు పలకడానికి ఉద్రిక్తతలను తగ్గించడం, చర్చలు, దౌత్యం చాలా అవసరం అని ఆ ప్రకటనలో పేర్కొంది. ఈ సంఘర్షణలతో ఇప్పటికే ప్రజలు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ప్రపంచ ఇంధర సరఫరా, వాణిజ్య నెట్‌వర్క్‌లకు అంతరాయం కలిగించింది.

## చేనేతలో టెండర్ల విధానం రద్దు చేయండి

### సిఎం రేవంత్‌తో ఘనా హైకమిషనర్ భేటీ

### సిఎంతో భేటీ అయిన టాటా ఏరో స్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ టిమ్ రైఫిల్




**హైదరాబాద్,ఏప్రిల్9(ఆర్ఎన్ఎ):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఘనా హైకమిషనర్ క్వాసి ఒబిరి-డాన్సో మర్యాదపూర్వకంగా కలిసిన రిపబ్లిక్ ఆఫ్ ఘనా హైకమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా హైదరాబాద్ కు వచ్చిన క్వాసి ఒబిరి-డాన్ సిఎంను ఆయన నివాసంలో కలుసుకున్నారు. ఘనా, తెలంగాణ మధ్య సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించిన హైకమిషనర్. విద్య, శాస్త్ర సాంకేతిక రంగాలు, ఆరోగ్య, వాణిజ్య రంగాల్లో పరస్పర సహకారం ఉండాలని కోరిన హైకమిషనర్. -నుకూలంగా స్పందించిన సీఎం రేవంత ఆయనకు శాలువాతో సన్మానించారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టాటా ఏరో స్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ టిమ్ రైఫిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. భారతదేశంలో ఎఫ్-130ఏ సూపర్ హెర్క్యులస్ ఫైనల్ అసెంబ్లీ లైన్‌ను ఏర్పాటు చేయనున్న లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ. అంతర్జాతీయ అవసరాల కోసం భారతదేశంలోని టిఎఎస్ఎల్ లో ఈ-16 వింగ్స్ ను ఉత్పత్తి చేసేందుకు లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ ఒప్పందం కుదుర్చుకున్నది. తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నట్లు ఈ సందర్భంగా టిమ్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

## ఆనాటి ఘటన ఇంకా వెన్నాడుతూనే ఉంది

### అకీరా నందన్ పుట్టిన రోజు శుభాకాంక్షలు

### ఇదే ర ఓజు గతేడాది మార్క్ శంకర్‌కు అగ్నిప్రమాదం

### గతాన్ని తలచుకుని ఎమోషలన్ అయిని అన్నాలెజినోవా

**అమరావతి,ఏప్రిల్9(ఆర్ఎన్ఎ):** ఈ రోజు తమ కుటుంబానికి ఎంతో ఎమోషనల్ డే అని పవన్ కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవా అన్నారు. నేడు అకీరానందన్ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ.. సరిగ్గా ఏడాది క్రితం ఇదేరోజు సింగపూర్‌లో జరిగిన అగ్ని ప్రమాదాన్ని గుర్తుచేసుకున్నారు. ఆ ప్రమాదంలో చిన్న కుమారుడు మార్క్ శంకర్ చిక్కుకోవడంతో తన కుటుంబం వణికిపోయిందని తెలిపారు. మార్క్ ప్రాణాలతో బయటపడటం ఒక అద్భుతమని పేర్కొన్నారు. ఈరోజును ఎప్పటికీ మర్చిపోలేం.. ఎందుకంటే అకీరా పుట్టినరోజు. అతను ఎదుగుతున్న తీరును చూస్తుంటే మాకు చాలా గర్వంగా ఉంది. అతడు ప్రతి విషయాన్ని లోతుగా ఆలోచించి తెలుసుకుంటాడు. ఎప్పుడూ కొత్త విషయాలను నేర్చుకోవాలనే ఆసక్తితో ఉంటాడు. ఇక మరోవైపు గతేడాది ఇదే రోజు మార్క్ అగ్నిప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నాడు. అందుకే ఈరోజు మేము మా ఇద్దరు అబ్బాయిల విషయంలో సెలబ్రేట్ చేసుకుంటున్నాం. మార్క్‌కు ఇది నిజంగా పునర్జన్మ అని ఎమోషనల్ అయ్యారు. ఏడాది గడిచినా ఆ ప్రమాదంపై దర్యాప్తు ఇంకా కొనసాగుతూనే ఉంది. 10 ఏళ్ల వయసున్న ఓ చిన్నారి మరణానికి, 18 మంది పిల్లలు ఆసుపత్రి పాలవడానికి కారణం ఎవరో మాకు ఇప్పటికీ తెలియదు. దేవుడి దయ వల్ల మార్క్ ఆ ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డాడు. ఈరోజు అతను క్షేమంగా ఉన్నాడు. తను శ్వాస తీసుకోవడానికి ఇబ్బందిపడుతుంటే ఆసుపత్రి బెడ్ పక్కన కూర్చొని బాధపడిన రోజులు నాకు ఇంకా గుర్తున్నాయి. ఏ తల్లికీ అలాంటి పరిస్థితి రాకూడదు. మార్క్‌తో పాటు 15 మంది పిల్లల్ని కాపాడిన కార్మికులకు నేను ఎప్పటికీ కృతజ్ఞతతో ఉంటాను. వాళ్లు నిజమైన హీరోలు అంటూ ఆ రోజును అన్నాలెజినోవా గుర్తుచేసుకున్నారు. ఆ ప్రమాదం ఫొటోలతో పాటు తాను తిరుమలలో తలనీలాలు ఇచ్చిన ఫొటోను కూడా పంచుకున్నారు.

# అరైవ్ అలైవ్ వీక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు**

**నిర్మల్, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వచ్చే సోమవారం నుంచి, అరైవ్ అలైవ్ వీక్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అరైవ్ అలైవ్ వీక్ కార్యక్రమం నిర్వహణపై, సీఎస్ రామకృష్ణారావు, రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాదు నుంచి, అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులతో గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల బారిన పడి ప్రజలెందరో ప్రాణాలు కోల్పోతున్నారని, అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సైతం ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి రోడ్డు ప్రమాదాలను తగ్గించవలసిన అవసరం ఉందన్నారు. డిజిపి శివధర్ రెడ్డి మాట్లాడుతూ, అధికారులు అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహించి, రోడ్డు భద్రత పై ప్రజలకు



అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల, అధికారులతో కలిసి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13 వ తేది నుంచి నిర్వహించే అరైవ్ అలైవ్ వీక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. 13వ తేదీన గ్రామీణ స్థాయిలో, గ్రామ సభలు నిర్వహించి, రోడ్డు భద్రతా నియమాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామాల్లో తరచు ప్రమాదాలు జరిగే ప్రదేశాలు ఏమైనా ఉంటే గుర్తించి, ప్రమాద రహితంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. వారం రోజులపాటు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగేలా విద్యార్థులచే ర్యాలీలు, మండల స్థాయి కార్యక్రమాలు, వాహన చోదకులకు కంటి పరీక్షలు, తదితర కార్యక్రమాలు నిర్వహించాలని వివరించారు. అన్ని కార్యక్రమాలలో ప్రజలను, ప్రజా ప్రతినిధులను పెద్ద ఎత్తున భాగ్యస్వామ్యం చేయాలని అన్నారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, అరైవ్ అలైవ్ వీక్ కార్యక్రమంలో పోలీసులు, అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని అన్నారు. ట్రాఫిక్ నియమాలపై ప్రజలలో అవగాహన కల్పించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చునని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సిపిఓ జీవరత్నం, డిపిఓ శ్రీనివాస్, డిఇఓ భోజన్న, డిఎంహెచ్వో రాజేందర్, జెడ్పీ సీఈవో శంకర్, డిసిఎస్ఓ రాజేందర్, డిపిఆర్ఓ విష్ణు వర్ధన్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పాఠశాలకు బోధనేతర సిబ్బంది నియామకం చేయాలి

**- ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశంలో తీర్మానం**

**వేములవాడ, ఏప్రిల్ 9: నేటి మన దేశమ్ ప్రతినిధి** రాష్ట్రంలోని ప్రతి పాఠశాలలో కనీసం ఒక్కరైనా బోధనేతర సిబ్బందిని నియమించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిలి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని కోరారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్టీయూ ద్వితీయ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు రేవోజు సదానందం అధ్యక్షతన వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం పలు తీర్మానాలను ఆమోదించింది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్సీ నివేదికను తెప్పించి పీఆర్సీ ప్రకటించాలని, పెండింగ్లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, పెన్షనర్ల రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలన్నింటిలో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించాలని, పదో తరగతిలో ఫిజిక్స్, బయాలజీ సబ్జెక్టులకు 100 మార్కుల ప్రత్యేక పరీక్షలు నిర్వహించాలని, పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందించాలని కోరారు. ప్రతి పాఠశాలలో బోధనేతర సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి మొగిలి లక్ష్మణ్ వార్షిక నివేదిక సమర్పించగా, అన్ని మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు తమ నివేదికలను అందజేశారు. కార్యక్రమంలో యాదగిరి, రామంచ రవీందర్, ఎంఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తిని సత్యనారాయణ గౌడ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి నవీన్, జిల్లా, మండల బాధ్యులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు డిపిఆర్ఓ సూచన



**అదిలాబాద్ ఏప్రిల్ 09 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** పలువురు మీడియా మిత్రులు జిల్లా కార్డు స్థానంలో రాష్ట్ర కార్డు ఆప్షన్ను ఎంచుకుని దరఖాస్తులు సమర్పించిడం గమనించినట్లు అదిలాబాద్, నిర్మల్ జిల్లాల డిపిఆర్ఓ విష్ణువర్ధన్ తెలిపారు. రాష్ట్ర కార్డులు హైదరాబాద్లోని సంబంధిత కార్యాలయం ద్వారా మంజూరు చేయబడతాయని స్పష్టం చేశారు. జిల్లా కార్డు, మండల కార్డులు మాత్రమే జిల్లా పౌర సంబంధాల అధికారి ( డిపిఆర్ఓ ) లాగిన్లో ప్రాసెస్ చేయబడతాయన్నారు. దరఖాస్తు సమర్పించే జాగ్రత్తగా పునః పరిశీలించి, సరైన కేటగిరీని మాత్రమే ఆన్లైన్లో సమర్పించగలరు తెలిపారు.

## నేడే ఆయుష్ డే కార్యక్రమం




**అదిలాబాద్ ఏప్రిల్ 09 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** గురువారం రోజు ఆయుష్ విభాగంలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా అదిలాబాదులోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈరోజు 10న శుక్రవారం ఆయుష్ డే, వరల్డ్ హోమియోపతి డే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయుష్ వైద్యుడు కస్తాల చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 7:30 గంటలకు యోగా కార్యక్రమం ఉంటుందన్నారు. ఉదయం 10:30 గంటలకు హమాలివాడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా ఆయుష్ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## రాంజీ గోండ్ 166 వర్ధంతి వేడుకల్లో మున్సిపల్ చైర్ పర్సన్



**అదిలాబాద్ ఏప్రిల్ 09 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** ఆదివాసి పోరుబిడ్డ రాంజీ గోండ్ 166వ వర్ధంతి వేడుకలను ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం బస్టాండ్ ఎదుట ఏర్పాటు చేసిన వర్ధంతి కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ హాజరై ఆయన విగ్రహం వద్ద పూజలు చేశారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నేతలు పలు సమస్యలను చైర్ పర్సన్ దృష్టికి తీసుకురాగా....వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ...జిల్లా అంటే అడువుల జిల్లానే కాకుండా ఆదివాసుల జిల్లా అని గుర్తు చేశారు. వారి సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని పేర్కొన్నారు. దేశ స్వతంత్ర్య సమరంలో రాంజీగోండ్ పాత్ర కీలకమన్నారు. అదే విధంగా ఆదివాసీ నాయకులు పలు సమస్యలను తెలియజేశారని వాటిని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు మడావి రాజు, సిడం రాంకిషన్, కుర్సుంగ తనాజీ, గేడం మాదవ్, జంగు పటేల్, దుర్వ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## రెండవ రోజు కు చేరిన ఆర్టీజన్ కార్మికుల సమ్మె



**నారాయణపేట ఏప్రిల్ 09(నేటి మన దేశమ్ ప్రతినిధి)** విద్యుత్ శాఖ ఆర్టిజన్ కార్మికుల సమ్మె రెండో రోజుకు చేరింది. ఆర్టిజన్ కార్మికులు 2017 లో ఆర్టిజన్ కార్మికులుగా ప్రభుత్వం లో విలీనం చేసుకునే సందర్భంలో నూతన జీ.వో. ను గత ప్రభుత్వం తీసుకువచ్చింది. ఈ జీ. లో. ద్వారా నియామకమైన ఆర్టిజన్ కార్మికులకు శాశ్వత ఉద్యోగులతో సమానంగా వారికి రావాల్సిన డిమాండ్స్ అందడం లేదని దీని కారణంగా శాశ్వత ఉద్యోగులతో సమానంగా తమకు సైతం రావలసిన జీతభత్యాలు, ఇంక్రిమెంట్లు వచ్చేవరకు ఈ సమ్మె ఆగదని కార్మికులు దీక్షబూనారు. ఆర్టిజన్ కార్మికుల సమ్మె కు తెలంగాణ రాష్ట్ర 11 ఉద్యోగ సంఘాలు మద్దతు తెలుపుతున్నాయి. వీరి మద్దతుతో రాష్ట్రంలోని 23 వేల మంది కార్మికులు సమ్మె బాట పట్టారు. ప్రభుత్వం వీరు కోరిన ఏ.పి.ఎస్.ఈ.బి. రూల్స్ తోపాటు విద్యా అర్హతను బట్టి పదవ తరగతి కల్పించాలని ఆర్టిజన్ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి 1104 యూనియన్ సర్కిల్ ప్రెసిడెంట్ పోలెమోని గోవింద్ రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ నూనె రఘు, 327 యూనియన్ డివిజన్ సెక్రటరీ మైమూద్, కె.ఎల్. శ్రీనివాస్, ఎస్.సి, ఎస్.టి. యూనియన్ వెంటన్న, గోవింద్, దేవణ్ణ, టి.ఆర్.ఎస్.వి.కే. నరహరి గౌడ్ మద్దత్తు తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.వి.జే.ఏ.సి. నారాయణపేట చైర్మన్ నర్సింహులు, ఉమ్మడి జిల్లా కన్వీనర్ దిల్ దార్ , రమేష్, బాల్ రాజు , లక్ష్మీకాంత్, జె.వెంకటేష్ , వినోద్ కుమార్, రాములు, తదితరులు పాల్గొన్నారు

## గిరిజన డిగ్రీ కళాశాల విద్యార్థులకు పుస్తకాల విరాళం




**అదిలాబాద్ ఏప్రిల్ 09 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** న్యూఢిల్లీకి చెందిన సుల్తాన్ చంద్ ద్రోపది దేవి ఎడ్యుకేషన్ ఫౌండేషన్ బుక్ బ్యాంక్ స్కీం ద్వారా గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడుతూ గిరిజన డిగ్రీ కళాశాలకు 2.30 లక్షల విలువైన పుస్తకాలను అందజేసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శివకృష్ణ గారు ఒక ప్రకటనలో తెలిపారు. కామర్స్ ,బిజినెస్ మేనేజ్మెంట్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ,మ్యాథమెటిక్స్ ,స్టాటిస్టిక్స్, ఎకనామిక్స్, సైన్స్ ,ఎన్విరాన్మెంటల్ సైన్స్ ,ఇంగ్లీష్ ,హిందీ వంటి విషయాలకు సంబంధించిన పుస్తకాలు ఉచితంగా కళాశాల లైబ్రరీకి అందించబడ్డాయి. నూతన విద్యా విధానానికి అనుగుణంగా రూపొందించిన ఆధునిక పుస్తకాలు మన గిరిజన విద్యార్థులకు ఎంతో ఉపయోగపతాయన్నారు. విద్యార్థులు ఈ పుస్తకాల ద్వారా తమ విద్యా ప్రగతిని మరింత మెరుగుపరచుకోగలరు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఎం శివకృష్ణ ,అధ్యాపకులు లక్ష్మీ ప్రసన్న ,శిరీష ,రాజేష్, సురేందర్, లక్ష్మణ్ మొదలైన అధ్యాపకులు, లైబ్రేరియన్ ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్మ్డ్ పోలీస్ అధికారులు, సిబ్బంది నివాస భవనాల నిర్మాణ పనులను పరిశీలించిన సీపీ

**పెద్దపల్లి ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్):** రామగుండం పోలీస్ కమిషనరేట్ సాయుధ బలగాల అధికారుల, సిబ్బంది క్వార్టర్స్ నూతన భవనాల నిర్మాణ పనులు పూర్తై ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న నేపథ్యంలో, సీపీ అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తిచేసి, ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీపీ వెంట పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్ రావు, ఆర్ఐలు శేఖర్, రమేష్ ఉన్నారు.



## డ్రంక్ అండ్ డ్రైవ్ లో వ్యక్తికి ఐదు రోజుల జైలు శిక్ష




**పెద్దపల్లి ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్):** రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు శ్రీ ఆధ్వర్యంలో డ్రంక్ డ్రైవ్ లో దొరికిన ఐదుగురిని సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ గోదావరిఖని వెంకటేష్ దుర్వ ముందు హాజరుపరుచగా ముగ్గురికి రూ.6 వేల జరిమానా విధించారు. ఒక వ్యక్తికి రెండవసారి పట్టుబడగా ఐదు రోజుల జైలు శిక్ష విధించారు. వీరిని కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు. సీఐ మాట్లాడుతూ వాహనం మద్యం తాగి వాహనం నడప రాదని నడిపినచో వారిపై చట్టరీత్యా చర్య తీసుకోవడం జరుగుతుందన్నారు. వాహనానికి సంబంధించిన పత్రములు, టూ వీలర్ వెహికల్స్ నడిపేవారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, రాంగ్ రూట్లో వెళ్లరాదని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాహనాన్ని అతివేగంగా నడపరాదని సిఐ సూచించారు.

## ఒకే రోజు నాలుగు ఆలయాల్లో చోరీ



**దుబ్బాక, ఏప్రిల్ 09 నేటి మనదేశమ్** దొంగలు ఆలయాలను లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్న ఘటన స్థానికంగా కలకలం రేపింది. సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాజీపేట వార్డ్ లో ఒకే రోజు నాలుగు ఆలయాల్లో చోరీకి పాల్పడ్డారు. గ్రామంలోని ఎల్లమ్మ, పెద్దమ్మ, మడేలయ్య, గంగమ్మ దేవాలయాల తాళాలను దొంగలు పగలగొట్టి, ఆలయాల్లో ఉన్న బంగారు ఆభరణాలు మరియు నగదును అపహరించారు. ఉదయం ఆలయాలకు వచ్చిన స్థానికులు తాళాలు పగలగొట్టబడిన విషయం గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఒకే రోజు నాలుగు ఆలయాల్లో చోరీలు జరగడంతో గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు. ఆలయ భద్రతపై ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. దొంగలను వీలైనంత త్వరగా పట్టుకుని, అపహరించిన ఆస్తిని తిరిగి ఆలయాలకు అప్పగించాలని గ్రామస్తులు పోలీసులను కోరుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలను సేకరిస్తున్నారు. దొంగలను గుర్తించి అరెస్ట్ చేయడానికి దర్యాప్తు వేగవంతం చేశారు.

## రామగుండంలో ఎమ్మెల్యే పాలన పట్ల అసంతృప్తిలో ప్రజలు

**- నాడు ఎడ్చాడు... నేడు ప్రజలను ఎడిపిస్తున్నాడు**
**- దొంగ ఓట్ల నిర్మూలన కోసం బి.ఆర్.ఎస్ శ్రేణులు పని చేయాలి**
**- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్**



**పెద్దపల్లి ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్):** రామగుండంలో ఎమ్మెల్యే పాలన పట్ల ప్రజలందరూ అసంతృప్తిగా ఉన్నారు..నాడు ఎన్నికల సమయంలో దొంగ ఎడ్పులు ఎడ్చి అధికారం రాగానే నేడు ప్రజలనుఎడిపిస్తున్నడని రాష్ట్రవ్యాప్తంగా దొంగ ఓట్ల నిర్మూలన బీ.ఆర్.ఎస్ పార్టీ అధినాయకత్వం తీసుకున్న విధానాలకు కట్టుబడి రామగుండం నియోజకవర్గ బీ.ఆర్.ఎస్ పార్టీ కార్యకర్తలు పనిచేయాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బీ.ఆర్.ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. గోదావరిఖని మార్కండేయ కాలనీ లోని శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాల్ గురువారం జరిగిన రామగుండం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఆయన మాట్లాడుతూ ఒక్క ఓటు దుర్వినియోగం అయినా ఆయా అభ్యర్థుల భవితవ్యమే మారుతుందని అన్నారు. రామగుండం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో చనిపోయిన వారి ఓటు ఉన్నా, ఇక్కడి నుండి వేరే చోటకు వెళ్ళినవారు ఉన్నా వారి ఓటును తొలగించే విధంగా అధికారులకు తెలియపర్చాలని అన్నారు. రామగుండం నియోజకవర్గంలో ప్రజలు ఎమ్మెల్యే పాలన పట్ల అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. ఎన్నికలప్పుడు తమ వద్దకు వచ్చి ఏడ్చి ఇప్పుడు తమను ఏడిపిస్తున్నారని ఆవేదన చెందుతున్నారని, వచ్చే ఎన్నికల్లో మళ్ళీ ఈ ప్రాంతంలోనే ఉండకుండా తరిమికొట్టడానికి రామగుండం నియోజకవర్గ ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని చెప్పుకొచ్చారు. ఈ సమావేశంలో బీ.ఆర్.ఎస్ పార్టీ నాయకులు కౌశిక హరి మాజీ జెడ్పీటీసీ అముల నారాయణ, మురళీధర్ రావు, ఈ సమావేశంలో నాయకులు కౌశిక హరి, నడిపెల్లి మురళీధర్ రావు, మాజీ జడ్పీటీసీ ఆముల నారాయణ, కార్పొరేటర్లు మేకల సమ్మయ్య యాదవ్, మేకల శారదా, కరక పద్మ, శ్రీనివాస్ రెడ్డి, తోకల రమేష్, గుర్రం ముత్యాలు, నాయకులు నారాయణదాసు మారుతి బోడ్డు రవీందర్, మెతుకు దేవరాజు, జెవి రాజు, నూతి తిరుపతి, చెలుకలపల్లి శ్రీనివాస్, మేడి సదానందం, కల్వచర్ల కృష్ణ వేణీ, బాదె అంజలి, ఇరుగురాళ్ల శ్రావన్, కోలుగూరి సాయి కుమార్ (చింటూ), పిల్లి రమేష్, గౌస్ బాబా, కిరన్ జీ, విరాలాల్, బుర్రి వెంకటేష్, కొడి రామకృష్ణ, గుంపుల లక్ష్మి, గుర్రం పద్మ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

## డెకాయిట్ సరిచేయాల్సిన లెక్కలు



రేపు విడుదల కాబోతున్న డెకాయిట్ మీద ట్రేడ్ వర్గాలే కాదు ప్రేక్షకులు కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. బుక్ మై షోలో ఆల్రెడీ ట్రెండింగ్ లో ఉండగా క్రమంగా నెంబర్లు పెరుగుతూ పోవడం శు భసూచకంగా చెప్పుకోవాలి. అంచనాలు మరీ అరివీరభయంకరంగా ఉన్నాయని చెప్పలేం కానీ అడివి శేష్ బ్రాండ్ తో పాటు ట్రైలర్ లో చూపించిన లవ్, యాక్షన్ కంటెంట్ దీన్ని థియేటర్ ఎక్స్ పీరియన్స్ చేయాలనే నమ్మకాన్ని ఆడియన్స్ లో కలిగించింది. అదే ప్లస్ గా మారింది. డెకాయిట్ సరిచేయాల్సిన లెక్కలు చాలానే ఉన్నాయి. మొదటిది అడివి శేష్ హిట్ 2 తర్వాత మూడేళ్ల పాటు దీన్ని నిర్మాణంలో ఉంచిన గ్యాప్ కి న్యాయం జరిగేలా కంటెంట్ ఉందని జనాలు భావించాలి. రెండోది నిర్మాత సుప్రియ యార్లగడ్డ ఈసారి తండ్రి, మావయ్య ప్రమేయం లేకుండా స్వంతంగా అన్నపూర్ణ, ఎస్ఎస్ క్రియేషన్స్ బ్యానర్ల సంయుక్త నిర్మాణంలో ప్రొడక్షన్ మొత్తం తనే చూసుకుంది. ప్రొడ్యూసర్ గా ఈ అడుగు ఎలా ఉంటుందోనని ఇతర నిర్మాతలు వేచి చూస్తున్నారు. మూడోది ఏ బ్రాండ్ ఇమేజ్ లేని దర్శకుడు షానియేల్ డియో పనితనం. డైరెక్షన్ అనుభవం ఎక్కువగా లేకపోయినా ఇంత పెద్ద యాక్షన్ గ్రాండియర్ ని అది కూడా సీనియర్ మోస్ట్ ఆర్టిస్టులతో తెరకెక్కించడం పెద్ద సవాల్. శేష్, నాగార్జున, సుప్రియ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి. నాలుగోది మృణాల్ ఠాకూర్ టేస్ట్. సీతారామం, హాయ్ నాన్న లాంటి క్లాసిక్స్ చేశాక ఫ్యామిలీ స్టార్ రూపంలో తనకో డిజాస్టర్ పడింది. ఇప్పుడు మళ్ళీ ట్రాక్ లోకి రావాలంటే డెకాయిట్ చేయి అందించాలి. ఇలా ఇన్నేసి క్యాలికులేషన్లు డెకాయిట్ మీద ఉన్నాయి. గత వారం రిలీజైన బైకర్, రాకాస చెప్పుకోదగ్గ టాక్ తో మొదటి వీకెండ్ బండి లాగినప్పటికీ తర్వాత స్లో అయ్యాయి. రెండో వారాంతంలో ఏ మేరకు పికప్ అవుతాయనేది డెకాయిట్ రిజల్ట్ మీద ఆధారపడి ఉంటుంది. ఒకవేళ శేష్ మూవీ కనక హిట్ అనిపించుకుంటే ఆటోమేటిక్ గా ఆడియన్స్ ఫస్ట్ ఛాయస్ ఇదే అవుతుంది. టీమ్ కాన్ఫిడెన్స్ చూస్తుంటే నమ్మకాలు నిజమయ్యేలానే ఉన్నాయి. రేపు ఉదయం ఎనిమిది నుంచి షోలు స్టార్ట్ కాబోతున్నాయి.


## దురంధర్ భామకు శ్రీలీల పంచ్?





చాలా తక్కువ సమయంలోనే పెద్ద హీరోయిన్‌గా ఎదిగినప్పటికీ.. చాలా అణకువతో వ్యవహరించే అమ్మాయి శ్రీలీల. ఇప్పటిదాకా ఆమె ఎలాంటి వివాదంలోనూ చిక్కుకోలేదు. ఎప్పుడూ అదుపు తప్పి మాట్లాడింది లేదు. ఎవరికీ పంచ్ వేసింది లేదు. కానీ తొలిసారి ఆమె చేసిన కామెంట్ కొంచెం వివాదాస్పదం అయింది. సినిమాల్లో నటించే అమ్మాయిలకు పీరియడ్స్ అన్నవి ఒక సాకు కాదు అంటూ ఆమె తాజాగా కామెంట్ చేసింది. శ్రీలీల ఇలా మాట్లాడ్డం వెనుక ఒక నేపథ్యం ఉంది. తెలుగులో 'ఓం భీం బుష్' సహా కొన్ని చిత్రాల్లో నటించిన ముంబయి భామ ఆయేషా ఖాన్.. బాలీవుడ్ బ్లాక్‌బస్టర్ మూవీ 'దురంధర్'లో ఒక ఐటెం సాంగ్ చేసిన సంగతి తెలిసిందే. ఆ పాట చేసేటప్పుడు తాను పీరియడ్స్‌లో ఉన్నానని.. అయినా ఆ ఇబ్బందితోనే కష్టమైన డ్యాన్స్ మూమెంట్స్ చేశానని ఆయేషా చెప్పడం చర్చనీయాంశం అయింది. చాలామంది ఆమె పట్ల సానుభూతి ప్రకటించారు. ఆమె కమిట్మెంట్‌ను కొనియాడారు. కానీ కొందరు మాత్రం ఇదేమంత విషయం అన్నట్లుగా కామెంట్లు చేశారు. పీరియడ్స్‌లో ఉంటూ అంతకుమించి కష్టం పడే మహిళలు మన చుట్టూ లేరా, దాన్నే పెద్ద విషయంలా చెప్పడమేంటి అన్నట్లుగా మాట్లాడారు. ఐతే ఎవరో ఊరూ పేరు లేని వాళ్లు ఇలాంటి కామెంట్లు చేస్తారు కానీ.. ఒక పేరున్న హీరోయిన్, పైగా ఎంబీబీఎస్ చదువుకున్న శ్రీలీల ఇదే తరహాలో కామెంట్ చేయడమే వివాదానికి దారి తీసింది. ఒక మహిళగా తాను ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నానని.. తాను పీరియడ్స్‌లో ఉండగా ఎన్నో పాటలకు డ్యాన్స్ చేశానని.. దాన్నొక సాకుగా చూపించే అవకాశం లేదని ఆమె స్పష్టం చేసింది. శారీరకంగా, మానసికంగా అన్ని సవాళ్లకూ సిద్ధంగా ఉండాలని శ్రీలీల అభిప్రాయపడింది. ఆయేషాకు కౌంటర్‌గా ఉద్దేశపూర్వకరంగానే శ్రీలీల ఈ వ్యాఖ్యలు చేసిందో లేదో కానీ.. అందరూ దానికే కనెక్ట్ చేసుకుంటున్నారు. ఒక మహిళ, పైగా డాక్టర్ అయి ఉండి ఇలాంటి కామెంట్లు చేయడమేంటి అంటూ ఆమెను కొందరు తప్పుబడుతున్నారు.

## పెద్ది ఐటమ్ సాంగ్.. ఏదో అనుకుంటే



ప్రస్తుతం టాలీవుడ్లో తర్వాత రాబోయే పెద్ద సినిమా.. పెద్దినే. వేసవికి షెడ్యూల్ అయిన ఏకైక పెద్ద చిత్రమిది. మార్చి 27 నుంచి ఏప్రిల్ 30కి వాయిదా పడ్డ ఆ మూవీ.. ఈ డేట్‌కు కూడా కట్టుబడి ఉంటుందా అన్నది సందేహంగానే ఉంది. వాయిదా లాంఛనమే అంటున్నారు. మరి కొన్ని రోజుల్లో కొత్త డేట్ ప్రకటిస్తారని తెలుస్తోంది. ఈ దిశగా అభిమానులను ముందే ప్రిపేర్ చేసేసిన టీం.. మిగతా పనుల మీద దృష్టిసారించింది. ఈ చిత్రంలో అదిరిపోయే ఐటెం సాంగ్ ఉంటుందని.. అందులో డ్యాన్సులు అదిరిపోతాయని కొన్ని రోజుల ముందే సమాచారం బయటికి వచ్చింది. ఈ పాటలో చరణ్‌తో పాటు డ్యాన్స్ చేసే హీరోయిన్‌కు సంబంధించి రకరకాల పేర్లు వినిపించాయి. చివరగా మృణాల్ ఠాకూర్ పేరు తెరపైకి వచ్చింది. ఇప్పటిదాకా తెలుగులో గ్లామర్ పాత్ర చేయని మృణాల్.. తొలిసారి ఐటెం సాంగ్ చేస్తే ఎలా ఉంటుందా అని అందరూ ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఐతే మృణాల్ 'పెద్ది' పాట చేయబోతోందని ఫిక్సయిపోయి భారీ అంచనాలతో ఉన్న మెగా అభిమానులకు దర్శకుడు బుచ్చిబాబు సానా పెద్ద షాక్ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. ఈ పాటలో మృణాల్ నర్తించదట. 'కపుల్ ఫ్రెండ్లీ'తో మంచి గుర్తింపు సంపాదించిన తెలుగమ్మాయి మానస వారణాసిని ఈ పాటలో చూడబోతున్నామట. ప్రేక్షకుల అంచనాలకు భిన్నంగా మానసను ఈ పాట కోసం ఓకే చేశారట. మానస కెరీర్లో తొలి అడుగులు వేస్తున్న అమ్మాయి. ఆమె ఇప్పటిదాకా తెలుగులో చేసిన రెండు సినిమాల్లో తన గ్లామర్ హైలైట్ అవ్వలేదు. 'కపుల్ ఫ్రెండ్లీ'లో అయితే ఒక మామూలు మధ్య తరగతి అమ్మాయిలా కనిపించింది. పెర్ఫామెన్స్‌తో మెప్పించింది. ఆమె ఐటెం సాంగ్‌లో కనిపించడం అన్నది కచ్చితంగా షాకే. దీన్ని మెగా ఫ్యాన్స్ ఎలా తీసుకుంటారో చెప్పలేం. ఇప్పటికైతే ఇది కేవలం సమాచారం మాత్రమే.. ఎంతవరకు లాక్ అయ్యిందో అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాలి. చాలా ఏళ్లుగా ఐటెం సాంగ్స్ కూడా పెద్ద హీరోయిన్లే చేస్తున్నారు. చరణ్ సినిమా అంటే స్పెషల్ సాంగ్ చేసే హీరోయిన్‌కు కూడా ఒక రేంజ్ ఉండాలని ఫ్యాన్స్ ఆశిస్తారు. కానీ బుచ్చిబాబు వారి ఆకాంక్షలకు భిన్నంగా వెళ్తున్నాడు. మరి మానస ఎలా మెప్పిస్తుందో.. తెరపై ఈ పాట ఎలా పండుతుందో చూడాలి.




## డోస్ సరిపోలేదు రాజా




'పుష్ప-2' లాంటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ తర్వాత అల్లు అర్జున్ సినిమా మీద ఏ స్థాయిలో అంచనాలు ఉంటాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. త్రివిక్రమ్ సినిమాను హోల్డ్‌లో పెట్టి మరీ అట్లీతో బన్నీ జట్టు కట్టడంతో అది చాలా ప్రత్యేకమైన సినిమానే అయి ఉంటుందని అభిమానులు భావించారు. ఇప్పటిదాకా అట్లీకి ఫెయిల్యూర్ అన్నదే లేదు. 'రాజా రాణి' నుంచి 'జవాన్' వరకూ అన్నీ బ్లాక్‌బస్టర్లే. కాకపోతే అట్లీ సినిమాలు రొటీన్‌గా ఉంటాయని.. సగటు కమర్షియల్ మీటర్‌ను దాటి ముందుకు వెళ్లడనే విమర్శలు ఉన్నాయి. కానీ ఈసారి అట్లీ సగటు మాస్ మసాలా సినిమాకు పరిమితం కాకుండా బన్నీ రేంజికి తగ్గట్లు ఒక భారీ ఈవెంట్ ఫిల్మ్ చేయడానికే రెడీ అయ్యాడు. అతను ఏదో స్పెషల్‌గా ట్రై చేస్తున్నాడని.. సినిమాను అనౌన్స్ చేసినపుడే అర్థమైంది. పెద్ద పెద్ద హాలీవుడ్ స్టూడియోలను ఈ సినిమాలో ఇన్వాల్వ్ చేశారు. ఏకంగా రూ.800 కోట్ల బడ్జెట్‌తో సన్ పిక్చర్స్ ఈ సినిమా కోసం రంగంలోకి దిగింది. ఐతే ఈ సినిమా గురించి ఇప్పటిదాకా జనాలు ఊహించుకున్న రేంజిలో అయితే నిన్న రిలీజ్ చేసిన టైటిల్ లుక్ లేదన్నది వాస్తవం. బన్నీ సినిమా నుంచి తొలి విశేషాన్ని పంచుకున్నపుడు సోషల్ మీడియా షేక్ అయిపోతుందనే సంకేతాలను టీం వర్గాలు ఇచ్చాయి. కానీ నిన్న అలా జరగలేదు. ముందు సినిమా నుంచి వీడియో గ్లింప్స్ కాకుండా టైటిల్ లుక్ మాత్రమే రిలీజ్ చేయడంతోనే సగం ఆసక్తి తగ్గిపోయింది. ఇక టైటిల్, బన్నీ లుక్‌కు ఎక్కడెక్కడో పోలికలు కనిపించడంతో ఒక రకమైన నిట్టూర్పు కనిపించింది అభిమానుల్లో. తాము అంచనా వేసినట్లు నిన్న సోషల్ మీడియా షేక్ కాకపోవడంతో ఫ్యాన్స్ డిజప్పాయింట్ అయ్యారు. సోషల్ మీడియా ట్రెండ్స్ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండే బన్నీ టీంకు ఈ ఫీడ్ బ్యాక్ అందకుండా ఉండదు. ఈ ప్రాజెక్టు స్కేల్‌కు తగ్గట్లు తర్వాత ఏదో భారీగా చేస్తే తప్ప సినిమాకు కోరుకున్న హైప్ రాదు. ఇంతకుముందు ఊరించి ఊరించి ప్రస్తుతానికి పక్కన పెట్టి గ్లింప్స్ విషయంలో అట్లీ అండ్ టీం చాలా జాగ్రత్తగా అడుగులు వేయాల్సిందే. దాన్ని వావ్ అనిపించే స్థాయిలో తీర్చిదిద్ది మంచి సందర్భం చూసి రిలీజ్ చేయాలి.



# బిజినెస్ న్యూస్



## Q4లో అదరగొట్టిన TCS.. ఒక్కో షేరుకు రూ.31 డివిడెండ్




ప్రముఖ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ త్రైమాసిక ఫలితాల్లో అదరగొట్టింది. 2025-26 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికి గానూ రూ.13,718 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. అంతకుముందు ఏడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే లాభంలో 12.22 శాతం వృద్ధి కనబరిచింది.గతేడాది మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.12,224 కోట్ల నికర లాభాన్ని కంపెనీ ఆర్జించగా.. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.10, 657 కోట్ల నికర లాభాన్ని కంపెనీ నమోదు చేసింది. 2025-26 పూర్తి ఆర్థిక సంవత్సరానికి రూ.49,210 కోట్ల నికర లాభం పొందింది. సమీక్షిస్తున్న త్రైమాసికానికి గానూ కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం 9.64 శాతం వృద్ధితో రూ.64,479 కోట్ల నుంచి రూ.70,698 కోట్లకు పెరిగింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఆదాయం 4.58 శాతం వృద్ధితో రూ.2.67 లక్షల కోట్లుగా నమోదైనట్లు టీసీఎస్ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గానూ కంపెనీ ఒక్కో షేరుకు రూ.31 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. ఈ త్రైమాసికంలో 12 బిలియన్ డాలర్ల విలువైన భారీ ఒప్పందాలను కుదుర్చుకున్నట్లు కంపెనీ సీఈఓ కృతివాసన్ వెల్లడించారు. కృత్రిమ మేధ సంబంధిత సేవల ద్వారా వచ్చే వార్షిక ఆదాయం 2.3 బిలియన్ డాలర్లు దాటినట్లు వెల్లడించారు. నాలుగో త్రైమాసికంలో నికరంగా 2,000 మందికి పైగా ఉద్యోగులు కంపెనీలో చేరారు. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 5,84,519కి చేరింది. అయితే, వలసల రేటు (అట్రిషన్ రేటు) స్వల్పంగా పెరిగి 13.7 శాతానికి చేరింది. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో కంపెనీ షేరు విలువ 1.09 శాతం లాభంతో రూ.2587.75 వద్ద ముగిసింది.

## 5 రోజుల వరుస లాభాలకు బ్రేక్.. సెన్సెక్స్ 931 పాయింట్లు డౌన్




దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల ఐదు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారినట్లు పైకి కనిపించినా.. నివురుగప్పిన నిప్పులా ఎప్పుడు రాజుకుంటాయోనన్న భయాలు కొనసాగుతుండడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం కుదరడంతో యుద్ధం తాత్కాలికంగా నిలిచిపోయినట్లు కనిపించినా.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ఈ దాడులకు ప్రతిగా హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. దీంతో మళ్లీ అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం స్టాక్ మార్కెట్‌లపై ప్రతికూల ప్రభావం పడింది. మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం, ఎఫ్ఐఐల విక్రయాలూ తోడయ్యాయి. దీంతో సెన్సెక్స్ ఓ దశలో వెయ్యికి పైగా పాయింట్లు నష్టపోగా.. నిఫ్టీ 23,800 దిగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 77,319.33 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,562.90) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా అదే ఒరవడి కనిపించింది. ఇంట్రాడేలో 76,347.90 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 931.25 పాయింట్ల నష్టంతో 76,631.65 వద్ద ముగిసింది. నిఫ్టీ 222.25 పాయింట్లు నష్టపోయి 23,775.10 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 92.62గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండిగో, ఎల్అండ్‌టీ, ఎటర్నల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ స్టాక్స్ ప్రధానంగా నష్టపోయాయి. బీఈఎల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ స్టాక్స్ లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో మళ్లీ ముడిచమురు ధరలు భగ్గుమన్నాయి. కాల్పుల విరమణ ప్రకటనతో 95 డాలర్ల దిగువకు చేరిన బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర.. మళ్లీ 98.42 డాలర్లకు చేరింది. బంగారం ఔన్స్ 4728 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## స్మార్ట్‌టీవీల్లో ఇకపై 90 సెకన్ల యూట్యూబ్ యాడ్స్




ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ స్మార్ట్‌టీవీ (శీబ్‌బఎవ ఎఐం)ల్లో సుదీర్ఘ అన్‌స్కిప్పబుల్ యాడ్స్‌ను తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. ఏకంగా 90 సెకన్ల వరకు స్కిప్ చేయలేని యాడ్స్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షిస్తున్నట్లు తెలిసింది. ఆదాయాన్ని మరింత పెంచుకునేందుకు ఈతరహా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అయితే, దీనిపై యూట్యూబ్ నుంచి అధికార ప్రకటన రావాల్సిఉంది. ఇప్పటివరకు స్మార్ట్‌టీవీల్లో 30 సెకన్ల అన్‌స్కిప్పబుల్ యాడ్స్ మాత్రమే వస్తున్నాయి. దాని స్థానంలో 90 సెకన్ల పాటు ప్రకటనలు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా 20 నిమిషాల నుంచి 40 నిమిషాల నిడివి కలిగిన వీడియోలకు ఈ తరహా యాడ్స్‌ను పుష్ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొందరు యూజర్లకు 90 సెకన్ల యాడ్స్ కనిపిస్తున్నాయి. సంబంధిత ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకొని అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఓ వైపు సంప్రదాయ ప్రకటనదారులను ఆకర్షించడం.. మరోవైపు యాడ్స్ వద్దనుకునే యూజర్లను ప్రీమియం వైపు మళ్లించడమే లక్ష్యంగా ఈ మార్పు చేస్తున్నట్లు టెక్ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీన్ని కేవలం స్మార్ట్‌టీవీలకే పరిమితం చేస్తారా? లేదంటే మొబైల్‌కూ వర్తింపజేస్తారా? చూడాలి మరి.

## పీపీఎఫ్ ఖాతా ఎన్నిసార్లు పొడిగించుకోవచ్చు? వడ్డీ ఎంతొస్తుంది?

దీర్ఘకాలంలో మంచి నిధిని నిర్మించడానికి ఉన్న మార్గాల్లో పబ్లిక్ ప్రావిడెండ్ ఫండ్ ఒకటి (ప్రాఫీ). ఇది కేంద్ర ప్రభుత్వ మద్దతు, హామీ ఉన్న పథకం కావడంతో మీ సొమ్ముకు భరోసా ఉంటుంది. పైగా ఈ పథకంలో రాబడులపై పూర్తిగా ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుంది. సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనాలూ (పాత పన్ను విధానంలో) పొందొచ్చు. సాధారణంగా ఈ పథకం కాలవ్యవధి 15 ఏళ్లు. దీన్ని మరికొంత కాలం పొడిగించుకోవచ్చు. ఇలా ఎంతకాలం పొడిగించుకోవచ్చు? తద్వారా ఎంత మొత్తం సమకూరుతుంది?

ఎక్కడ తెరవొచ్చు?

పీపీఎఫ్ ఖాతాను పోస్టాఫీసులో గానీ, ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల్లో గానీ తెరవొచ్చు. పూర్తి కాలవ్యవధి 15 సంవత్సరాలు. ఏడాదికి కనీస డిపాజిట్ కింద రూ.500, గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు డిపాజిట్ చేయొచ్చు. వడ్డీ ఏడాదికి ప్రస్తుతం 7.10% (3 నెలలకు ఒకసారి ప్రభుత్వం వడ్డీ నిర్ణయిస్తుంది.) లభిస్తోంది. ఈ డిపాజిట్‌కు, వడ్డీకి ప్రభుత్వం హామీ ఉంటుంది కాబట్టి 100% రిస్క్ లేదు. ఆర్థిక సంవత్సరం (మార్చి 31వ తేదీ) పూర్తికాగానే వడ్డీ జమ అవుతుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో పీపీఎఫ్ ఖాతాలో రూ.1.5 లక్షల వరకు సెక్షన్ 80సీ కింద ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తుంది.



ఖాతాను ఎన్నేళ్లు పొడిగించుకోవచ్చు?

పీపీఎఫ్ ఖాతా 15 ఏళ్లకు మెచ్యూర్ అవుతుంది. గడువు తర్వాత మూసేయొచ్చు. కావాలంటే పొడిగించుకోవచ్చు. ఐదేళ్ల బ్లాక్ చొప్పున ఎన్నిసార్లయినా పొడిగించుకునే వీలుంది. ఖాతాను పొడిగించాలంటే మెచ్యూరిటీకి ఏడాదిలోపు పొడిగింపు కోరుతూ దరఖాస్తు చేసుకోవాలి. పొడిగించే కాలానికి డిపాజిట్ చేయొచ్చు. చేయకుండా కూడా కొనసాగించొచ్చు. మధ్యలో ఏదైనా అవసరం ఏర్పడితే అవసరాల నిమిత్తం ఒక బ్లాక్‌లో గరిష్ఠంగా 60% బ్యాలెన్స్‌ని విత్‌డ్రా చేసుకోవచ్చు.

ఎంత వడ్డీ వస్తుంది? ప్రస్తుతం పీపీఎఫ్ ఖాతాలో జమయ్యే మొత్తంపై 7.1 శాతం వడ్డీ లభిస్తోంది. 15 ఏళ్ల పాటు ఈ ఖాతాలో గరిష్ఠ డిపాజిట్ మొత్తం అయిన రూ.1.50 లక్షలు చొప్పున జమ చేస్తే మెచ్యూరిటీ తర్వాత రూ.40.68 లక్షలు వస్తుంది. ఇందులో మీ అసలు 22.50 లక్షలు కాగా.. వడ్డీ రూ.18.18 లక్షలు లభిస్తుంది.

ఆప్షన్-1: ఒకవేళ మీరు మీ పీపీఎఫ్ ఖాతాను 5 సంవత్సరాలు పొడిగించి సంవత్సరానికి రూ.1.50 లక్షలు పెట్టుబడిని కొనసాగిస్తే 20 ఏళ్ల తర్వాత సుమారు రూ.67 లక్షలు వరకు పొందొచ్చు. మరో 5 ఏళ్లు అంటే, 25 ఏళ్ల వరకు ఇదే పెట్టుబడితో కొనసాగిస్తే మెచ్యూరిటీ సుమారు రూ.1.03 కోట్లు వస్తుంది.

ఆప్షన్-2: ఒకవేళ మీరు మెచ్యూరిటీ తర్వాత ఎలాంటి పెట్టుబడులూ పెట్టకుండా మరో 5 ఏళ్ల పాటు పీపీఎఫ్ ఖాతాను కొనసాగిస్తే.. అసలూ వడ్డీ కలిపి 20 ఏళ్లకు రూ.57.32 లక్షలు వస్తుంది. పొడిగించిన ఐదేళ్ల కాలానికి దాదాపు రూ.16 లక్షలు వడ్డీ లభిస్తుంది. మరో ఐదేళ్లు అంటే 25 ఏళ్లకు రూ.80 లక్షలు వరకు సమకూరుతుంది.

చివరిగా: మీకు ఎలాంటి ఆర్థిక అవసరాలు లేకుండా ఉంటే పీపీఎఫ్ ఖాతాలో మెచ్యూరిటీ తర్వాత కూడా పొడిగించడమే మంచిది. అప్పుడే చక్రవడ్డీ ప్రయోజనాన్ని పొందొచ్చు. తక్కువ వయసులోనే ఖాతాను తెరవడం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుంది.

## మూడో వార్డులో కుక్కల బెడద నివారించండి
## కమిషనర్ కు కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ వినతి



**నారాయణపేట ఏప్రిల్ 09 (నేటి మన దేశమ్ ప్రతినిధి)** నారాయణపేట మున్సిపాలిటీలోని 3వ వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని గురువారం వార్డు కాన్సిలర్ కాకర్ల నారాయణమ్మ కమిషనర్ నర్సయ్య ను కలిసి విన్నవించారు.ప్రధానంగా వార్డులో కుక్కల బెడద చాలా ఉందని కుక్కలు ఎప్పుడూ ఎవరిమీద దాడి చేస్తాయో తెలియని పరిస్థితి ఉందని అన్నారు.వార్డు ప్రజలు భయబ్రాంతులకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే కుక్కలను నివారించి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు.అలాగే లింగయ్య గుడి వద్ద కల్వర్టు గుంట పడి నెలలు గడుస్తున్న మరమ్మతు చేయడం లేదని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.రోడ్డు గుంటపడడంతో ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉందని ఆ రోడ్డు గుండా ఆలయానికి,పాఠశాలకు వెళ్ళే జన సంచారం ఎక్కువగా ఉందని అన్నారు.అందువల్ల వెంటనే మరమ్మతు చేయాలని కోరారు.అందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు

## రక్షణశాఖ ఆధ్వర్యంలో అదిలాబాద్
## విమానాశ్రయ నిర్మాణం

-కేంద్రమంత్రులు సంయుక్త మీడియా సమావేశం.



**అదిలాబాద్ఏప్రిల్ 09 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** ఆదిలాబాద్ లో డిఫెన్స్ ఎయిర్ స్ట్రిప్ ఉన్నది.ఆ స్థలంలో నూతన విమానాశ్రయం కట్టాలని చాలాకాలంగా డిమాండ్ ఉంది.ఈ విషయంలో రక్షణ మంత్రి రాజ్ నాథ్,విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తో కలిసి చర్చించాం.ఈ సమావేశంలో.. ఆదిలాబాద్ ఎంపీ నగేశ్,ఎమ్మెల్యే పాయల్ శంకర్ తోపాటుగా.. సివిల్ ఏవియేషన్ అధికారులు, డిఫెన్స్ అధికారులు వికాస్ రాజ్, ఆదిలాబాద్ కలెక్టర్ పాల్గొన్నారు.రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి..ఇవాళ కీలకమైన సమావేశం జరిగింది.ఎప్పటినుంచో తెలంగాణలో ఒకే విమానాశ్రయం ఉంది.కేవలం హైదరాబాద్ ఒక్కటే ఉంది.మిగిలిన ప్రాంతాల్లోనూ విమానాశ్రయాలుండాలనేది తెలంగాణ ప్రజల ఆకాంక్ష.దీనికి తగ్గట్లుగానే.. ఫీజిబిలిటీకి తగ్గట్లుగా విమానాశ్రయాలు నిర్మించాలనేది ప్రధానమంత్రి ఆలోచన.తెలంగాణకు ముఖద్వారమైన.. ఆదిలాబాద్ లోనూ..పర్యాటకానికి,వివిధ వాణిజ్య కార్యక్రమాలను ప్రోత్సహించేలా..విమానాశ్రయం రావాలని చిరకాల డిమాండ్.కిషన్ రెడ్డి తో నిరంతరం చర్చిస్తూ.. వివిధ ఫీజిబుల్ ప్రాంతాల్లో విమానాశ్రయాల నిర్మాణంపై దృష్టిసారించాం.ఇందులో భాగంగా..ఆదిలాబాద్ లో.. 360 ఎకరాలకు సంబంధించిన డిఫెన్స్ స్థలంలో..విమానాశ్రయం నిర్మించాలనుకున్నాం గతేడాది.. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో.. డిఫెన్స్ మినిస్టర్ ని కలిశాం.దీనికి డిఫెన్స్ మినిస్ట్రీ అంగీకారం తెలిపింది.ఈ స్థలంలో ప్రజానీకం కోసం విమానాశ్రయానికి అంగీకారం తెలిపింది.ఆదిలాబాద్ లో విమానాశ్రయానికి అదనంగా మరో 450 ఎకరాల స్థలం అవసరం.రాష్ట్ర ప్రభుత్వానికి భూసేకరణ డిమాండ్ ఇచ్చాం.దీనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించింది.రాజ్ నాథ్ సంపూర్ణ సహకారం ఉంటుందని తెలియజేశారు.ఇందుకు అవసరమైన 450 ఎకరాల స్థలాన్ని అప్పజెప్పాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది.భూసేకరణలో ఎలాంటి సమస్యలు లేవని ఎంపీ నగేశ్,ఎమ్మెల్యే పాయల్ శంకర్ చెప్పారు.

### బేటి బచావో...బేటి పడావో కింద కుట్టు యంత్రాల పంపిణీ చేసిన
## టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి
## కలెక్టర్ పి ప్రావిణ్య



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 9:, (నేటి మన దేశమ్)** జిల్లాలో మహిళల ఆర్థిక స్వావలంబనకు మరొక ముందడుగు పడింది. బేటి బచావో--బేటి పడావో పథకం కింద మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, కుట్టు యంత్రాల పంపిణీతో పాటు బ్యూటీషియన్ శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారుమహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావో--బేటి పడావో పథకం కింద గురువారంసంగారెడ్డి స్థానిక బాలసదనంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా 50 మంది లబ్ధిదారులకు కుట్టు యంత్రాలను పంపిణీ చేయగా, మరో 25 మంది లబ్ధిదారులకు బ్యూటీషియన్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ప్రత్యేకంగా ఆర్థికంగా వెనుకబడిన మహిళలు, ఒంటరి మహిళలు, వితంతువులు, చదువు మధ్యలో మానేసిన వారు మరియు ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఉపాధి అవకాశాలు కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమాన్ని టీజీఐసీసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మొక్కలు నాటారు.కార్యక్రమాన్ని ఉద్దేశించి టీజీఐసీసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ, మహిళల అభ్యున్నతికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, బేటి బచావో--బేటి పడావో పథకం ద్వారా కుట్టు యంత్రాల పంపిణీ, బ్యూటీషియన్ శిక్షణలతో మహిళల జీవనోపాధి మెరుగుపడుతుందని తెలిపారు. స్వయం ఉపాధి ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని మహిళలకు సూచించారు.మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్ మాట్లాడుతూ మహిళలు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు.జిల్లా సంక్షేమ అధికారిణి లలితా కుమారి మహిళా శిశు సంక్షేమ శాఖ అమలు చేస్తున్న పథకాలపై వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి, సీడీపీఓ చంద్రకళ,డిసిపిఓ రత్నం, చిల్డ్రన్ సూపరింటెండెంట్ విజయ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు

## ఆంధ్రాలో విలీనమైన ఐదు గ్రామపంచాయతీలను
## తిరిగి భద్రాచలం లో కలపాలి



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏప్రిల్ 9 నేటి మన దేశమ్ ప్రతినిధి..** భద్రాచలం పరిధిలో ఉన్న తెలంగాణ ఉద్యోగ సంఘాల ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆంధ్రాలో విలీనమైన ఐదు గ్రామపంచాయతీలను తిరిగి భద్రాచలం లో కలపాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న భద్రాచలం ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర తెలంగాణ ఎంప్లాయిస్ (౧+జుజీూజ) నేతలు మరియు ఇతర ప్రజా సంఘాల నాయకులు కలిసి చేసిన పోరాటం వల్లే భద్రాచలం తెలంగాణలో కొనసాగుతుందని పేర్కొన్నారు. అలాగే, ఆంధ్రాలో కలిసిన ఐదు గ్రామపంచాయతీలను తిరిగి భద్రాచలం పరిధిలో చేర్చాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎంప్లాయిస్ నాయకులు, రాష్ట్ర ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ భద్రాచలం చుట్టుపక్కల ప్రాంతాల్లో అభివృద్ధి అసమానంగా జరుగుతోందని, దీనివల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.అంతేకాకుండా, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి సమస్యను పరిష్కరించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యోగ సంఘాల నాయకులు, జిల్లా నాయకులు, వివిధ పార్టీల ప్రతినిధులు, సామాజిక సంఘాలు, ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈనెల 13వ తారీఖున భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు ప్రకటనలో తెలియజేశారు.

## క్రికెట్ పోటీల విజేత గంగాధర జట్టు




**ఆసిఫాబాద్, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్ ప్రతినిధి ) :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం గోలేటి లోని శ్రీ భీమన్న మైదానంలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన 37 వ శ్రీ వేణుగోపాల్ మెమోరియల్ ఇన్విటేషనల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ లో విజేత గా కరీంనగర్ జిల్లా గంగాధర జట్టు విజేతగా నిలిచింది. నాలుగు రోజులపాటు జరిగిన పోటీలు గురువారం ముగిసాయి. ఫైనల్ లో మందమర్రి సింగరేణి ఫ్రెండ్స్ పై గెలుపొంది గంగాధర జట్టు విజేతగా నిలిచింది. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గంగాధర జట్టు 20 ఓవర్లలో ఏడు వికెట్లు నష్టపోయి 151 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన మందమర్రి సింగరేణి ఫ్రెండ్స్ జట్టు ఎనిమిది వికెట్లు నష్టపోయి 151 పరుగులు చేయడంతో మ్యాచ్ డ్రా అయింది. అనంతరం నిర్వహించిన సూపర్ ఓవర్ లో మందమర్రి సింగరేణి ఫ్రెండ్స్ జట్టు 9 పరుగుల లక్ష్యాన్ని గంగాధర జట్టు ముందుంచింది. సూపర్ ఓవర్ లో 10 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన గంగాధర జట్టు మూడు బంతుల్లో 12 పరుగులు సాధించి విజేత గా నిలిచింది. బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం విజయ భాస్కర రెడ్డి విజేత జట్టు కు కప్పు,మెడల్స్ తో పాటు 35 వేల నగదు, రన్నర్ జట్టు కు కప్పు,మెడల్స్ తో పాటు 25 వేల నగదు ను అందజేశారు. ఈ సందర్భంగా జిఎం ఎం విజయ భాస్కర రెడ్డి మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజం అని అన్నారు. అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదిగేందుకు గ్రామీణ స్థాయి పోటీలను వేదికలుగా చేసుకోవాలని క్రీడాకారులకు సూచించారు.
ఈ కార్యక్రమంలో ఏఐటీయుసి బ్రాంచి కార్యదర్శి ఎస్ తిరుపతి, ప్రాజెక్ట్ ఇంజినీర్ వీరన్న, డిజియం సివిల్ మదీనా బాష, పర్సనల్ హెచ్ ఓడి ఎస్ వి రాజేశ్వర్ రావు,ఎస్టేట్ అధికారి సాగర్, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారి డబ్ల్యు పియస్ ఑ జిఏ గౌరవ కార్యదర్శి డి ప్రశాంత్, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ అన్వేష్, జనరల్ క్యాప్టెన్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయికి ఎంపికైన యువ అథ్లెట్



**వేములవాడ, ఏప్రిల్ 9: నేటి మన దేశమ్ ప్రతినిధి** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం నాగయ్యపల్లెకు చెందిన యువ అథ్లెట్ రొండి నిశాంత్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికై ప్రతిభ చాటాడు. బోయిన్‌పల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతున్న నిశాంత్ ఈ నెల 11న హనుమకొండలో నిర్వహించనున్న అథ్లెటిక్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గంజి విశ్వనాథం తెలిపారు.ఇటీవల ఈ నెల 6న నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. నిశాంత్ క్రీడా నైపుణ్యం, పట్టుదల ప్రశంసనీయమని ఉపాధ్యాయులు తెలిపారు.రాష్ట్రస్థాయి పోటీల్లోనూ నిశాంత్ ఉత్తమ ప్రతిభ కనబరిచి అథ్లెటిక్స్ ఫెడరేషన్ కప్ సాధించాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. గంగాధర మండలం మధురానగర్‌లో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు జి నరేష్, ఉపాధ్యాయులు బి రాజు తదితరులు నిశాంత్‌ను అభినందించారు.నాగయ్యపల్లెకు చెందిన యువకుడు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## వివాహ వేడుకల్లో
## కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ఏప్రిల్ 09 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మనుమరాలి పెళ్లి వేడుకకు ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజక వర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి హాజరయ్యారు.హైదరాబాద్ లో జరిగిన వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.


## వెదురుతో తయారు చేసి కళాకృతుల వర్క్ షాప్ కు విద్యుత్తు సౌకర్యం కల్పిస్తాం..

జిల్లా కలెక్టర్: హరిత




**ఆసిఫాబాద్, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్ ప్రతినిధి ) :** వెదురుతో తయారు చేసి కళాకృతుల కేంద్రానికి విద్యుత్తు సౌకర్యం కలిపించి కళాకృతులను తయారు చేసి వారికి ఉపాది కల్పించేల చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హరిత అన్నారు. గురువారం ఆసిఫాబాద్ మండలంలోని సాలేగుడాలో సి. ఎస్. ఆర్ నిదులతో ఆర్. ఆర్. డి. ఎ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన వెదురుతో తయారు చేసే కళాకృతుల వర్క్ షాప్ ను కలెక్టర్ హరిత సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్క్ షాప్ కు విద్యుత్తు సౌకర్యం కల్పించడంతో పాటు కళాకృతులను తయారు చేసి వారికి ఉపాది కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. వెదురు కలపను మన జిల్లాలోని ప్రభుత్వ భూములు,అటవీ భుములల్లో సాగుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా గతంలో వర్క్ షాప్ లో శిక్షణ పొందిన వారికి స్టై ఫండ్, కిట్స్, ట్రైనింగ్ సర్టిఫికెట్లు, ఇవ్వలేదని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమములో జిల్లా మెదర సంఘం ప్రధానకార్యదర్శి రాపాల శ్రీనివాస్, చేతి వృత్తుల కళాకారులు,మహేందర్, నర్సయ్య, రాజేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

## 11న మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలి
## జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**సంగారెడ్డి, జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 09: (నేటి మన దేశమ్)** మహాత్మ జ్యోతిబా పూలే 200 వ జయంతి సందర్భంగా ఈనెల 11న శనివారం ఉదయం 9 గంటలకు ఆర్ ఑ బి కార్యాలయం ప్రక్కన గల జ్యోతిబా పూలే గారి విగ్రహానికి పుష్పమాలంకరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య గురువారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.అనంతరం, వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని నటరాజ్ థియేటర్ పక్కన, కల్వకుంట రోడ్ లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు, బడుగు బలహీన వర్గాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

## భద్రాచలం గ్రామపంచాయతీ సర్పంచిని కలిసిన బాబా ఆలయ కమిటీ



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (నేటి మన దేశమ్ ప్రతినిధి) ఏప్రిల్ 9:** భద్రాచలం జూనియర్ కళాశాల సెంటర్‌లో ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా ఆలయం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఆలయ కమిటీ సభ్యులు కీలక చర్యలు చేపట్టారు. ఆలయం పక్కన ఉన్న అన్నదాన సత్రం ముందు ప్రతిరోజు నిత్య అన్నదానం నిర్వహిస్తారు.గురువారం మరియు పండగ పర్వదినాల్లో భక్తులకు ఎండ, వానల నుంచి రక్షణ కల్పించేందుకు షెడ్డు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు.ఈ నేపథ్యంలో ఆలయ చైర్మన్ కొమ్మనాపల్లి ఆదినారాయణ భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణను కలిసి షెడ్డు నిర్మాణానికి సంబంధించిన దరఖాస్తును సమర్పించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి అబ్బినేని శ్రీనివాసరావు, కోశాధికారి గొర్ల వెంకటేశ్వరరావు, సభ్యులు సరెళ్ల నరేష్, అడబాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## గొల్లగూడెం ఉత్సవాలకు ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు ఆహ్వానం



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 9 (నేటి మన దేశమ్)** సంగారెడ్డి జిల్లాలోని గొల్లగూడెంలో ఈనెల 10వ తేదీ నుంచి ఘనంగా ప్రారంభం కానున్న శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం మరియు ఎల్లమ్మ బోనాల ఉత్సవాల సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ను గొల్లగూడెం కుర్మ సంఘం ప్రతినిధులు, గ్రామ పెద్దలు కలిసి మర్యాదపూర్వకంగా ఆహ్వాన పత్రిక అందజేశారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు ఉత్సవాల విశేషాలను ఎమ్మెల్యే గారికి వివరించగా, స్పందించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఉత్సవాలకు తప్పకుండా హాజరవుతానని హామీ ఇచ్చారు.గ్రామ దేవతల ఉత్సవాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి పుణ్య కార్యక్రమాల్లో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కుర్మ సంఘం నాయకులు లాడే బాలు 9వ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి, లాడే మల్లేశం (కౌన్సిలర్), పెదగొల్ల మల్లేశం, శంకర్, లాడే శేఖర్, లాడే రమేష్, లాడే శ్రీశైలం, లాడే కుమార్, కర్కం మల్లేశం, లాడే వెంకట్, ఇరిగిపల్లి సాయి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం మార్పు కోరుతున్నారనడం జీవన్ రెడ్డికి తగదు...

**పార్టీని విడోద్దని జీవన్ రెడ్డిని కాంగ్రెస్ అధిష్టానం నచ్చజెప్పిన వినలేదు...**

**రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**జగిత్యాల ప్రతినిధి, ఏప్రిల్ 9( నేటి మన దేశమ్ ప్రతినిధి):**రెండు ఏళ్లలోనే సీఎం రేవంత్ రెడ్డిని ప్రజలు మార్పు కోరుతున్నారని జీవన్ రెడ్డి మాట్లాడడం సమంజసం కాదని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.గురువారం జగిత్యాలలోని జగిత్యాల ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్, డీసీసీ అధ్యక్షులు గాజంగి నందయ్య, జిల్లా గ్రంధాలయ చైర్మన్ సంఘానబట్ల దినేష్,జగిత్యాల మున్సిపల్ ఛైర్పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ లతో కలిసి మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారుమంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం రేషన్ ద్వారా సన్న బియ్యం,, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విధ్యుత్, ఇందిరమ్మ ఇండ్లు, 500 లకే సిలిండర్ వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నందుకా రేవంత్ పాలనను మార్పు కోరుతున్నారని జీవన్ రెడ్డిని ప్రశ్నించారు.బీఆర్ఎస్ పార్టీపై జీవన్ రెడ్డి విమర్శలు చేసినట్టు ఎవరు చేయలేరని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేయడం సరికాదన్నారు.జీవన్ రెడ్డి కి కాంగ్రెస్ పార్టీ ఎంతో గౌరవించిందని,పార్టీ విడోద్దని చెబుతూ కాంగ్రెస్ అధిష్టానం నచ్చజెప్పిన కేసీఆర్ తో చేసుకున్న లోపాయకారి ఒప్పందం మేరకు బీ ఆర్ ఎస్ లో చేరుతున్నారని ఆరోపించారు.ఏ నాయకుడి వద్దకు కూడా పీసీసీ అధ్యక్షులు, ఏఐసీసీ నేతలు వెళ్లి నచ్చజేప్పలేదని జీవన్ రెడ్డి పై ఉన్న గౌరవంతో ఇంటికి వెళ్లారని తెలిపారు.రేవంత్ ను ఒడిస్తానంటే ప్రజలు గమనిస్తున్నారని మంత్రి చెప్పారుసామాన్య కార్యకర్తలకు కూడ కాంగ్రెస్ పార్టీలో ప్రాధాన్యత ఉంటుందని దానికి నిదర్శనం నేనేనని పేర్కొన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గం అభివృద్ధి కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం తో కలిసి పనిచేస్తూ నిధులు తీసుకొస్తున్నానని చెప్పారు.యావర్ రోడ్డు విస్తరణకు ముఖ్యమంత్రి నిధులు ఇవ్వడానికి హామీ ఇచ్చారనీ పేర్కొన్నారు. నేను బీఆర్ఎస్ నుండి ఎమ్మెల్యే గా గెలుచ్చినప్పటికి ముందు నుండి మాది కాంగ్రెస్ కుటుంబమేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.డీసీసీ అధ్యక్షులు గాజంగి నందయ్య మాట్లాడుతూ రేవంత్ రెడ్డి పాలన కంటే... కేసీఆర్ పాలన బాగుందని జీవన్ రెడ్డి మాట్లాడడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీలో జీవన్ రెడ్డి వివిద రకాల పదవులు అనుభవించారని, గుర్తింపు ఇవ్వలేదనడం, అగౌర పరిచరానడం సరికాదన్నారు.40 ఏళ్ళు జీవన్ రెడ్డి వెంట నడిచామని, గౌరవం ఇవ్వడం లేదని పార్టీమారడాన్ని వ్యతిరేకిస్తున్నామని నందయ్య పేర్కొన్నారు.సమావేశంలో జగిత్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం,కౌన్సిలర్లు దుమల రాజ్ కుమార్,నవీన్, లక్ష్మీనారాయణ,కొత్త మోహన్, బాల ముకుందశీ, గట్టు సతీష్, చిలుముల లక్ష్మణ్, బండ శంకర్, పిప్పరి అనిత,బింగి రవి కుసరి అనిల్, మనపురి మహేష్, మున్నా, శరత్ రావు, నాగయ్య, రవీందర్ రావు, కోలుగురి దామోదర్ రావు, మహేశ్వర్ రావు,బోగోజీ ముఖేష్ ఖన్నా, సత్యనారాయణ, సంగ నర్సిములు, బాపురెడ్డి తదితరులున్నారు.

**ముందు నీ కుటుంబాన్ని చక్కదిద్దుకోమని కేటీఆర్ కు మంత్రి హితవు**రాబోయే రోజుల్లో బీ ఆర్ ఎస్ పార్టీనీ ప్రజలు కోరుకుంటున్నారని అధికారంలోకి వస్తుందని కళలు కనకండని మంత్రి లక్ష్మణ్ కుమార్ కేటీఆర్ నుద్దేశించి మాట్లాడారు.నువ్వు తపస్సు చేసిన సీ ఎం కాలేవని హితవు పలికారు.నువ్వు సీ ఎం కావాలంటే మీ భావ హరీష్ రావు అడ్డుపాడుతారన్నారు.మళ్ళీ రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అడ్లూరి స్పష్టం చేశారు.కేసీఆర్ కు ధీటైనా నాయకుడు రేవంత్ రెడ్డి అని భావించి కాంగ్రెస్ అధిష్టానం పీసీసీ అధ్యక్షుడిని చేస్తే కష్టపడి పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారాని గుర్తు చేశారు. అప్పుల కూభిలో కురుకుపోయినా రాష్ట్రాన్ని గాడిలో పెట్టి ప్రజలకుచ్చిన 6 గ్యారంటీలను అమలుచేస్తూనే రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్నారన్నారు.బీఆర్ఎస్ పార్టీ బీసీనీ ప్రెసిడెంట్ చేస్తారా... దళితుడిని సీఎం చేస్తారా.. అని మంత్రి బీ ఆర్ ఎస్ నాయకత్వాన్ని నీలాదిశారు.ఎస్సి, బీసీ, ఉద్యమ కారులను కేసీఆర్ దగ్గరికి రానివ్వలేదని మండిపడ్డారు.

# ప్రైవేట్ హాస్పిటల్స్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

**లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం**

**ప్రైవేట్ ఆస్పత్రిలో పేదలకు తక్కువ ఫీజులు తీసుకోవాలి**


**అడిషనల్ కలెక్టర్ బి రాజాగౌడ్**



**జగిత్యాల, ఏప్రిల్ 08 (నేటి మన దేశమ్ ప్రతినిధి):**:ప్రైవేట్ హాస్పిటల్స్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు అడిషనల్ కలెక్టర్ బి రాజాగౌడ్ ఆన్నారు.గురువారం జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ , క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ ఆక్ట్ -2010 మరియు పి సీ పీ ఎన్ డి టీ యాక్ట్ 1994 యొక్క జిల్లా స్థాయి బహుళ సభ్యుల అధికారుల సమావేశం అడిషనల్ కలెక్టర్ ఛాంబర్ లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ హాస్పిటల్స్ కచ్చితంగా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2010 ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవడం కంపల్సరీ అని, రిజిస్ట్రేషన్ సమయంలో పొందుపరిచిన డాక్టర్స్, పారామెడికల్ స్టాఫ్ మాత్రమే సేవలు అందించాలని ఎవరైనా వెళ్ళిపోయిన కానీ కొత్తగా చేరినచో డాక్టర్లను గాని స్టాఫ్ ను గాని ఆడ్ చేయించుకోవాలని తెలిపారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి సుజాత మాట్లాడుతూ పెర్మనెంట్ రిజిస్ట్రేషన్ కోసం 13 అప్లికేషన్స్ వచ్చాయని ఆ సెంటర్లను తనిఖీ చేసి అన్ని సక్రమంగా ఉన్నాయని నిర్ధారించుకొన్నమని వారికి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లోసాధారణ, శస్త్ర చికిత్సల ప్రసవాలతో పాటుఇతర వైద్య సేవలకు తీసుకునే ఫీజులవివరాలతో ఆయా వైద్యశాలలలో బోర్డులనుఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిరుపేదప్రజలు వైద్యం కోసం తమ ఆసుపత్రులకువచ్చినప్పుడు ప్రైవేటు ఆసుపత్రులయాజమాన్యాలు మానవతా దృక్పథంతోవారికి తక్కువ డబ్బులతో చికిత్సఅందజేయాలని ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ కోరారు. ఆసుపత్రుల్లో బయోమెడికల్ వేస్టేజీ నిర్వహణ పకడ్బందీగా ఉండాలని,వైద్యశాలల పరిసరాలు పరిశుభ్రతతోఉండేందుకు తగు చర్యలుతీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ జైపాల్ రెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ ఎన్ శ్రీనివాస్, ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ హేమంత్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ ఆరిఫ్ ఆలిఖాన్ , ఇంచార్జి కటుకం భూమేశ్వర్,హెల్త్ ఎడ్యుకేటర్ తరాల శంకర్, హెచ్ ఈ ఓ రాజేశం, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# పురుషులనూ అనుమతించని ఆలయాలున్నాయ్

## 'శబరిమల' అంశంపై కేంద్రం



కేరళలోని ప్రసిద్ధ శబరిమల ఆలయంలో 10-50 ఏళ్ల వయసు మహిళల ప్రవేశంపై ఉన్న ఆంక్షలను కేంద్ర ప్రభుత్వం మరోసారి సమర్థించింది. ఇది మహిళలపై వివక్ష కాదని, ఏళ్లుగా కొనసాగుతోన్న ఆచారాన్ని గౌరవించడమేనని పేర్కొంది. మన దేశంలో పురుషులనూ అనుమతించని ఆలయాలు కూడా ఉన్నాయని సుప్రీంకోర్టుకు తెలిపింది. 'శబరిమల ఆలయం సహా ప్రార్థనా స్థలాల్లో మహిళలపై వివక్ష' కేసుపై సుప్రీంకోర్టు మూడోరోజు గురువారం కూడా విచారణ కొనసాగించింది. ఈ సందర్భంగా కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది సభ్యుల విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి సమర్పించారు. ఇందులో పలు ఆలయాల గురించి ప్రస్తావించారు. "మన దేశంలో పురుషులకు ప్రవేశం లేని ఆలయాలు కూడా ఉన్నాయి. దేవి భగవతి ఆలయంలో కొన్నేళ్లుగా ఇలాంటి ఆచారం కొనసాగుతోంది. ఇక కేరళలోని ఓ ఆలయంలోకి అబ్బాయిలు మహిళల వేషధారణలో వెళ్తారు. అందుకోసం వారు బ్యూటీపార్లర్‌కు వెళ్లి మరీ అమ్మాయిల్లా తయారవుతారు. కాబట్టి ఇది పురుషాధిక్య లేదా స్త్రీ ఆధిక్య మత విశ్వాసాలకు సంబంధించిన ప్రశ్న కాదు" అని తుషార్ మెహతా తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

శబరిమలలో 10-50 ఏళ్ల మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ 2018లో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ వయసు మహిళలకు ఆలయంలోకి ప్రవేశం నిరాకరణ.. అంటరానితనంగా, రాజ్యాంగ అధికరణం 17కు ఉల్లంఘనగా ఉందని నాడు అత్యున్నత న్యాయస్థానం అభివర్ణించింది. అయితే, ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో పలు రివ్యూ పిటిషన్లు దాఖలయ్యాయి. దీంతో ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి బదిలీ చేస్తూ 2019 నవంబరులో నాటి సీజేఐ రంజన్ గొగొయ్ నిర్ణయం తీసుకున్నారు. తాజాగా దీనిపై సుప్రీంకోర్టులో విస్తృత రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతోంది.

# హెజ్‌బొల్లా నేత హతం.. ఇజ్రాయెల్ ప్రకటన



లెబనాన్‌లోని మిలిటెంట్ సంస్థ హెజ్‌బొల్లాకు చెందిన మరో కీలక నేతను మట్టుపెట్టినట్టు ఇజ్రాయెల్ రక్షణ దళం (ఐడీఎఫ్) గురువారం ఎక్స్ వేదికగా తెలిపింది. హెజ్‌బోల్లా చీఫ్ నజీమ్ ఖాసిమ్‌కు బంధువు, వ్యక్తిగత సలహాదారుడైన అలీ యూసుఫ్ హార్షీ తమ దాడుల్లో కన్నుమూసినట్టు తెలిపింది. బుధవారం బీరుట్ నగరంలో జరిపిన దాడుల్లో యూసుఫ్ అలీ మరణించినట్టు పేర్కొంది. ఆయుధాలు, దళాలను తరలించేందుకు హెజ్‌బొల్లా ఉపయోగించే రెండు మార్గాలపై దాడులు చేశామని ఐడీఎఫ్ తెలిపింది. వీటితో పాటు దక్షిణ లెబనాన్‌లో హెజ్‌బొల్లాకు చెందిన 10 ఆయుధాల నిల్వ కేంద్రాలు, సంస్థ కార్యాలయాలపై దాడులు చేశామని వెల్లడించింది. హెజ్‌బొల్లా చీఫ్ వ్యవహారాల్లో యూసుఫ్ ఖార్షీ కీలకంగా వ్యవహరించేరని పేర్కొంది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న భీకర దాడులతో అమెరికా-ఇరాన్‌ల కాల్పుల విరమణ ఒప్పందంపై ప్రతికూల ప్రభావం ఆందోళనలు పెరుగుతున్నాయి. బుధవారం లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 182 మంది మరణించగా 800 మందికి పైగా గాయపడ్డారు. బీరుట్‌లోని హెజ్‌బొల్లా నేతలను టార్గెట్ చేస్తూ ఇజ్రాయెల్ కేవలం 10 నిమిషాల్లోనే 100 మిసైల్స్‌ను ప్రయోగించింది. బీరూట్‌తో పాటు దక్షిణ లెబనాన్, బేకా వ్యాలీలో ఒకేసారి ఈ దాడులు చేసింది. పౌర నివాసాలు, సామాన్యులను అడ్డుపెట్టుకుని హెజ్‌బొల్లా తమపై దాడులు చేస్తోందని ఇజ్రాయెల్ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే.

# ఉత్కంఠకు తెర.. బారామతిలో సునేత్రా పవార్‌కు మార్గం సుగమం

మహారాష్ట్రలో బారామతి అసెంబ్లీ స్థానం ఉప ఎన్నికపై కొనసాగిన ఉత్కంఠకు తెరపడింది. పోటీ నుంచి వైదొలగనున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది. దీంతో డిప్యూటీ సీఎం సునేత్రా పవార్ ఏకగ్రీవ ఎన్నికకు మార్గం సుగమమైంది. అజిత్ పవార్‌పై ఉన్న గౌరవంతో తమ అభ్యర్థిని ఉపసంహరించు కుంటున్నట్లు మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు హర్షవర్ధన్ సప్కాల్ వెల్లడించారు. ఇదే విషయంపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ సహా ఇతర సీనియర్ నేతలు కాంగ్రెస్‌కు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది జనవరి 28న మహారాష్ట్రలో జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఆయన ప్రాతినిధ్యం వహించిన బారామతి అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఏప్రిల్ 23న అక్కడ పోలింగ్ జరగాల్సిఉంది. చివరకు పోటీ నుంచి కాంగ్రెస్ పార్టీ వైదొలగనున్నట్లు ప్రకటించింది. దీంతో పవార్‌కు కంచుకోటగా ఉన్న బారామతి నుంచి సునేత్రా పవార్ ఎన్నిక ఏకగ్రీవం కానుంది.

# పూలే జయంతి వేడుకలకు హరి అశోక్ కుమార్ కు ఆహ్వానం



**జగిత్యాల ఏప్రిల్ 9(నేటి మన దేశమ్ ప్రతినిధి)**:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా హైదరాబాద్ లోని రవీంద్ర భారతి లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాత్మా జ్యోతిభాపూలే జయంతి వేడుకలకు టీ బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు హరి అశోక్ కుమార్ కు ఆహ్వానం పంపారు.ఏప్రిల్ 11న నెక్లెస్ రోడ్డులో 16 అడుగుల పూలే దంపతుల కాంస్య విగ్రహాలను ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారని ఆ ఆహ్వాన పత్రిక లో పేర్కొన్నట్లు హరి అశోక్ కుమార్ తెలిపారు.

# నేపాల్ మాజీ ప్రధాని బహదూర్ దేవుబాపై అరెస్ట్ వారెంట్




ఖాట్మాండు : అవినీతి ఆరోపణలపై నేపాల్ మాజీ ప్రధాని బహదూర్ దేవుబాపై అరెస్ట్ వారెంట్ జారీ చేసినట్లు అధికారులు గురువారం తెలిపారు. మనీలాండరింగ్ విభాగం అభ్యర్థన మేరకు, దేవుబా భార్య, మాజీ విదేశాంగ మంత్రి అర్జు రాణా దేవుబాపై కూడా అధికారులు వారెంట్ జారీ చేశారని ఖాట్మండుకోర్టు అధికారులు మీడియాకు వెల్లడించారు. దేవుబా, ఆయన భార్య సింగపూర్‌లో ఉండటంతో పోలీసులు ఇంటర్ పోల్ నోటీసులు జారీచేసేందుకు యత్నిస్తున్నారని తెలిపింది. తాను, తన భార్య ప్రస్తుతం దీర్ఘకాలిక వైద్య చికిత్స కోసం విదేశాల్లో ఉన్నామని దేవుబా పేర్కొన్నారు. ఇతర వివరాలు వెల్లడించేందుకు నిరాక రించారు. గత నెలలో, సెప్టెంబర్‌లో జరిగిన అవినీతి వ్యతిరేక నిరసనలపై జరిగిన హింసాత్మక అణచివేతకు పాల్పడ్డారంటూ మరో మాజీ ప్రధాని కె.పి.శర్మ ఓలిని, మాజీ హోంమంత్రి రమేష్ లేఖక్‌ను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రీయ స్వతంత్ర పార్టీకి చెందిన బాలేంద్ర షా ఇటీవల ప్రధానిగా ఎన్నికయ్యారు.

# ఇజ్రాయిల్ బరితెగింపు

**- 24 గంటల్లోనే లెబనాన్‌పై భీకర దాడి**

**- 254 మంది మృతి**

**- హర్మ్యూజ్‌ను మూసివేసిన ఇరాన్**



బీరూట్-టెహ్రాన్ : అనుకున్నంతా జరిగింది. కాల్పుల విరమణ ఒప్పందం పరిధిలోకి లెబనాన్ రాదని వాదిస్తూ వచ్చిన ఇజ్రాయిల్ బరితెగించింది. ఒప్పందం కుదరిన 24 గంటల్లోనే లెబనాన్‌పై భీకర దాడికి దిగింది. బుధవారం రాత్రి పది నిమిషాల వ్యవధిలోనే లెబనాన్‌లోని పలు ప్రదేశాలపై వందకు పైగా వైమానిక దాడులు చేసింది. . ఇజ్రాయిల్ చేసిన ఈ భయానక దాడిలో 254 మంది మృతి చెందినట్లు 'ఆల్ జజీర' తెలిపింది. లెబనాన్ అధికారవర్గాలను ఉటంకిస్తూ ప్రచురించిన కథనంలో ఈ దాడుల్లో 1,165 మందికి పైగా గాయపడ్డారని, వీరిలో పలువురి పరిస్థితి ఆందోళన కరంగా ఉందని పేర్కొంది. దీంతో ఇరాన్ హర్మ్యూజ్ జలసంధిని మరోమారు మూసివేసింది. కాల్పుల విరమణ ఒప్పందానికి భిన్నంగా ఇజ్రాయిల్ చేసిన దాడులకు నిరసనగా జలసంధిని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. నిజా నికి అంతకు కొన్ని గంటల ముందే ఇరాన్ ఈ మేరకు ప్రకటించింది. బుధవారం ఉదయం నుండి లెబనాన్‌పై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ప్రస్తావిస్తూ వాటిని కొనసాగిస్తే హర్మ్యూజ్‌ను మూసివేసి, ఒప్పందం నుండి బయటకు వచ్చేస్తామని హెచ్చరించింది. అయితే, ఈ హెచ్చరికను ఏమాత్రం ఖాతరు చేయకుండా ఇజ్రాయిల్ భీకర దాడులకు తెగబడింది. 1982 తరువాత లెబనాన్‌పై ఇదే అతి పెద్ద దాడి అని చెబుతున్నారు. దాడుల్లో లెబనాన్‌లోని ప్రముఖ మత పెద్ద సాదిక్ ఆలీ నబుల్సీ మరణించారు. లెబనాన్ రాజధాని బీరూట్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఈ దాడులు జరిగాయి.

# అనిల్ అంబానీ రూ.73,000 కోట్ల మోసం - సీబీఐ



న్యూఢిల్లీ: అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) 73,000 కోట్ల రూపాయల మోసం ఆరోపణలలో చిక్కుకుందని, ఏడు కేసులలో దర్యాప్తు కొన సాగుతోందని సీబీఐ సుప్రీంకోర్టుకు తెలిపింది. బ్యాంకు ఉన్నతాధికారుల పాత్ర కూడా దర్యాప్తు పరిధిలో ఉందని కోర్టుకు సమర్పించిన తన స్టేటస్ రిపోర్టులో పేర్కొంది. సీల్డ్ కవర్‌లో సమర్పించిన ఈ సమాచారాన్ని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ మొన్న బహిరంగ కోర్టులో వెల్లడించారు. సుమారు 73,006 కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని ఏజెన్సీలు అంచనా వేస్తున్నాయని ధర్మాసనం తెలిపింది. మనీలాండరింగ్ కేసును దర్యాప్తు చేస్తున్న ఈడీ కూడా ఒక స్టేటస్ రిపోర్టును సమర్పించింది. ఈ కేసును విచారిస్తున్నప్పుడు దర్యాప్తు చేయ డానికి విముఖత చూపినందుకు సుప్రీంకోర్టు గతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మరియు సీబీఐలను విమర్శించింది. బ్యాంకుల కన్సార్టియం నుంచి రూ. 31,580 కోట్లు రుణం తీసుకున్న ఆర్‌కామ్, ఆ డబ్బును అక్రమంగా పొందిందని ఆరోపిస్తూ మాజీ కేంద్ర కార్యదర్శి ఈఏఎస్ శర్మ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం నేపథ్యంలో ఈ విచారణకు ఆదేశించారు.

## మొక్కజొన్న కొనుగోలుకు పరిమితులు తొలగించాలి - బీఆర్ఎస్ ఆందోళన



**మధిర ప్రతినిధి/ముదిగొండ, ఏప్రిల్ 9, నేటి మన దేశమ్.** రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్నను ఎటువంటి పరిమితులు లేకుండా కొనుగోలు చేయాలని, వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రతి గ్రామంలో ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ముదిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ముందుగా ర్యాలీ నిర్వహించిన కార్యకర్తలు రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి తహసీల్దార్ రవికుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కొనుగోలు కేంద్రాల లోపంతో రైతులు తమ పంటను తక్కువ ధరలకు అమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వము స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు, కార్యదర్శులు వాచేపల్లి లక్ష్మారెడ్డి, గడ్డం వెంకట్ గౌడ్, మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, రైతు సమన్వయ సమితి మాజీ కోఆర్డినేటర్ పోట్ల వెంకటప్రసాద్, సీనియర్ నాయకులు బంకమల్లయ్యతో పాటు అనేక మంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆసుపత్రి నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి: మల్లు భట్టి విక్రమార్క



**మధిర ప్రతినిధి /ముదిగొండ, ఏప్రిల్ 9, నేటి మన దేశమ్.** ఆసుపత్రి నిర్మాణంలో ఎలాంటి నాణ్యత లోపాలు ఉండకూడదని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులకు స్పష్టంగా సూచించారు. గురువారం పర్యటనలో భాగంగా ముదిగొండ మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న 30 పడకల ఆసుపత్రి పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత తన కృషితో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. నిర్మాణ పనులు నాణ్యతతో సాగాలని, అవినీతికి తావులేకుండా వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మండల నాయకులు ఉప ముఖ్యమంత్రికి శాలువా కప్పి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మందరపు నాగేశ్వరరావు, ఉసికల రమేష్, మల్లెల అజయ్ తదితర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## సామాజిక రుగ్మతల నిర్మూలనలో జర్నలిస్టులది కీలక పాత్ర

- ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుభాకాంక్షలు



**వేములవాడ, ఏప్రిల్ 09: నేటి మన దేశమ్ ప్రతినిధి** ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య పాత్రికేయులు వారధులుగా ఉంటూ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తున్నారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కొనియాడారు. గురువారం వేములవాడ ప్రెస్ క్లబ్ (ఐజేయూ) నూతన కార్యవర్గ సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజ సేవలో పాత్రికేయులు ముందుండాలని, సామాజిక దురాచారాలను రూపుమాపడంలో మీడియాది ప్రధాన పాత్ర అని పేర్కొన్నారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా జర్నలిస్టులు ముందుకు సాగడం అభినందనీయమన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని, పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన రాపెల్లి శ్రీనివాస్, ఇతర కార్యవర్గ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు రేగుల దేవెందర్, గోగీకారి శ్రీనివాస్, ఐజేయు జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్, ఉపాధ్యక్షుడు కంకణాల సాయి శరత్ బాబు, ప్రధాన కార్యదర్శి ఉల్లెందుల మల్లేశం, కోశాధికారి గడీల ప్రవీణ్, సహాయ కార్యదర్శి మదాం బాబు పాల్గొన్నారు. అలాగే కార్యవర్గ సభ్యులు తుపుకారి శ్రీనివాస్, కొక్కుల శ్రీనివాస్, సయ్యద్ హబీబ్ పాషా, గొంగల్ల రవికుమార్, పోకల ఆంజనేయులు, ఎనుగందుల నగేష్, కాజా నయిమోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పక్కన డబ్బాల జోలికి వెళ్లొద్దు.... జగ్గారెడ్డి



**సంగారెడ్డిజిల్లా ప్రతినిధి ఏప్రిల్ 9 (నేటి మన దేశమ్)** సంగారెడ్డిలో రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకునే పేదల జోలికి వెళ్లొద్దని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లకు పోలీస్ అధికారులను టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కోరారు. డబ్బాలు తోపుడు బండ్లు ఫాస్ట్ ఫుడ్ సెంటర్ పై ఆధారపడి బతికే వారిని ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. నిరుపేద కుటుంబాల జీవనోపాధిని దెబ్బతీయడం సరి కాదని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

## ముదిగొండ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి: మల్లు భట్టి విక్రమార్కకు సర్పంచ్ వినతి





**మధిర ప్రతినిధి/ముదిగొండ, ఏప్రిల్ 9, నేటి మన దేశమ్.** ముదిగొండ మండల కేంద్రం మరియు గ్రామ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే మంజూరు చేసి గ్రామాభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ కట్టకూరి ఉపేందర్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కోరారు. గురువారం ఆయనను కలిసిన సర్పంచ్ శాలువాతో సత్కరించి వినతి పత్రం అందజేసి గ్రామంలోని ప్రధాన సమస్యలను వివరించారు. వినతి పత్రంలో మొత్తం 15 ప్రధాన డిమాండ్లను ప్రస్తావిస్తూ విద్యా, మౌలిక సదుపాయాలు, రహదారులు, ప్రజా సౌకర్యాలు, రైతు సంక్షేమానికి సంబంధించిన అంశాలను వెల్లడించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల హాస్టల్ నిర్మాణం, నూతన డిగ్రీ కళాశాల మంజూరు, గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం, శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయానికి కొత్త భవనం నిర్మించాలని కోరారు. అలాగే రాఘవపురం నుండి తెల్లారుపల్లి వరకు, రాఘవపురం నుండి నాగమయ్య గుడి వరకు, ముదిగొండ జూనియర్ కాలేజీ నుండి రైతు వేదిక వరకు బీటీ రోడ్లు మంజూరు చేయాలని, ఎస్టీ బజారులో డబుల్ లేయర్ సి.సి రోడ్లతో పాటు అంతర్గత రోడ్లను నిర్మించాలని సూచించారు. మినీ స్టేడియం ఏర్పాటు, వైకుంఠ ధామం మరియు ఖబరస్థాన్‌కు ప్రహరీ గోడల నిర్మాణం చేపట్టాలని, అలాగే వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ముదిగొండ గ్రామ అభివృద్ధికి ఈ పనులు కీలకమని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ ఉపేందర్ కోరారు.

## వల్లభి పి.హెచ్.సి లో మెగా వైద్య శిబిరం విజయవంతం



**మధిర ప్రతినిధి /ముదిగొండ, ఏప్రిల్ 9, నేటి మన దేశమ్.** ప్రజా పాలన -- ప్రగతి పథం కార్యక్రమంలో భాగంగా వల్లభి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆరుగురు ప్రత్యేక వైద్య బృందంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ బిక్షాల బిక్షం, ఖమ్మం ఉప జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వేణుమాధవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇలాంటి శిబిరాలను నిర్వహిస్తోందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. వైద్యాధికారి డాక్టర్ ధర్మేంద్ర పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిబిరంలో మొత్తం 318 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విద్యాధికారి పోతురాజు, ఆరోగ్య పర్యవేక్షకులు రవికుమార్, లలిత కుమారి, ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాం ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి,ఏప్రిల్ 09.(నేటి మనదేశమ్ ప్రతినిధి)** కలెక్టరేట్ సమీపం లో గల ఈవీఎం గోదాం ను గురువారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తనిఖీ చేశారు. ప్రతీ నెల నిర్వహించే నియమిత తనిఖీలలో భాగంగా ఈవీఎం గోదాంను సందర్శించి పరిశీలించారు. గోదాంలో భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, డబుల్ లాక్ సిస్టమ్, ఫైర్ సేఫ్టీ పరికరాలు తదితర అంశాలను కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరచిన ఈవీఎంల స్థితి, నిర్వహణ విధానం, రికార్డుల నిర్వహణపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, ఎలాంటి లోపాలు లేకుండా పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు సూచించారు. అనంతరం వాటర్ ట్యాంక్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో ఎన్ వి గిరి, తహసీల్దార్ హిమబిందు, రెవెన్యూ, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు రుచికరమైన ఆహారం అందించాలి..జిల్లా కలెక్టర్ హరిత



**ఆసిఫాబాద్, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్ ప్రతినిధి ) :** ప్రభుత్వ బడులలో చదివే విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు రుచికరమైన మధ్యాహ్న బోజనము అందించాలని కలెక్టర్ హరిత అన్నారు. గురువారం వాంకిడి మండలంలో బెండారా గ్రామములోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను కలెక్టర్ అకస్మికంగా తనికి చేసి మధ్యాహ్న భోజనం వంటశాలను, మూత్రశాలలు తరగతి గదులను, సందర్శించారు. ఈ విద్యార్థులకు నిర్వహిస్తున్న వార్షిక పరీక్షల తీరును పరిశీలించారు. కొందరు విద్యార్థులు గైర్హాజరు కావడాన్ని గమనించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ బడులలో అనేక మౌలిక వసతులు కల్పిస్తున్నదని అన్నారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని విద్యలో రానించాలన్నారు. గైర్హాజరౌతున్న విద్యార్థుల తల్లి దండ్రులతో మాట్లాడి బడికి వచ్చెలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు రుచికరమైన ఆహారాన్ని అందించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమములో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఊరటగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**మధిర ప్రతినిధి /ముదిగొండ, ఏప్రిల్ 9, నేటి మన దేశమ్.** ముదిగొండ మండల పరిధిలోని వల్లభి, గోకెనేపల్లి, మేడేపల్లి గ్రామాల్లో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సర్పంచులు బిచ్చల బిక్షం, శ్రీనివాసరావు, చెరుకుపల్లి జగన్నాథం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు తమ ధాన్యాన్ని నేరుగా కేంద్రాలకు తీసుకువచ్చి సరైన ధర పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు మధ్యవర్తుల ఇబ్బందులు లేకుండా ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం సత్యనారాయణ, వ్యవసాయ విస్తరణ అధికారి మౌనిక, కార్యదర్శులు పావని, కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా పి ఆర్ టి యు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**కామారెడ్డి,ఏప్రిల్ 09.(నేటి మనదేశమ్ ప్రతినిధి)** కామారెడ్డి జిల్లా కేంద్రంలో పిఆర్టియు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కామారెడ్డి జిల్లా అధ్యక్షులు అంబీర్ మనోహర్ రావు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పి ఆర్ టి యు తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షులు గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి నాయకత్వంలో నిరంతరం ఉపాధ్యాయుల శ్రేయస్సు కాంక్షించే సంఘం పిఆర్టియు తెలంగాణ అని సంఘం బలోపేతానికి అందరం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జనపాల లక్ష్మీరాజం, రాష్ట్ర మరియు జిల్లా బాధ్యులు గిరి, శ్రీధర్ రావు, నరసింహారెడ్డి, సురేందర్, రాము, ఎల్లాగౌడ్ ,మారుతి తదితరులు పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రికి పూల మొక్కతో స్వాగతం పలికిన ఎమ్మార్వో.



**మధిర ప్రతినిధి /ముదిగొండ, ఏప్రిల్ 9, నేటి మన దేశమ్.** ముదిగొండ మండల పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు మండల తహసీల్దార్ రవి పూల మొక్కను అందజేసి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మండలంలోని అభివృద్ధి కార్యక్రమాలు, జరుగుతున్న పనులపై ఉప ముఖ్య మంత్రికి వివరాలు తెలియజేశారు. ప్రభుత్వ పథకాలు సమర్థంగా అమలవుతున్నట్లు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి మండలంలోని పలు అభివృద్ధి పనులను పరిశీలిస్తూ అధికారులకు అవసరమైన సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ఈ వి ఎం గోదాం వద్దా పటిష్టమైన బద్రత చర్యలు...

జిల్లా కలెక్టర్: హరిత



**ఆసిఫాబాద్, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్ ప్రతినిధి ) :** ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరిచిన గోదాం వద్ద పటిష్టమైన భద్రత చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరిచిన గోదాంను నెలవారి తనిఖీలో భాగంగా కలెక్టర్ సందర్శించారు. గేటుకు సీలుతో వేసిన తాళం సి. సి. కెమెరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ. వి. ఎం. గోదాం వద్ద సి,సి కెమెరాల పర్యవేక్షణతో పాటు పటిష్టమైన బందోబస్తు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమములో ఎన్నికల విభాగం అధికారులు జమిల్ శ్యాంలాల్, ముసాఫిర్ హుస్సేన్ పాల్గొన్నారు. అనంతరం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయ ఆవరణలో గల ఉద్యాన వనాన్ని కలెక్టర్ పరిశీలించారు. కలెక్టరేట్ కు వివిధ పనులకు వచ్చే సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందేలా నీడనిచ్చే చెట్లు, అవసరమైన పూల మొక్కలను పెంచాలన్నారు. పిచ్చి మొక్కలను తొలగించి వాటి స్థానంలో నీడనిచ్చే చెట్లు, పండ్ల మొక్కలను పెంచాలన్నారు. బారి వర్షాల వల్ల గుంతలు పడ్డ చోట మొరం వేసి చదును చేయాలనీ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమములో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు రక్షణశాఖ గ్రీన్‌సిగ్నల్

- వీలైనంత త్వరగా శంకుస్థాపన - ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో టెర్మినల్
- కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, కిషన్‌రెడ్డి వెల్లడి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 09 :** ఆదిలాబాద్‌లో విమానాశ్రయ నిర్మాణానికి కేంద్ర రక్షణ శాఖ ముందుకు వచ్చిందని కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ప్రకటించారు. బుధవారం ఢిల్లీలో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధీనంలో ఉన్న ఎయిర్‌స్ట్రిప్ వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతం కావడంతో శిక్షణ కేంద్రంతో పాటు, పౌర విమానాల సేవల కోసం అభివృద్ధి చేయాలని రక్షణశాఖ ప్రతిపాదించిందని మంత్రి తెలిపారు. సామాన్య ప్రజల కోసం ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) టర్మినల్ బిల్డింగ్ నిర్మిస్తుందన్నారు. ఈ నెల 17న.. విమానయాన, రక్షణ శాఖ అధికారులతో కూడని బృందం ఆదిలాబాద్‌లో పర్యటించి ఓఎల్ఎస్ సర్వే చేస్తారని, అనంతరం రన్‌వే ఓరియంటేషన్, మాస్టర్ ప్లాన్ ఖరారు చేస్తారని వెల్లడించారు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన అదనపు 450 ఎకరాల భూమిని రాష్ట్రప్రభుత్వం త్వరగా అప్పగించాలని కోరామని, అందుకు ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందిం చిందని తెలిపారు. తెలంగాణకు ముఖ ద్వారంగా ఉన్న ఆదిలాబాద్‌లో విమానా శ్రయం అందు బాటులోకి వస్తే భవి ష్యత్‌లో వాణిజ్యపరంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణకు ఒకే విమానశ్రయం ఉందన్న భావన ప్రజల్లో ఉందని, వారి డిమాండ్‌కు అనుగుణంగా.. విమానశ్రయాల అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని చెప్పారు. వరంగల్‌లో మామునూరు విమానాశ్రయ ఏర్పాటుకు సంబం ధించి భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని, మరో 3 నెలల్లో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయబోతున్నామని తెలిపారు. పెద్దపల్లిలోని అంతర్గాం వద్ద ఎయిర్ పోర్టు ఏర్పాటుకు నిర్వహించిన అధ్యయనంలో సాను కూల ఫలితాలు వచ్చాయని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వ తుదినిర్ణయం కోసం వేచి చూస్తున్నామని పేర్కొన్నారు. కొత్తగూడెంలో ప్రతి పాదించిన స్థలం విమానాశ్రయానికి అనుకూలం కాదని స్పష్టం చేశారు. ఈ భేటీలో కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, కిషన్‌రెడ్డి, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు.



# నేతన్నలకు గౌరవప్రదమైన జీవనం లక్ష్యం: మంత్రి సవిత

**అమరావతి, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్) :** రాష్ట్రంలోని చేనేత కార్మికులకు గౌరవప్రదమైన జీవనాన్ని కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్. సవిత అన్నారు. రాష్ట్రంలోని చేనేత కుటుంబాలకు చంద్రబాబు ప్రభుత్వం ఈ నెల 1 నుంచి ఉచిత విద్యుత్ అమలు చేసింది. ఈ సందర్భంగా ఏపీ పద్మశాలీ సంఘం ప్రతినిధులు అమరావతిలో మంత్రితో భేటీ అయ్యి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి సవిత మాట్లాడుతూ.. చంద్రబాబు నేతృత్వంలో కూటమిప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. నూతన టెక్స్‌టైల్ పాలసీ ద్వారా లభించే ప్రయోజనాలు, చేనేత విక్రయాల పెంపునకు చేస్తున్న కృషి వివరించారు.

# అక్రమాస్తుల కేసు..
# ఏసీబీ కస్టడీకి దేవాదాయ శాఖ అధికారిణి శాంతి?





**విజయవాడ, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్) :** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కళింగిరి శాంతి చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఆమెను విచారణ నిమిత్తం తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అక్రమ ఆస్తుల వ్యవహారంలో మరిన్ని కీలక వివరాలు రాబట్టేందుకు శాంతిని ఐదు రోజుల పాటు తమ కస్టడీకి అనుమతించాలని ఏసీబీ కోరింది. సోదాల సమయంలో లభించిన పత్రాలు, ఆస్తుల వివరాలపై ఆమె సరైన సమాధానాలు ఇవ్వలేదని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌పై నేడు (గురువారం) ఏసీబీ న్యాయస్థానం విచారణ జరపనుంది. సోదాల సమయంలో స్వాధీనం చేసుకున్న కొన్ని స్థిరాస్తులు, డాక్యుమెంట్ల గురించి శాంతి స్పష్టమైన వివరణ ఇవ్వలేదని, ఆమె నోరు విప్పితే మరిన్ని అక్రమాలు బయటపడతాయని అధికారులు భావిస్తున్నారు. గ్రూప్-1 ఆఫీసర్‌గా ఎంపికై దేవాదాయ శాఖలో చేరిన నాటి నుంచే ఆమె భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విశాఖపట్నం, విజయవాడ వంటి ప్రధాన నగరాల్లో అసిస్టెంట్ కమిషనర్ హోదాలో పనిచేసిన సమయంలో ఆమె ఈ అక్రమాలకు పాల్పడినట్లు ఏసీబీ ఆధారాలు సేకరించింది. గత కొన్ని రోజులుగా కళింగిరి శాంతి నివాసాలు, బంధువుల ఇళ్లలో జరిగిన సోదాల్లో కోట్ల రూపాయల విలువైన ఆస్తులు బయట పడిన సంగతి తెలిసిందే. విధుల్లో చేరిన తక్కువ కాలంలోనే ఒక గ్రూప్-1 అధికారి ఇంత పెద్ద మొత్తంలో ఆస్తులు ఎలా సంపాదించారనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. నేడు కోర్టు ఇచ్చే తీర్పు ఆధారంగా శాంతిని ఏసీబీ అధికారులు ప్రశ్నించనున్నారు.

ఈ విచారణలో మరికొంత మంది దేవాదాయ శాఖ అధికారుల హస్తం ఉందా లేదా అనే విషయాలు కూడా వెలుగు చూసే అవకాశం ఉంది.

# అభయాంజనేయ స్వామిని దర్శించుకున్న హోం మంత్రి అనిత

**ఏలూరు, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్) :** అప్పన్నవీడులో గురువారం అభయాంజనేయ స్వామివారిని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికి, వేద పండితులు మంత్రికి ఆశీర్వచనాలు అందిం చారు. ఆలయ పాలకవర్గం చైర్మన్ మంత్రికి అభయ ఆంజనేయ చిత్రపటాన్ని బహూకరించారు. హోంశాఖ మంత్రి అనితకు సాంప్రదాయ బద్ధంగా చీర, సారెను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అందించారు. హోం మంత్రి వెంట ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), రాష్ట్ర అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు, ఆలయ పాలకవర్గ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



# కెసిఆర్‌తో కలసి రాష్ట్రం కోసం పనిచేస్తా

### మీడియాతో మాజీమంత్రి జీవన్ రెడ్డి ఆవేదన

**జగిత్యాల, ఏప్రిల్ 09 :** తాను భారత రాష్ట్ర సమితిలో చేరాలని నిర్ణయించుకున్నట్లు మాజీ మంత్రి జీవన్ రెడ్డి తెలిపారు. జగిత్యాలలో జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ భేటీ అయ్యారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. తన శేష జీవితంలో కేసీఆర్‌తో పనిచేసే అవకాశం వచ్చిందని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌తో కలిసి పనిచేస్తే.. రాష్ట్ర భవిష్యత్‌కు పాటుపడవచ్చని అన్నారు. 27 నెలలుగా చాలా క్షోభ అనుభవించినట్లు వెల్లడించారు. కాంగ్రెస్‌కు రాజీనామా చేసినప్పుడు.. భావోద్వేగానికి గుర య్యాను. బీఆర్ఎస్ కంటే మెరుగైన పాలన అందిస్తారని కాంగ్రెస్‌కు ఓటేశారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో రాష్ట్రం తిరోగమన దిశలో నడిచింది. 2014లోనే కేసీఆర్ నాయ కత్వంలో పనిచేసే అవకాశం వచ్చింది. కేసీఆర్‌తో పనిచేసే అవకాశం వచ్చినా.. కాంగ్రెస్‌లోనే కొనసాగా. రాష్ట్ర అవసరాల కోసం ఇప్పుడు బీఆర్ఎస్‌తో కలిసి పనిచేస్తా అని జీవన్‌రెడ్డి తెలిపారు. కేసీఆర్ సూచన మేరకు కేటీఆర్ తన ఇంటికి పార్టీలోకి ఆహ్వానించేందుకు వచ్చారని అన్నారు. ప్రజాభిప్రాయం మేరకే బీఆర్ఎస్ లో చేరుతానని వెల్లడించారు జీవన్ రెడ్డి. తనను పార్టీలోకి ఆహ్వానించినందుకు కేసీఆర్, కేటీఆర్ లకు హృదయపూర్వక ధన్యవాదాలు చెబుతున్నానని అన్నారు.కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడం భావోద్వేగానికి గురి చేసిందని.. ఇవాళ బీఆర్ఎస్ తో కలవడం సంతోషంగా ఉందని అన్నారు జీవన్ రెడ్డి. గత 20 మాసాలుగా అవమానాలు తట్టుకుని ఓపిక పట్టానని అన్నారు. ఎందరి ప్రభుత్వాలో చూశాను.. కానీ, ఈ ప్రభుత్వం మాత్రం తిరోగమన దిశలో ఉందని అన్నారు జీవన్ రెడ్డి. ప్రజాభిప్రాయం మేరకే ఈ నిర్ణయం తీసుకున్నానని.. కేసీఆర్ నాయకత్వంలో పని చేసే అవకాశం రావడం సంతోషంగా ఉందని అన్నారు జీవన్ రెడ్డి. కేసీఆర్, జీవన్ రెడ్డి మధ్య నాలుగు దశాబ్దాలకుపైగా స్నేహం ఉంది. గతంలోనూ ఆయన్ను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించాం. కాంగ్రెస్‌తో అనుబంధం వల్ల జీవన్‌రెడ్డి గతంలో పార్టీ మారలేదు. ఇప్పుడు మరోసారి జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించాం. రెండ్రోజుల్లో కేసీఆర్‌ను జీవన్‌రెడ్డి కలుస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలు విసుగు చెందారు. రైతులకు రూ.27 వేల కోట్ల రైతు భరోసా నిధులు ఎగ్గొట్టారు. హామీలు అమలు చేయకుండా అనవసర మాటలు మాట్లాడుతున్నారు.

# ఏయూ విద్యార్థులు నాయకులుగా ఎదగాలి

## ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**విశాఖపట్నం, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్) :** ఆంధ్రా యూనివర్సిటీ విద్యార్థులు నాయకులుగా ఎదగాలని, విజయాలు సాధించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు. ఎయు శతాబ్ది ఉత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న మెగా కల్చరల్ ఫెస్ట్‌లో బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సిఆర్ రెడ్డి, సర్వేపల్లి రాధాకృష్ణన్, సివి రామన్ వంటి వ్యక్తులు ఇక్కడ తమ మేధస్సుతో విశ్వవిద్యాలయాన్ని నడిపించారని కొనియాడారు. మీరంతా ఈ విశ్వవిద్యాలయం భవిష్యత్తు అని, ఇక్కడ గడిపేసమయం మీ జీవితంలో అత్యంత ముఖ్యమైన సమయం అని పేర్కొన్నారు. సమాజానికి ఉపయోగపడే బాధ్యత విద్య అందిస్తుందన్నారు. ఎయు ప్రాంగణం ఒక క్యాంపస్ మాత్రమే కాదని, విలువలతో దేశ నిర్మాణంలో సైతం ముఖ్య భూమిక పోషించిందని తెలిపారు. శతాబ్ద కాలాన్ని పూర్తిచేసుకొని భారతీయ వారసత్వ సంపదకు నిదర్శనంగా ఏయు నిలిచిందని కొనియాడారు. వివిధ రంగాలలో సమాజాన్ని ముందు నిలిపే నాయకులుగా ఎందరో ఇక్కడినుండి ఎదిగారని, అటువంటి వ్యక్తులుగా మీరుకుడా ఎదగాలని సూచించారు. మీ ధ్యేయం సమాజ సేవ కావాలని, మీ జ్ఞానం మీ కోసమే కాకుండా, సమాజానికి దేశానికి ఉపయుక్తంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఎయు విసి ఆచార్య జిపి.రాజశేఖర్ మాట్లాడుతూ, శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. టెక్నికల్, కల్చరల్, అవుట్‌రీచ్ విభాగాలు నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో కల్చరల్ ఫెస్టివల్ చైర్మన్ ఆచార్య ఎన్.విజయ మోహన్, రెక్టార్ ఆచార్య పి.కింగ్, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాం బాబు, ఫెస్ట్ కో చైర్మన్ ఆచార్య ఎ.పల్లవి, కన్వీనర్లు ఆచార్య ఎన్ఎం యుగంధర్, సిహెచ్ ఆశా ఇమ్మానియల్ రాజు, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్ బాబు, సుందరపు, విజయ కుమార్, విఎంఆర్‌డిఎ చైర్మన్ ప్రణవ్ గోపాల్, విశాఖ కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు.... కార్యక్రమంలో భాగంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. వేదికపై ప్రదర్శించిన వివిధ గీతాలకు విద్యార్థినులు నృత్యాలు చేస్తూ కనిపించారు. ఆహ్లాదకర వాతావరణంలో ఫెస్ట్ కార్యక్రమాలు ఉత్సాహభరితంగా సాగాయి. ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణం యువత కేరింతలతో హోరెత్తింది.

# జగన్మోహన్ రెడ్డిని కలిసిన వడ్డి రఘురామ్ నాయుడు



**తాడేపల్లిగూడెం, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్) :** వైసిపి కేంద్ర కార్యాలయంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ వడ్డి రఘురామ్ నాయుడు ఆధ్వర్యంలో నియోజక వర్గ నాయకులతో బుధవారం మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి సమావేశమయ్యారు. తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గం నుండి సుమారు 250 మంది వైసిపి స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్థానిక పరిస్థితులపై మాట్లాడతూ నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యలపై పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శేషులత, నియోజకవర్గ వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# త్వరలో 5 కిలోల సిలిండర్లు..
# కిరోసిన్ పంపిణీ

- గ్రామాలకు సిలిండర్ల డెలివరీలో జాప్యంపై దృష్టి
- జేసీలతో మంత్రి మనోహర్




**అమరావతి, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్) :** ఎల్‌పీజీ ఏజెన్సీలతో సంయుక్త కలెక్టర్లు నిత్యం సమీక్షించాలని.. ప్రజలను ఇబ్బంది పెడుతూ గ్యాస్ సిలిండర్లను పక్కదారి పట్టిస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. 'గ్రామీణ ప్రాంతాల్లో సిలిండర్ల డెలివరీలో జాప్యం జరుగుతోంది. బుకింగ్స్, డెలివరీలను రోజూ అప్‌డేట్ చేసే వ్యవస్థ అందుబాటులోకి రావాలి' అని చెప్పారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరా, రబీ ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై బుధవారం ఆయన కమిషనరేట్ నుంచి జిల్లాల సంయుక్త కలెక్టర్లు, పౌరసరఫరాలశాఖ అధికారులు, ఆయిల్ సంస్థలు, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. 'గ్యాస్ కొరతను అధిగమించేందుకు కేంద్రం 5 కిలోల సిలిండర్ల పంపిణీకి చర్యలు తీసుకుంటోంది. అవసరమైనవారికి వీటిని మార్గదర్శకాల ప్రకారం పంపిణీ చేయాలి. కిరోసిన్ సరఫరాకు కూడా కేంద్రం సిద్ధంగా ఉంది. పాడేరు వంటి ప్రాంతాల్లో కిరోసిన్ అవసరం ఉంటుంది. ఇంకా ఎక్కడెక్కడ అవసరమో గుర్తించి పంపిణీకి చర్యలు తీసుకోవాలి' అని సూచించారు. ఖరీఫ్‌లో రికార్డు స్థాయిలో ధాన్యం సేకరించామని.. రబీలోనూ అదే స్ఫూర్తి కొనసాగించాలని మంత్రి మనోహర్ అధికారులను కోరారు. 'అకాల వర్షాలు పడే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ధాన్యం సేకరణకు చర్యలు తీసుకోవాలి. రైతులకు ఇబ్బంది రాకూడదు' అని పేర్కొన్నారు.

# జూన్ 2నుంచి స్కూల్ విద్యార్థులకు అల్పాహారం

- ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం - డిప్యూటి సిఎం భట్టి విక్రామర్క వెల్లడి





**ఖమ్మం, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్) :** కేసీఆర్ హయాంలోని పదేళ్లు వనరులు దోపిడీకి గురికావటం వల్ల తెలంగాణలో అభివృద్ధి జరగలేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. విద్య ద్వారానే తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. గురువారం ఎర్రుపాలెంలో అమ్మ పౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. అక్షరమే ఆయుధంగా ప్రతి విద్యార్థి ఎదగాలని ఆకాంక్షించారు. జూన్ 2వ తేదీ నుంచి విద్యార్థులకు అల్పాహార పథకం అమల్లోకి తీసుకువస్తామని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామని వివరించారు. ప్రతి బిడ్డకు ఉచితంగా మెరుగైన విద్య అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో 100 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు శ్రీకారం చుడతామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మధిర నియోజకవర్గ రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలో చివరి భూములకు సాగునీరు అందించాలన్నదే తన సంకల్పమని తెలిపారు. రూ.36 కోట్లతో కట్టలేరు కాలువల మరమ్మతులను చేపట్టామని అన్నారు. ఎన్నెస్పీ కెనాల్ మూడవ జోన్ పరిధిలో ఉన్న భూములను రెండవ జోన్ కిందకు తీసుకువచ్చి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందజేస్తున్నామని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో సీతారామ ప్రాజెక్ట్‌ను గాలికొదిలేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీతారామకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయిస్తున్నామని స్పష్టం చేశారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ తీసుకు వస్తున్నామని.. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం జరుగు తోందన్నారు. మధిర నియోజకవర్గంలో రహదారుల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. కట్టలేరు ప్రాజెక్టు పనులను శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు.

## సంసద్ ఖేల్ మహోత్సవ్ ను ప్రారంభించిన ఎంపీ డీ కే అరుణ



**నారాయణపేట ఏప్రిల్ (నేటి మనదేశమ్):** నారాయణపేట జిల్లా కేంద్రంలో ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ ఘనంగా ప్రారంభోత్సవ వేదిక నారాయణపేట ప్రభుత్వ కాలేజ్ గ్రౌండ్ లో ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవన్ని ప్రారంభించిన ఎంపీ డీకే అరుణ బ్యాటింగ్ చేసి క్రికెట్ ఆడిన ఎంపీ డీకే అరుణ మహబూబ్ నగర్ పార్లమెంట్ పరిధిలోని అన్ని మండల కేంద్రాలలో ప్రారంభమైన క్రికెట్,ఖో ఖో, వాలీబాల్,కబడ్డీ క్రీడలు పెద్ద ఎత్తున పాల్గొన్న పాల్గొన్న క్రీడాభిమానులు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ చేర్మెన్ కొండా శ్వేతా సత్య యాదవు బీజేపీ రాష్ట్ర నాయకులు నాగురవు నామాజీ రాతంగ్ పందు రెడ్డి కొండయ్య జిల్లా అధ్యక్షుడు సత్య యాదవు జిల్లా నాయకులు రఘు రమ్యాయ గౌడ్ దొకూరి తిరుపతి రెడ్డి లక్ష్మి శ్యామ్ సుందర్ గౌడ్ కౌన్సిలర్ లు సత్య రఘుపాల్ రెడ్డి కమలాపూర్ ప్రభాకర్ కల్పన రఘు రామయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి నుండి మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ



**కామారెడ్డి,ఏప్రిల్ 09.(నేటి మనదేశమ్ ప్రతినిధి)**ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వైద్య శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 6 నుండి 11 వరకు నిర్వహిస్తున్న ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా గురువారం ప్రభుత్వ ఆసుపత్రి నుండి మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహణ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో జెండా ఊపి ర్యాలీ ని ప్రారంభించారు. ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, ప్రజల్లో ఆరోగ్య సంరక్షణ పట్ల చైతన్యం కలిగించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు.అంతకు ముందు నిర్వహించిన స్పెషల్ క్యాంప్‌లో భాగంగా సంపూర్ణ సురక్ష కేంద్రం, ట్రాన్స్ జెండర్ క్లినిక్‌ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ కేంద్రాల ద్వారా ప్రత్యేక వర్గాలకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అలాగే ఆరోగ్య వారోత్సవాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యమని, ముఖ్యంగా మహిళలు, పిల్లలు, ప్రత్యేక వర్గాల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నదని తెలిపారు. పరిశుభ్రత, పోషకాహారం, నివారణాత్మక వైద్యంపై దృష్టి పెట్టడం ద్వారా అనేక వ్యాధులను ముందుగానే నివారించవచ్చని ఆయన అన్నారు.ఈ కార్యక్రమం లో వైద్యశాఖఅధికారి రవీందర్, ఆసువత్రి సూపరేండెంట్ వెంకటేశ్వర్, డిసిహెచ్ఎస్ విజయ భాస్కర్ రెడ్డి, ఆర్డిఓ ఎన్వి గిరి, తహసీల్దార్ హిమబిందు, డి పి ఆర్ ఓ తిరుమల,ఎంపీడీఓ రాణి, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు, తదితరులు, పాల్గొన్నారు.

## మునగాల మండల సమాచార హక్కు రక్షణ చట్టం 2005 నూతన మండల కమిటీ ఎన్నిక



**కోదాడ ఏప్రిల్ (నేటి మనదేశమ్):** మునగాల మండల కేంద్రంలో గురువారం సమాచార హక్కు రక్షణ చట్టం 2005 మునగాల మండల నూతన కమిటీని జిల్లా పొలిటికల్ కన్వీనర్ బద్దంరాజు కృష్ణ ప్రసాద్, కోదాడ నియోజకవర్గ ఇంచార్జ్ గడ్డం అంజి,మునగాల మండల అధ్యక్షుడు వసంత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మునగాల మండల అధ్యక్షుడిగా వేట అశోక్, మండల ఉపాధ్యక్షుడిగా గడ్డం వినోద్, జనరల్ సెక్రెటరీ చిర్ర వివేక్, జాయింట్ సెక్రెటరీ చిర్ర ప్రవీణ్, ట్రెజరర్ మహేందర్ వీరిని మండల నూతన కమిటీగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా పొలిటికల్ కన్వీనర్ బద్దం రాజు కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.మునగాల మండల సమాచార హక్కు రక్షణ చట్టం 2005 నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. కమిటీల ఏర్పాటుకు కృషి చేస్తున్న కోదాడ నియోజకవర్గ ఇంచార్జ్ గడ్డం అంజిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. మండల కమిటీ ఆర్టిఐ బలోపేతానికి కృషి చేయాలని ఆయన ఈ సందర్భంగా మండల కమిటీకి సూచించారు. ఈ సందర్భంగా కోదాడ నియోజకవర్గ ఇన్చార్జ్ గడ్డం అంజి మాట్లాడుతూ. సూర్యాపేట జిల్లా సమాచార హక్కు రక్షణ చట్టం 2005 అధ్యక్షుడు డాక్టర్ నవీన్ తేజ ఆదేశాల మేరకు ఆయా మండల కమిటీలను ఏర్పాటు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మునగాల నూతన మండల కమిటీ సభ్యులకు ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. మునగాల మండలంలో ఆర్టిఐ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు అనంతరం జిల్లా పొలిటికల్ కన్వీనర్ బద్దం రాజు కృష్ణ ప్రసాద్, కోదాడ నియోజకవర్గ ఇన్చార్జ్ గడ్డం అంజీలను మునగాల మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించినారు.

## ప్రభుత్వ విప్ చొరవతో విద్యుత్ వైర్ల తొలగింపు

### ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఊపిరి



**వేములవాడ, ఏప్రిల్ 9: నేటి మన దేశమ్ ప్రతినిధి** వేములవాడ పట్టణంలోని కోరుట్ల రోడ్ భీమేశ్వర ఫంక్షన్ హాల్ సమీపంలో ప్రమాదకరంగా వెళ్లిన విద్యుత్ వైర్ల కారణంగా నిలిచిపోయిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఊరట లభించింది.లబ్ధిదారురాలు బింగి రేణుకకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి పైనుండి విద్యుత్ లైన్ వెళ్లడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి. సమస్య పరిష్కారం కోసం ఆమె ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.దీనిపై స్పందించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, టీఎస్ ఎన్‌పీడీసీఎల్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గురువారం టీఎస్ ఎన్‌పీడీసీఎల్ అధికారులు ప్రమాదకర విద్యుత్ లైన్‌ను తొలగించడంతో ఇంటి నిర్మాణానికి ఉన్న అడ్డంకి తొలగిపోయింది. దీంతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో లబ్ధిదారురాలు రేణుక ఊపిరి పీల్చుకున్నారు.ఈ సందర్భంగా సమస్యను పరిష్కరించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు, వార్డు కౌన్సిలర్ సిరిగిరి సంగీత-శ్రీకాంత్లకు బింగి రేణుక కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతి ఇంటికి శుద్ధజలం- జల జీవన్ మిషన్ జల మహోత్సవం విజయవంతం




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :ఏప్రిల్ 9: పినపాక నియోజకవర్గం ( నేటి మనదేశమ్ ప్రతినిధి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం భూపాలపట్నంగ్రామపంచాయతీలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జల జీవన్ మిషన్ జల మహోత్సవం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి శుద్ధమైన త్రాగునీరు అందించే లక్ష్యంతో .. హర్ ఘర్ జల్ భావనను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గ్రామంలో మిషన్ భగీరథ నల్ల ప్రారంభించి ప్రతి ఇంటికి సురక్షితమైన త్రాగునీరు అందేలా చర్యలు చేపట్టారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రౌండ్ వాటర్, ఆర్ ఓ, వాటర్, మిషన్ భగీరథ నీటి నాణ్యతను పరిశీలించి, టీడీఎస్.. పరీక్ష ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.శుద్ధమైన త్రాగునీరు ప్రజల ఆరోగ్యానికి అత్యంత అవసరమని, ప్రభుత్వం అందిస్తున్న ఈ సౌకర్యాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు. అలాగే నీటి సంరక్షణ, సరైన వినియోగంపై ప్రజలకు వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ శ్రీనివాస్ రావు, ఎంపీపీ ఓ వెంకటేశ్వర్లు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు ఏ ఈ ప్రవీణ్ (ఇన్‌ఫ్రా), ఏ ఈ లక్ష్మీ, గ్రిడ్ ఏ ఈ మహీంద్రా, ఆర్ ఐ శ్యామ్ సుందర్, మండల అధ్యక్షులు గోడిశాల రామనాథం, ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆపరేషన్ కవచ్ కేవలం నేరస్తుల వేటకే కాదు ఆపదలో ఉన్నవారికి అభయహస్తం

### జిల్లా ఎస్పి శ్రీ యం రాజేష్ చంద్ర




**కామారెడ్డి,ఏప్రిల్ 09.(నేటి మనదేశమ్ ప్రతినిధి)**జిల్లా ఎస్పి శ్రీ యం రాజేష్ చంద్ర మాట్లాడుతూ తల్లి మందలించిందని మనస్తాపం.. పంతంతో ఇల్లు వదిలి అర్ధరాత్రి ఒంటరి ప్రయాణం.. కానీ ఆ బాలుడిని క్షేమంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చింది కామారెడ్డి పోలీసుల నిశిత దృష్టి. కామారెడ్డి జిల్లా పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆపరేషన్ కవాచ్' కేవలం నేరస్తుల వేటకే కాదు, ఆపదలో ఉన్నవారికి అభయహస్తం అని కామారెడ్డి పోలీసులు మరోసారి నిరూపించారు. నిజామాబాద్ నగరం వినాయక నగర్‌కు చెందిన 14 ఏళ్ల బాలుడు, మాతృమూర్తి మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఎవరికీ చెప్పకుండా మంగళవారం మధ్యాహ్నం తన సైకిల్‌పై నిజామాబాద్ నుండి కామారెడ్డి వైపు బయలుదేరాడు. దాదాపు 50 కిలోమీటర్ల ప్రయాణం చేసి, అర్ధరాత్రి 11:00 గంటల సమయంలో టేక్రియాల్ జంక్షన్ వద్దకు చేరుకున్నాడు.అదే సమయంలో అక్కడ 'ఆపరేషన్ కవాచ్' తనిఖీలు నిర్వహిస్తున్న దేవునిపల్లి పోలీసులు.. చీకట్లో ఒంటరిగా సైకిల్‌పై వెళ్తున్న బాలుడిని గమనించారు. అనుమానం వచ్చి ఆపి, బాలుడిని ప్రేమతో పలకరించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే స్పందించిన పోలీసులు బాలుడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు.అప్పటికే కుమారుడి ఆచూకీ తెలియక ఆందోళనలో ఉన్న తల్లిదండ్రులు బుధవారం తెల్లవారుజామున 3:00 గంటలకు దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసుల సమక్షంలో బాలుడికి కౌన్సెలింగ్ ఇచ్చి, క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. తమ బిడ్డను కాపాడిన పోలీసులకు తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతూ కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 'ఆపరేషన్ కవాచ్' యొక్క ముఖ్య ఉద్దేశ్యం నేరాల నియంత్రణతో పాటు, ప్రతి పౌరుడికి రక్షణ కల్పించడమేనని పునరుద్ఘాటించారు.కామారెడ్డి జిల్లాలో ప్రజల భద్రత కోసం మేము ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఆపరేషన్ కవాచ్' నేడు ఆపదలో ఉన్న ఒక బాలుడిని సురక్షితంగా రక్షించడం ఎంతో సంతోషకరం. అర్ధరాత్రి వేళ ఆ బాలుడు ప్రమాదకర స్థితిలో ఉన్నప్పుడు, మా సిబ్బంది అత్యంత అప్రమత్తంగా వ్యవహరించి, మానవీయ కోణంలో స్పందించి ఆ బాలుడి భవిష్యత్తును కాపాడటం అభినందనీయం.పోలీసు యంత్రాంగం ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటుంది. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఎవరైనా ఆపదలో ఉన్నా లేదా అనుమానాస్పద స్థితిలో వ్యక్తులు కనిపించినా వెంటనే 'డయల్ 100' లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ప్రజల రక్షణే మా మొదటి ప్రాధాన్యత. సమయస్ఫూర్తితో వ్యవహరించి బాలుడిని కాపాడిన దేవునిపల్లి పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించడం జరిగింది.

## ఐ టి సి కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలియజేసిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు..



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: ఏప్రిల్ 9: బూర్గంపహాడ్ ( నేటి మన దేశమ్ ప్రతినిధి)** ఈరోజు బూర్గంపహడ్ మండలం సారపాక గ్రామ పంచాయతీలో గల ఐ టి సి పి ఎస్ పి డి కాంట్రాక్ట్ కార్మికుల జేఏసీ యూనియన్ ఆధ్వర్యంలో 15వ రోజు రిలే నిరాహారదీక్ష నిర్వహించడం జరుగుతుంది, ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ తరపున మద్దతు తెలియజేసిన బూర్గంపహడ్ మండల మాజీ జెడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత , ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ బూర్గంపహడ్ మండలంలో ఉన్న ఐటీసీ కర్మాగారంలో చుట్టు ప్రక్కల ఉన్న పరిసర ప్రాంతాల నుంచి ఎంతో మంది కార్మికులు జీవనం సాగిస్తున్నారు, వారికి న్యాయపరమైన వేతనాలు అందించాలి, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రస్తుతం ఉన్న వేతనాలతో జీవనం సాగించటంలో చాలా ఇబ్బందులు పడుతున్నారు, కనుక 13 వ వేతన ఒప్పందంలో జరిగిన అన్యాయాన్ని గుర్తించి 14వ వేతన ఒప్పందంలో కాంట్రాక్టు కార్మికులకు న్యాయం జరిగేలాగా సానుకూలంగా స్పందించి మంచి వేతనాన్ని అందించాలని కోరుకున్నారు, కార్మికులకు మంచి వేతనాన్ని అందించడంతో కార్మికులందరూ కలిసికట్టుగా పనిచేసి కంపెనీ అభివృద్ధికి దోహదపడతారు కనుక వారికి న్యాయం జరిగేలాగా ఆలోచించాలని అన్ని యూనియన్లు కలిసికట్టుగా కార్మికులకు అండగా నిలవాలని అన్నారు, బిఆర్ఎస్ పార్ట్ తరఫున సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని చెప్పారు ఈ కార్యక్రమంలో బూర్గంపాడు మండల మాజీ జెడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత , టిఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్ , బి ఆర్ టి యు.. యూనియన్ అధ్యక్షులు సానికొమ్ము శంకర్ రెడ్డి ,టౌన్ అధ్యక్షులు కొనకంచి శ్రీను ,యూత్ అధ్యక్షుడు సోములక్ష్మి చైతన్య రెడ్డి, తాళగుమ్మూరు సర్పంచ్ గుమ్మడి కృష్ణవేణి, మాజీ ఎంపీటీసీ దాసరి వెంకటరమణ, చల్లకోటి పూర్ణ చందర్, బానోత్ శ్రీను , బొబ్బిలి, పంగి సురేష్, ఆంజనేయులు, మరియు, ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అనుబంధ సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు

## సామాజిక విప్లవ కేతనం: డాక్టర్ బి.ఆర్ ,అంబ్రేడ్కర్ విగ్రహాని ఆవిష్కరించిన ఎమ్మెల్యే పాయం



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: ఏప్రిల్ 9: పినపాక నియోజకవర్గం (నేటి మన దేశమ్ ప్రతినిధి)**ఆకాశమంతటి ఆశయానికి ప్రతిరూపం...కోట్లాది మంది గుండె చప్పుడు...భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం పినపాక మండలం జానంపేట గ్రామ వీధుల్లో నేడు కొలువుదీరింది..!! కేవలం విగ్రహం ఆవిష్కరణ మాత్రమే కాదు, అణగారిన వర్గాల ఆత్మగౌరవ ప్రతీక సాక్షాత్కరించిన వేళ ఆ ప్రాంతమంతా జై భీమ్ నినాదాలతో మారుమోగిపోయింది...!!

**ఆవేశం..ఆలోచన..ఆవిష్కరణ..** ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గౌరవ పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు బాబాసాహెబ్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తుంటే సభికుల్లో ఒక్కసారిగా రోమాలు నిక్కబొడుచుకున్నాయి...!!

**చదువుకో..సంఘటితమవ్వు.. పోరాడు.. విజయం సాధిస్తావు** అనే అంబేద్కర్ మాటలే మనకు మార్గదర్శకాలు.ఆయన చూపిన బాటలో నడుస్తూ ఈ గడ్డపై ప్రతి బిడ్డకు సామాజిక న్యాయం అందే వరకు విశ్రమించబోము. అని ఎమ్మెల్యే పాయం ఉద్వేగంగా ప్రసంగించారు....!!

## జాతీయ స్థాయిలో ఉపాధ్యాయురాలి ప్రతిభ



**వేములవాడ, ఏప్రిల్ 9: నేటి మన దేశమ్ ప్రతినిధి** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని పీఎం జెడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలు కె రాధిక జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారు.భారతీ ఎయిర్‌టెల్ ఫౌండేషన్ దేశవ్యాప్తంగా నిర్వహించిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ బోధనా సామగ్రి తయారీ పోటీల్లో ఆమె రూపొందించిన 'పరమాణు నిర్మాణం' నమూనాకు ద్వితీయ బహుమతి లభించింది.క్లిష్టమైన సైన్స్ అంశాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా వివరించడంలో ఆమె చూపిన సృజనాత్మకతకు ఈ గుర్తింపు దక్కింది.ఈ సందర్భంగా గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. బన్నాజీ ఆధ్వర్యంలో రాధిక టీచర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ రాధిక సాధించిన విజయం మన పాఠశాలకే కాకుండా జిల్లాకే గర్వకారణం అన్నారు. ఉపాధ్యాయులు తమ సృజనాత్మకతతో బోధనను సులభతరం చేస్తే విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. ఈ విజయం విద్యార్థులకు, తోటి ఉపాధ్యాయులకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు బి కృష్ణ, వి బాలరాజు, పి సత్యనారాయణ, ఏ సరళ, టి సరిత, టి బాబు రాజు, జె. రవీందర్ రావు, ఎన్ స్వాతి, సిహెచ్ అరుంధతి, కె సుచరిత, పి వనిత, పి సవిత, జి వనిత, ఏ సునీత తదితరులు పాల్గొని రాధికకు అభినందనలు తెలిపారు.

## గోదావరి జలాలతో ఎదురుగట్ల చెరువు కళకళ

### - రైతుల ఆశలు నెరవేర్చిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 09: నేటి మన దేశమ్ ప్రతినిధి** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్ల గ్రామ చెరువులోకి గోదావరి జలాలు చేరడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. చెరువు నిండుగా నీటితో కళకళలాడుతుండగా గంగమ్మ తల్లికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఎదురుగట్ల చెరువుకు గోదావరి జలాలు చేరడం వెనుక ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కృషి ఎంతో ఉందని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, రైతుల సంక్షేమం పట్ల ఆయన చూపుతున్న చిత్తశుద్ధి కారణంగానే చెరువు నిండుగా నీటితో కళకళలాడుతోందని పేర్కొన్నారు.కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సోయినేని కరుణాకర్, గ్రామ సర్పంచ్ కడారి తిరుపతి సంధ్య, అడిక శ్రీనివాసరెడ్డి, జైపాల్‌రెడ్డి, పొన్నం మల్లేశం, నేదూరి నరసయ్య, పాలకుర్తి శంకరయ్య, రోమాల ప్రవీణ్, వంగపల్లి మల్లేశం, గంగారెడ్డి, భూమిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ప్రకాష్, రామస్వామి, బాలయ్య, కిషన్, నాగేందర్, నాగరాజు, కొమురయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్ ను సందర్శించిన జిల్లా కలెక్టర్



**నారాయణపేట ఏప్రిల్ 09 ( నేటి మన దేశమ్ ప్రతినిధి )**జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ముందల గల ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్,అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ ఫణీంద్ర రెడ్డి,గురువారం సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్ సీళ్లను, పోలీసు బందోబస్తును పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ అమరేందర్,ఎన్నికల విభాగం అధికారులు జయసుధ , రాణి తదితరులు ఉన్నారు.

# పోలీస్ స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేదు ఇంటి వద్దే ఎఫ్ఐఆర్ నమోదు

## జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట ఏప్రిల్ 09 ( నేటి మన దేశమ్ ప్రతినిధి)** ప్రజలకు మరింత సౌలభ్యం కల్పించేందుకు తెలంగాణ పోలీసులు "ఇంటి వద్దే ఎఫ్ఐఆర్ నమోదు" విధానాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విధానం ద్వారా బాధితులు పోలీస్ స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేకుండా, ఫోన్ ద్వారా సమాచారం అందించిన వెంటనే పోలీసులు బాధితుల నివాసానికి లేదా వారికి అనుకూలమైన ప్రదేశానికి వెళ్లి ఫిర్యాదును స్వీకరిస్తారు. ఫిర్యాదు రాయలేని పరిస్థితుల్లో పోలీసులే బాధితుడి వాంగ్మూలాన్ని వారి భాషలో నమోదు చేసి, చదివి వినిపించి సంతకం తీసుకొని అక్కడికక్కడే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ప్రతిని అందజేస్తారు. ప్రత్యేకంగా మహిళలు, పిల్లలు మరియు బలహీన వర్గాల వారికి ఈ విధానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. లైంగిక నేరాలు, హత్యాయత్నం, గాయపరిచే ఘటనలు, దొంగతనం, దోపిడీ, చోరీ వంటి ఆస్తి సంబంధిత నేరాలు, పోక్సో కేసులు, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులు, బాల్య వివాహ నిరోధక చట్టాలకు సంబంధించిన కేసుల్లో ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది. మహిళలు, పిల్లల కేసుల్లో మహిళా పోలీసు అధికారిని తప్పనిసరిగా పంపిస్తారు. అవసరమైతే ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయుల సమక్షంలో వాంగ్మూలం నమోదు చేస్తారు. పోలీసులు సంఘటన స్థలాన్ని రక్షించి, సాక్ష్యాలను సేకరించే చర్యలు వెంటనే ప్రారంభిస్తారు. ఈ విధానం వల్ల ఫిర్యాదు నమోదు ప్రక్రియ వేగవంతమవుతుంది, ఆలస్యం తగ్గుతుంది, అలాగే బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లే ఇబ్బంది తగ్గుతుంది. ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకొని నేరాలను నిర్భయంగా ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ కోరారు. నారాయణపేట జిల్లా పోలీసులు ప్రజల భద్రతకు కట్టుబడి పనిచేస్తున్నారని తెలిపారు.

# పోటు రంగారావు మీద పెట్టిన దేశద్రోహం కేసును వెంటనే ఎత్తివేయాలి

## కె. కాశీనాథ్ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి డిమాండ్



**నారాయణపేట ఏప్రిల్09( నేటి మన దేశమ్ ప్రతినిధి )** సిపిఎంఎల్ మాస్ లైన్ కేంద్ర కమిటీ సహాయ కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి అయిన పోటు రంగారావు మీద కేంద్ర ప్రభుత్వం, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ఎన్ఐఏ పెట్టిన దేశద్రోహం, ఉప, తదితర కుట్ర కేసులను వెంటనే ఎత్తివేయాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ డివిజన్ కార్యదర్శి కె కాశీనాథ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమిత్ షా, మోడీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల మీద, దేశ సంపదను అదాని, అంబానీ లకు దోచిపెడుతూ,ప్రజల మీద మోపుతున్న దేశద్రోహం, కుట్ర కేసులను,ప్రశ్నించి, వ్యతిరేకిస్తున్నందుకు, నిరసన తెలియపరచినందుకు సహించలేక బంధించుటకు ప్రభుత్వం అనేక రకాలుగా వేధింపులకు గురి చేస్తుందని వారు విమర్శించారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ చట్టబద్ధంగా బహిరంగ కార్యకలాపాలను నిర్వహిస్తూ, ప్రజా సమస్యల మీద పోరాడుతున్నదని, పాలకవర్గాలు పెట్టుబడిదారీ వర్గాలు ప్రజలను దోపిడీ చేస్తున్న తీరుతెన్ను లను ప్రజలకు వివరించి,చైతన్య పరుస్తున్నందుకు తప్పుడు కేసులను బనాయించి జైల్ లో బంధించటానికి పూనుకున్న దని వారు విమర్శించారు. ప్రొఫెసర్ సాయిబాబా, జేఎన్యు యూనివర్సిటీ నాయకుడు ఉమర్ ఖలీదు, హర గోపాల్, విమలక్క, గాదె ఇన్నయ్య తదితరుల మీద కూడా తీవ్రవాద కార్యకలాపాల నిరోధక చట్టం,దేశద్రోహం కేసులను మోపిందనీ బెదిరి పాలకవర్గాలు వాటినే ఎత్తివేసిందని వారు తెలిపారు. అత్రాస్లో ఒక బాలిక మీద అత్యాచారం జరిపితే న్యూస్ ని కవర్ చేయడానికి వెళ్లిన కప్పన్ మీద కూడా ఉప కేసు మోపి జైల్లో బంధించిందని ఈ చర్య అప్ర ప్రజాస్వామికమైనదని వారు విమర్శించారు. పోటు రంగారావు 50 సంవత్సరాల నుండి విప్లవోద్యమంలో, పి డి ఎస్ యు, పి వై ఎల్ వంటి విద్యార్థి యువజన సంఘాలలో సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా విప్లవ పార్టీఆధ్వర్యలో సుదీర్ఘకాలం పోరాటాలలో పాల్గొన్నారని తెలియపరిచారు. అందుకు కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యల మీద పోరాడుతున్నందుకు కట్టడి చేయటానికి తప్పుడు ఆరోపణలు చేసి కుట్ర కేసులు బనాయిస్తుందని, ఇది ఇది దోపిడీ పాలకవర్గాలకు నచ్చుటం లేదని వారు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం బనాయించిన దేశద్రోహం ఉపా లాంటి కుట్టపూరితమైన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను కొత్త టెండర్ పిలిచి కార్మికులందరినీ విధుల్లోకి తీసుకోవాలి.




**మందమర్రి ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్):** ఎస్ సి కె ఎస్ సి ఐ టి యు ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటం 4వ రోజు పాల చెట్టు ఏరియాలో సెక్యూరిటీ గార్డులతో భిక్షాటన చేయడం జరిగిందని అన్నారు.. ఈ సందర్భంగా ఎస్సీ కేఎస్ సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ. 220 కుటుంబాలను రోడ్డుపాలు చేయడం అంటే పట్టణ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయటమే కొత్త ఉద్యోగాలు కల్పించారు, ఉన్న ఉద్యోగాలు ఊడుతుంటే మాట్లాడరు ఇదే నా పాలకుల తీరు అని అన్నారు. 220 మంది ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల కుటుంబాలను రోడ్డు పాలు చేయడం అంటే మందమర్రి పట్టణ ఆర్థిక వ్యవస్థ పై దెబ్బ కొట్టడమే అవుతుందని హెచ్చరించారు. పాలకులు కొత్త పరిశ్రమలు తెచ్చి, కొత్త ఉద్యోగాలను సృష్టించి ఉపాధి కల్పించాల్సింది పోయి, ఇప్పుడు ఉపాధి చేస్తున్న కార్మికులు ఉపాధి పోయి రోడ్డుపాలు అవుతుంటే కూడా కనీసం స్పందించకపోవడం ఈ కార్మిక వర్గానికి పాలకులు ఇస్తున్న విలువేంటో అర్థమవుతుందని తెలిపారు. 220 మంది ఉపాధి ఈ పట్టణానికి, ఈ పట్టణంలో జీవిస్తున్న అనేకమంది చిరు వ్యాపారులకు తీవ్రమైన నష్టాన్ని కలిగించే విధంగా మారుతున్న పాలకులు స్పందించకుంటే ప్రజలు, కార్మికులు ఎవరికి తమ గోడును చెప్పుకోవాలనారు. ఓట్లేసి గెలిపించిన ప్రజలు, కార్మికులు ఇబ్బందులు పడుతుంటే పాలకులు ఎందుకు మౌనంగా ఉంటున్నారు. సింగరేణి యాజమాన్యం సైతం గత 12 సంవత్సరాలుగా అంకిత భావంతో విధులు నిర్వహిస్తున్న కార్మికులను ఒక్కసారిగా రోడ్డుపాలు చేయడం దీనిపై ఇప్పటివరకు స్పందించకపోవడం ఎంతవరకు సబబు. ఇప్పటికైనా ప్రజా పాలకులు, సింగరేణి యాజమాన్యం స్పందించి సమస్యకు పరిష్కారం చూపించే విధంగా, తిరిగి కార్మికులను విధులకు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ప్రజల మద్దతుతో ప్రజా పోరాటంగా మలిచి ఉదృతంగా వస్తామని హెచ్చరిస్తున్నామానరు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## టీజీఐఐసి చైర్మెన్ నిర్మలా జగ్గారెడ్డి

### కుట్టు మిషన్ ల పంపిణీ, బ్యూటీషియన్ కోర్సుల ద్వారా మహిళల జీవనోపాధి మెరుగు పడుతుంది: కలెక్టర్ ప్రావీణ్య




**సంగారెడ్డిజిల్లా ప్రతినిధి ఏప్రిల్ 9 (నేటి మన దేశమ్)** సంగారెడ్డి జిల్లాలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ , జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావో -- బేటి పడావో పథకం కింద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 50 మంది లబ్ధిదారులకు కుట్టు యంత్రాలను పంపిణీ చేయగా, మరో 25 మంది లబ్ధిదారులకు బ్యూటీషియన్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా నిర్వహించబడింది. ప్రత్యేకంగా ఆర్థికంగా వెనుకబడిన మహిళలు, ఒంటరి మహిళలు, వితంతువులు, చదువు మధ్యలో మానేసిన వారు మరియు ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఉపాధి అవకాశాలు కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా నిలిచింది. ఈ కార్యక్రమాన్ని సంగారెడ్డి జిల్లా బాలసదనంలో టీజీఐసీసీ చైర్‌పర్సన్ శ్రీమతి నిర్మల జగ్గారెడ్డి మరియు జిల్లా కలెక్టర్ శ్రీ ప్రావీణ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు సంకేతంగా మొక్కల నాటకం కూడా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి టీజీఐసీసీ చైర్‌పర్సన్ శ్రీమతి నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ, మహిళల అభ్యున్నతికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడం లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ శ్రీ ప్రావీణ్య గారు మాట్లాడుతూ, బేటి బచావో -- బేటి పడావో పథకం ద్వారా కుట్టు యంత్రాల పంపిణీ మరియు బ్యూటీషియన్ శిక్షణల ద్వారా మహిళల జీవనోపాధి మెరుగుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనితా సంతోష్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి, సీడీపీఓ చంద్రకళ, రత్నం, చిల్డ్రన్ సూపరింటెండెంట్ విజయ, కౌన్సిలర్లు రమేష్, అశ్విన్, నాయకులు శాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రెండవ రోజు కు చేరిన ఆర్టీజన్ కార్మికుల సమ్మె




**నారాయణపేట ఏప్రిల్ 09(నేటి మన దేశమ్ ప్రతినిధి)** విద్యుత్ శాఖ ఆర్టీజన్ కార్మికుల సమ్మె రెండో రోజుకు చేరింది. ఆర్టిజన్ కార్మికులు 2017 లో ఆర్టిజన్ కార్మికులుగా ప్రభుత్వం లో విలీనం చేసుకునే సందర్భంలో నూతన జీ.వో. ను గత ప్రభుత్వం తీసుకువచ్చింది. ఈ జీ. లో. ద్వారా నియామకమైన ఆర్టిజన్ కార్మికులకు శాశ్వత ఉద్యోగులతో సమానంగా వారికి రావాల్సిన డిమాండ్స్ అందడం లేదని దీని కారణంగా శాశ్వత ఉద్యోగులతో సమానంగా తమకు సైతం రావలసిన జీతభత్యాలు, ఇంక్రిమెంట్లు వచ్చేవరకు ఈ సమ్మె ఆగదని కార్మికులు దీక్షబూనారు. ఆర్టీజన్ కార్మికుల సమ్మె కు తెలంగాణ రాష్ట్ర 11 ఉద్యోగ సంఘాలు మద్దతు తెలుపుతున్నాయి. వీరి మద్దతుతో రాష్ట్రంలోని 23 వేల మంది కార్మికులు సమ్మె బాట పట్టారు. ప్రభుత్వం వీరు కోరిన ఏ.పి.ఎస్.ఈ.బి. రూల్స్ తోపాటు విద్యా అర్హతను బట్టి పదవ తరగతి కల్పించాలని ఆర్టీజన్ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి 1104 యూనియన్ సర్కిల్ ప్రెసిడెంట్ పోలెమోని గోవింద్ రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ నూనె రఘు, 327 యూనియన్ డివిజన్ సెక్రటరీ మైముద్, కె.ఎల్. శ్రీనివాస్, ఎస్.సి, ఎస్.టి. యూనియన్ వెంటన్న, గోవింద్, దేవణ్ణ, టి.ఆర్.ఎస్.వి.కే. నరహరి గౌడ్ మద్దత్తు తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.వి.జే.ఏ.సి. నారాయణపేట చైర్మన్ నర్సింహులు, ఉమ్మడి జిల్లా కన్వీనర్ దిల్ దార్ , రమేష్, బాల్ రాజు , లక్ష్మీకాంత్, జె.వెంకటేష్ , వినోద్ కుమార్, రాములు, తదితరులు పాల్గొన్నారు


# కార్మికులకు పనికి తగ్గ వేతనం అందహించాలి..

## - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్, ఏప్రిల్ 09 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లాలో పనిచేస్తున్న నామినల్ మస్టర్ రోల్ (ఎన్ఎంఆర్) కార్మికులకు శ్రమకు తగ్గ వేతనం అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలోని తన ఛాంబర్ లో, గురువారం, ఎన్ఎంఆర్ వేజెస్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధ్యక్షతన సంబంధిత అధికారులతో నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా దినసరి కార్మికుల చేతనాల పెంపు గురించి చర్చించారు. 2024 – 25 సంవత్సరానికి గాను 15 శాతం, 2025 – 26 సంవత్సరానికి 10 శాతం, 2026 – 27 సంవత్సరానికి 5 శాతం వేతనాలు పెంచారు. కార్మికుల శ్రమకు తగిన వేతనం ఇవ్వడం ద్వారా వారిని గౌరవించినవారిమౌతామని కలెక్టర్ తెలిపారు. కార్మికులకు సంబంధిత వేతనములు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్మిక శాఖ అధికారి రాజలింగు, సిపిఓ జీవరత్నం, డిఆర్డిఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈవో శంకర్, ఈడి ఎస్సీ కార్పొరేషన్ శంకర్, బిసి సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఆర్ అండ్ బి సుభాష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రామారావుపేట గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం అవగాహనతో పాటు వాహనాల తనిఖీలు.



**మందమర్రి ఏప్రిల్ 9 (నేటి మనదేశమ్):** జైపూర్ సిఐ నవీన్ ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో రామారావుపేట గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జైపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గ్రామ ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై, వారితో మాట్లాడి ప్రజలకు భద్రతా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ ఆస్తి సంబంధిత నేరాలు, రోడ్డు ప్రమాదాలు మరియు సైబర్ మోసాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా అపరిచితులపై అప్రమత్తంగా ఉండడం, ట్రాఫిక్ నియమాలు పాటించడం, ఆన్‌లైన్ లావాదేవీలలో జాగ్రత్తలు తీసుకోవడం వంటి అంశాలపై ప్రజలకు స్పష్టమైన సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించగా, సరైన పత్రాలు లేని 66 రెండు చక్రాల వాహనాలు మరియు 3 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. వాహనదారులు తప్పనిసరిగా చట్టబద్ధమైన పత్రాలు కలిగి ఉండాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల భద్రత కోసం ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని, పోలీసులతో సహకరించి సమాజంలో శాంతి భద్రతలను కాపాడాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ పనులు వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, ఏప్రిల్ 9, నేటి మనదేశమ్:** సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో డిసిపి ఎ. భాస్కర్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్ లతో కలిసి సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ విస్తరణపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఎల్.పి.జి. సరఫరాలో ఏర్పడిన అంతరాయాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు, పైప్‌లైన్ సహజ వాయువు వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ విస్తరణ పనులను వేగవంతం చేయాలని, అనుమతుల ప్రక్రియను సరళీకరించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ పనులకు సంబంధించిన అనుమతులను 24 గంటలలో మంజూరు చేసే విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని, ఆలస్యం అయితే 'డీమ్డ్ పర్మిషన్ గా పరిగణించడం జరుగుతుందని తెలిపారు. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ఏర్పాటుకు సంబంధించిన రెంటల్/లీజ్ ఛార్జీలను తాత్కాలికంగా మాఫీ చేయడం జరిగిందని, పనుల వేగవంతానికి సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థలకు 24 గంటల పని సమయం, శబ్ద కాలుష్యం నిబంధనలను పాటించేలా అనుమతులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పి.ఎన్.జి., ఎల్.పి.జి. మధ్య సమన్వయాన్ని పౌరసరఫరాల శాఖ సమర్థవంతంగా నిర్వహించాలని, అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పని చేసి సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ విస్తరణ పనులను వేగవంతం చేయాలని, ప్రజలకు నిరంతర ఇంధన సరఫరా అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, ఏప్రిల్ 9, నేటి మనదేశమ్:** ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ మండలం సీతారాంపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాల పరిసరాలు, మూత్రశాలలు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, మెనూ ప్రకారం సకాలంలో విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించాలని తెలిపారు. పాఠశాలలో ఏమైనా మరమ్మతులు ఉన్నట్లయితే వెంటనే పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, వేసవి అయినందున ఆరోగ్యం దృష్ట్యా పాటించవలసిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from # 5-5-426, M.J. Road, Hyderabad and
Printed at SKYLINE PRESS, # D.No. 5-5-426, M.J. Road, Hyderabad - 500 001 . Ph: 24734846, 9701891645, E-mail: netimanadesam96@gmail.com